# కథా మంజరి

పది కథల సమాహారం




## కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**సెప్టెంబర్ 2021 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari


• సుస్వాగతం

# కథామంజరి శ్రావ్య సంచిక

ఈనెల శ్రావ్య సంచిక కోసం

ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | vii |
| VI | **దీపావళి కథల పోటీ వివరాలు** | | |
| | **క థ లు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | స్మైల్ ప్లీజ్ (యువ కథ) | శ్రీనివాస్ సూపి | 1 |
| 2 | వెన్నెల (యువ కథ) | రేవతి నంద | 7 |
| 3 | ప్రేమతో ముందడుగు (యువ కథ) | పేట యుగంధర్ | 11 |
| 4 | అరుణోదయం (యువ కథ) | కిరణ్ విభావరి | 14 |
| 5 | అది అసలు సంగతి.. (యువ కథ) | గంగాధర్ వడ్లమన్నాటి | 21 |
| 6 | క'న్నీటి' ప్రవాహం (యువ కథ) | రాచమళ్ళ ఉపేందర్ | 24 |
| 7 | దైవం మానుష రూపేణా | శశికళ ఓలేటి | 29 |
| 8 | అభిమాని | భాగవతుల కృష్ణారావు | 35 |
| 9 | జీవత్ తాత పాదుండు | దత్త శర్మ పాణ్యం | 38 |
| కథకుడు చిత్రకారుడు కూడా అయితే .. కథ చలనచిత్రంలా కళ్ల ముందు జాలువారుతుంది. అలా పాఠకులను అలలలో తేల్చే కథ "ఏటిపాలైన యవ్వనం" .. శ్రీ శీలా వీర్రాజు గారి కలం నించి .. ఈ సంచిక ప్రత్యేకం! | | | |
| 10 | ఏటిపాలైన యవ్వనం | శీలా వీర్రాజు | 46 |



# మా జట్టు

**బొమ్మలు**

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

**సాంకేతిక సహకారం**

harbinger PUBLISHING

**సంపాదక సహకారం**

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు

శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు

## SPONSORS


### ఈ సంచికకు ఆర్థిక సహకారం

## OF THE ISSUE

శ్రీ

గంధం యాజ్ఞవల్క్య శర్మ

గారు







# 'కథా'కీయం

'తెలుగు కథ - సామాజిక స్పృహ' అనే విషయం మీద ఓ సాహితీ సంస్థ వారు చర్చా వేదిక నిర్వహించారు. పెద్దవారిని రప్పించి మాట్లాడించారు. అందరూ వారి వారి అభిప్రాయాలను స్పష్టంగా చెప్పారు. ఓ ప్రేక్షకుడిగా అందరి అభిప్రాయాలు సబబుగానే అనిపించినా.. ఓ విషయం మాత్రం విస్పష్టంగా చెప్పాలనిపించింది. 'సమాజంలో ఎదురుగా జరిగే.. ఓ మంచో చెడో, స్వానుభవమో, పక్కవారి అనుభవమో, మనిషిలో కనిపించే గుణమో, నైజమో.. ఇలా ఏ విషయాన్నైనా చూసి, తరించి, చలించి, స్పందించి, రాయాలనే తపన వచ్చి, వాటికి అక్షర రూపం ఇవ్వడమే సామాజిక స్పృహ' అని చెప్పడం జరిగింది. అది కథ కావొచ్చు, కవిత కావొచ్చు, చందోబద్ధమైన పద్యం కావొచ్చు, నవలే కావొచ్చు, వ్యాసం కావొచ్చు.. ఏదైనా అది ఆ స్పందనకి ప్రతిరూపమే.

అలాంటి స్పందనలకు ప్రతిరూపంగా వచ్చిన తెలుగు కథలనే గమనిస్తే.. ఆయా కాలమాన పరిస్థితులకు తగినట్టే కథలు వచ్చాయి. వస్తున్నాయి. వస్తాయి కూడా! కారణం.. ఆ కథలకు పురుడు పోసేవాడు రచయితే. సహజంగా తనకి కలిగే స్పందనలనే కథలుగా రాయగలడు. అలనాటి కన్యాశుల్కం కాలం నుంచి నేటి కరోనా వరకు.. స్వాతంత్ర సమరం నుంచి ప్రపంచీకరణ వరకు, కథాంశాలు మారుతూ, ఏ కాలానికి ఆ కాలం కథలు, కొత్తదనంతో పాఠకుల్ని అలరిస్తూ వచ్చాయి.

సామాజిక స్పృహ ఉన్న కథ అంటే బలహీన, బడుగు వర్గాల కథల వరకే పరిమితం కాదు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలికి తీసే కథాంశాలు, వ్యవస్థలమీద తిరుగుబాటు చేసే కథలు, ప్రేమ.. పెళ్ళి.. బంధాలు.. కుటుంబ వ్యవస్థలకు సంబంధించిన విషయాల కథలు.. వీటికే పరిమితం కాకపోవచ్చు. కాదేది కథకనర్హం.. అన్నట్టు, పాఠకుడ్ని ఒక్కసారి కథలోకి తీసుకెళ్లే ఏ కథైనా మంచి కథే! అయితే అది మంచికా చెడుకా అన్నది బేరీజు వేసుకోవాలి. అలనాటి ఆవు-పులి కథలో ఏముందో మనందరికి తెలుసు. పావురాలు-బోయవాడు కథ ఎంతలా మన మనసులకు తాకిందో తెలుసు. శత వత్సరాలలో వెల్లువిరిసిన ఎన్నో కథలు తెలుగువారి జీవితాల ఉనికిని చాటి చెప్పాయి. ఇలా మనసును తట్టి లేపే ఏ అంశాన్నైనా తీసుకుని ఈ తరం వారి చేత రాయించాలనే ఆలోచనే "కథామంజరి" యువకథ ప్రత్యేక సంచిక తీసుకురావాలనే ప్రయత్నానికి నాంది.

ఈ యువకథ ప్రయత్నానికి తొమ్మిది కథలు మాత్రమే వచ్చాయి. అందులో న్యాయనిర్ణేతగారు ఆరు కథలని ప్రచురణ యోగ్యమైనవిగా సూచించారు. వాటితో పాటు మరో మూడు కథలతో ఈ సంచిక మీ ముందుకు వచ్చింది.

ఇకపోతే.. భాష! కథల్లో ఎక్కువగా ఆంగ్ల పదాలు వాడుతున్నారు. 'వాటర్ ఇస్తారా?', 'మ్యారేజ్ అయింది!' ఇలాంటి చిన్న పదాలను అరువు తెచ్చుకుని, కథలు వ్రాస్తున్నారు. అలాంటి పదాలు ఉపయోగించడం వలన కథ నడత తెచ్చిపెట్టుకున్నట్టు ఉంటుంది. సహజత్వం లోపించేటట్టు చేస్తుంది. అలాంటి పదాలకు మన వాడుక భాషలోనే దీటైన పదాలున్నాయి. అలా అనీ.. కొన్ని మాటలకు కఠినమైన గ్రాంథిక భాషా పదాలో, కొత్తగా అవతరిస్తున్న పదజాలలనో వాడక్కర్లేదు. ఫోన్, మోటర్ సైకిల్, టెలివిజన్.. వంటి మాటలకు తెలుగుభాష పదాలు రాస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. ఈ విషయంలో రచయితలు దృష్టి సారించాలి. టూకీగా .. పాత్రోచితంగా పాత్ర ఆంగ్లం వాడడం తప్పు కాదు. కథనం లో రచయిత ఆంగ్లం వాడడం న్యాయం కాదు. ఎందుకంటే ఇది తెలుగు కథ కదా?!

అలాగే ఒకొక్కసారి కథాపరంగా పట్టుకోసం ఆంగ్ల వాక్యాలు రాస్తున్నారు. పాత్రోచితంగా అవసరం మేర..ఒక వాక్యం ఆంగ్లంలో (తెలుగు భాషలోనే) వ్రాసి, ఆ సంభాషణ పొడిగింపుని తెలుగులో వ్రాయడం వలన కథలో పట్టు సడలిపోదు. అవి ఎంత క్లుప్తంగా ఉంటే అంత మంచిది. మరో విషయం కూడా గమనించవలసినది.. పాత్రల పేర్లు! ఇప్పటి కథల్లో చదువరులకు కొంచెం ఇబ్బంది కలిగించేవి.. ఈ పాత్రల పేర్లే. ఒక విధంగా భాషాపరమైన ఇబ్బందితో 'కంటికి ఇంపు'గా ఉండటం లేదు. ముఖ్యంగా 'న'కారం పొల్లు (్) ఉన్న పేర్లు వాడుతున్నప్పుడు, కథ సౌందర్యం దెబ్బతింటుంది. అసలు మన తెలుగువారిలో 'న'కారం పొల్లు ఉండే పేర్లు ఉండేవి కావు. ఈ కాలంలో 'ఆధునికత' అంటూ పెట్టుకుంటున్న ఈ పేర్లతో, కథ చదువుతున్నప్పుడు భాషాపరమైన అసౌకర్యం కనబడుతోంది. 'కిరణ్ కి టీ ఇచ్చాను' అని వాక్యం చూడ్డానికి, చదవడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఈ నామకరణాలతో అసహజంగా అనిపించే మరో విషయం కూడా చెప్పాలి. డెబ్బై ఏళ్ళ తండ్రి పేరు ప్రవీణ్, కొడుకు పేరు నవీన్ అని కథ నడుపుతారు. ఆ పేర్లతో కథనం నడుస్తున్నప్పుడు, చదివే పాఠకుడికి కొంచెం 'గందరగోళం' అనిపిస్తుంది. కథ వెనక్కి వెళ్ళి మళ్ళీ శ్రద్ధగా చదువుకుని, ముందుకు రావాలి. ఇలా.. పాఠకుడిగా ఎన్నో అనుభవాలు, భాషాపరమైన ఇబ్బందులు చూసి మీతో పంచుకోవాలనిపించింది.

కథ ఆషామాషీగా చదివినా సరే, నరనరల్లో ఇంకిపోయి, హాయిగా అనిపించాలి. ఆర్థికశాస్త్ర పుస్తకమో, సాంకేతిక విషయమో చదువుతున్నప్పుడు అవసరమయే 'ఏకాగ్రత' కథ చదివినప్పుడు ఉండవలసిన అవసరం లేకుండా కథ నడవాలి.. పాఠకుడ్ని నడిపించాలి. అప్పుడే మన తెలుగు కథ వెలుగుల్ని నింపుతుంది. పాఠకుడ్ని చేరుతుంది.

***0***

# విశిష్ట అతిథి



# శ్రీ శీలా వీర్రాజు గారు

అటు కవిత్వం... ఇటు చిత్రలేఖనం.. రెండు కళలలో ప్రావీణ్యత సంపాదించి, పేరు తెచ్చుకున్న అతికొద్ది తెలుగువారిలో మొదటిస్థానంలో చెప్పుకోవలసిన వారు ప్రముఖ సాహితీవేత్త శ్రీ శీలా వీర్రాజు గారు. ఓ రెండు దశాబ్దాల కిందట.. శ్రీ వీర్రాజు గారు రచించిన "మైనా" నవల చదవలేదనే మాట ఏ తెలుగు నోటంటా వినబడలేదు. తన రచనలలో పాత్రలను తీర్చిదిద్దడంలో శ్రీ వీర్రాజుగారి ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కథాకాలం నాటి పరిస్థితులు, మనుషుల మనస్తత్వాలు, మానసిక సంఘర్షణలు పాఠకుడి ముందు సాక్షాత్కరించేలా ఆయా పాత్రలను తీర్చిదిద్దారు. అందుకే ఆ నవల నేటికి కీర్తింపబడే రచనే! అలాగే 1979 - 80 దశకాల్లో ఏ రచయిత పుస్తకమైనా శ్రీ వీర్రాజు గారి కుంచె నుండి కదలాడిన ముఖచిత్రమే ఉండేది.

నేటికి ఎనభై రెండు సంవత్సరాల శ్రీ వీర్రాజు గారు, రాజమండ్రిలో జన్మించి, బాల్యం విద్యాభ్యాసం అక్కడే ముగించి, ఆ తర్వాత కృష్ణాపత్రిక లో చిత్రకారుడుగా, రచనాకారునిగా కొంతకాలం పనిచేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖలో చేరి, అక్కడే రిటైర్మెంట్ తీసుకున్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు గాని, రిటైర్మెంట్ తర్వాత గాని.. కలాన్ని, కుంచెని వదల్లేదు. 'అసలు మనకి మనసుండాలేగాని, సమయం లేకపోవడం ఉండదు. నేను ఆ ఆలోచనలతోనే నా కళా దప్పికను తీర్చుకున్నాను. ఇప్పటికీ తీర్చుకుంటున్నాను' అని ఆనందంగా తన సాహితీ ప్రస్థానం గురించి చెప్తారు. శరత్చంద్, చలం, బుచ్చిబాబుల సాహిత్యం అంటే చాలా ఇష్టం. వారి ప్రభావం నాపై ఉందని అంటారాయన. అందుకేనేమో.. శ్రీ వీర్రాజుగారి కథలలోనైనా, నవలల్లోనైనా, కవితలలోనైనా, వారి బొమ్మలలోనైనా..

ఎక్కువగా మధ్య తరగతి మందహాసాలు, జీవితాలు తొంగిచూస్తాయి. వీటితో పాటు సౌందర్యం, సామాజిక అంశాలు, భావుకత కనబడతాయి.

వెలుగు రేఖలు, కాంతిపూలు, మైనా, కరుణించని దేవత మొదలగు నవలలు, మళ్లీ వెలుగు, కిటికి కన్ను, ఎర్ర డబ్బా రైలు వంటి కవిత సంపుటాలు, సమాధి, మబ్బుతెరలు, బండిచక్రం, రంగుటద్దాలు వంటి తొమ్మిది కథాసంపుటాలు, వ్యాస సంపుటాలు శ్రీ వీర్రాజుగారి అక్షర సంపదలు.

వీరి చిత్రాలు ఆధునిక చిత్రాలకు భిన్నంగా ఉంటాయి. అంటే.. వీరి చిత్రాల్లో పల్లెల అందాలు, ప్రకృతి అందాలు, సంస్కృతి, సంప్రదాయాలు సజీవంగా కనబడతాయి. మనదేశంలోనే కాకుండా పశ్చిమ జర్మనీలో కూడా వీరి చిత్ర ప్రదర్శనలు జరిగి, చాలా ప్రాచుర్యం పొందాయి. ఆ కోవలోనే .. శిల్ప రేఖ, చిత్రకారీయం వంటి రేఖాచిత్రాల సంపుటాలు కూడా శీలా వీర్రాజుగారి చిత్ర సంపదలుగా నేటికి ప్రకాశిస్తున్నాయి.

ఎన్నో అవార్డులు, పురస్కారాలు పొందిన శ్రీ వీర్రాజుగారి "మైనా" నవల 1969 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ నవలగా గుర్తింపబడింది. 1991 లో వీరి కథల సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ బహుమతి వచ్చింది. 2014 లో బోయి భీమన్న కవితా పురస్కారం వీరిని వరించింది.

ఇలా కథలు, నవలలు, కవిత్వం, చిత్రలేఖనం.. లో తనదైన ప్రత్యేకతను సంపాదించి, నేటి తరం రచయితలకు, చిత్రకారులకు మార్గదర్శిగా గుర్తింపబడిన శ్రీ శీలా వీర్రాజుగారిలో ఇంకో ప్రత్యేకత ఉంది. అది.. సాత్వికం. ఆయన కోపతాపాలకు అతీతంగా ఉంటారు. నిగర్వి. ఆయన ఆత్మకథను "పడుగు పేకల మధ్య జీవితం" కవితా రూపంలో వ్రాసారు. కాని ఇందులో అందరి జీవితాలు కనబడతాయి.

వీరి శ్రీమతి శీలా సుభద్ర దేవి గారు కూడా ప్రముఖ రచయిత్రి, కవయిత్రి. ఆవిడవీ తొమ్మిది కవితా సంపుటాలు, రెండు కథల సంపుటాలు వెలువడ్డాయి. ఉత్తమ రచయిత్రిగా తెలుగు విశ్వవిద్యాలయం వారి అవార్డుతో పాటు ఇతర సంస్థల పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ కథా రచయిత కీ.శే. కొడవంటి కాశీపతిరావు గారు సుభద్ర దేవి గారి సోదరుడే.

వెరసి శీలా వారి గృహము సాహితి సరస్వతీ నిలయమనే చెప్పాలి.

'లివింగ్ లెజెండ్' అని తెలుగువారు సగర్వంగా చెప్పుకోదగ్గ సవ్యసాచి శ్రీ వీర్రాజు గారు, ఈ సంచిక విశిష్ఠ అతిధిగా విచ్చేసి, కథామంజరికి వన్నె తెచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. తెలుగు సాహితీ ప్రియులకు వారు మరిన్ని కథా సౌరభాలను అందించడానికి వారికి ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటూ.. అభివందనాలతో ..

**కథామంజరి**

***0***

# కథా మార్గదర్శి



## శ్రీ గుడిపాటి వెంకట చలం గారు

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కి ముందుమాట రాయమని అడిగితే..'మీ ఈ కవిత్వానికి తూచే రాళ్లు తన దగ్గర లేవన్నాడు' చలం. 'తూచవద్దు, అనుభవించి పలకరించ'మన్నాడు శ్రీశ్రీ! ఇద్దరి 'ఇజాలు' వేరే అయినా, శ్రీశ్రీ గారు తన 'మహాప్రస్థానం'కి ముందుమాటలు రాయమని చలంగారిని కోరడానికి ప్రధాన కారణం.. వారికున్న సాహితీ పటిమ, అనంతమైన విజ్ఞాన సంపద. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎవరికీ లేని ఓ ప్రత్యేకత ఉన్న రచయిత చలం. మొహమాటం లేకుండా, లోకానికి భయపడకుండా తన ఆలోచనలకి అక్షర రూపం ఇచ్చిన రచయిత. మన పక్కనే మామూలుగా పడున్న వాటిలో కూడా అసాధారణతను చూడగలిగిన తెలుగు రచయిత చలం తప్ప మరొకరు లేరని ఘంటాపథంగా చెప్పగలం. భాష, నిరాడంబరత, కథనంలో వేగం, భావుకత, సౌందర్యాదరణ.. ఇవన్నీ చలం రచనలలో కనబడతాయి. చలం రచనల గురించి రాస్తూ, ప్రఖ్యాత రచయిత కీ.శే. పురాణం సుబ్రహ్మణ్య శర్మ "బాల్యంలో చలం పేరు.. వృద్ధాప్యంలో చలం పేరు. చిత్రాంగి, పురూరవ, జయదేవ, హరిశ్చంద్ర వ్రాసిన చలం పేరు; మైదానం, బ్రాహ్మణీకం, హంపి కన్యలు మొదలగు నవలలు, కథలు వ్రాసి తెలుగు పాఠకలోకాన్ని ఇటూ అటూ కూడా ఉర్రూతలూగించిన చలం పేరు. అతని .. జీవితం, సాహిత్యం, ఆలోచనలు, స్త్రీ వ్యామోహం, ఆదర్శాలు, విసుగు, కోపం, నిరాశ, నిస్పృహ, ఆనందం, విషాదం .. ఒకటేమిటి అన్నింటినీ నలుగురితో పంచుకుని జీవించాడు!" అంటారు.

అంతకంటే చలంగారిలో ఉన్న గొప్పతనం ఏమిటంటే .. 'భగవద్గీత'కు వ్యాఖ్యానం రాసిన చేతులే, 'మహా ప్రస్థానా'నికి యోగ్యతా పత్రం రాసాయి.

చలంగా వాసికెక్కిన గుడిపాటి వెంకట చలంగారు 1894 లో కొమ్మూరి సాంబశివరావు, వెంకటసుబ్బమ్మ దంపతులకు జన్మించారు. దరిమిలా గుడిపాటి వెంకటరామయ్యగారికి దత్తత వెళ్ళారు. పిఠాపురంలో, మద్రాసులో చదువు సాగించారు. కొన్నాళ్ళు టీచర్ ట్రెయినింగ్ కాలేజిలో ఉద్యోగం చేసి, తర్వాత పాఠశాల తనిఖీ అధికారిగా పనిచేసారు. వ్యక్తిగత జీవితంలో ఎక్కువ కష్టాలు అనుభవించి, చివరలో అరుణాచలం వెళ్ళిపోయి, రమణ మహర్షి ఆశ్రమంలో ఉండిపోయారు. జీవితంలో ముప్పావు వంతు ధార్మిక విషయాల మీద విముఖత చూపిన చలం, ఒక్కసారి మారిపోవడం ఆ రోజుల్లో చర్చనీయాంశమయ్యింది. అయితే తన మధనకు సరైన స్పందన రాకపోవడం ఆ మార్పుకు కారణం అని కూడా అనేవారు.
మైదానం, దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, స్త్రీ, విషాదం, హరిశ్చంద్ర నాటిక .. వంటివి వీరి సుప్రసిద్ధ రచనలు. ఆయన రాసిన చాలా కథలు పత్రికలో వచ్చినవి కూడా నిక్షిప్తం కాలేదు. 'చలం కథలు ఆ నిమిషానికి కులాసాగా చదవడానికి పనికొస్తాయి' అని మునిమాణిక్యం గారు, 'చలం కొత్త యుగాన్ని ప్రారంభించాడు' అని రాయప్రోలువారు .. తమ తమ అభిప్రాయాలని వెళ్లబోస్తే, 'ఒక గొప్ప కవిత్వపు పంక్తి కోసం నూరు డబ్బాల చెత్త రాస్తాడు' అంటూ బసవరాజు అప్పారావుగారు కుండ బద్దలు కొట్టారు.

చలం సాహిత్యం మీద విమర్శనలు కూడా ఎక్కువే! లోకో భిన్న రుచిః .. అనుకోవడమే మేలు.
'మంచి-చెడు' మాట ఎలావున్నా.. తెలుగు సాహితీ జగత్తులో చలం సాహిత్యానికి ఓ గుర్తింపు ఉంది. విమర్శలతో కూడా 'పాపులారిటీ' సంపాదించినది చలం గారే. సరిగ్గా ఈ రోజుకి ఓ శతాబ్దం కిందట చలం రచనలు మొదలెట్టారు. వంద సంవత్సరాలు గడిచిన చలం సాహిత్యం మీద చర్చలు, వాదోపవాదాలు ఇప్పటికీ జరగడం ఓ రకంగా ఆ సాహిత్యానికి గుర్తింపే అనుకోవడంలో తప్పులేదు.

ఈ సంచిక విశిష్ట అతిధి శ్రీ శీలా వీర్రాజుగారికి ఇష్టులైన రచయితలలో ఒకరైన చలంగారిని ఈ సంచిక కథా మార్గదర్శిగా స్మరించుకోవడం ముదావహం.

***0***

# కథామంజరి

## దీపావళి కథల పోటీ

దీపావళి అంటే సాహితీ ప్రియులు ఎదురుచూసేది .. మంచి కథల ప్రత్యేక సంచిక. ఆ సంచికను దాచుకుని, అప్పుడప్పుడు చూసి మురిసిపోతూ, చదివి ఆనందపడుతూ ఉండేలా తీర్చిదిద్దడానికి కథామంజరి తలపెట్టింది. పదికాలలపాటు నిలిచేలా కథలు అందించాలని.. ఈ దీపావళి కథల పోటిని నిర్వహిస్తున్నాం.

| | | | |
|---|---|---|---|
| ప్రథమ బహుమతి | ₹ 5,116/- | ద్వితీయ బహుమతి | ₹ 3,116/- |
| తృతీయ బహుమతి | ₹ 2,116/- | 12 ప్రత్యేక బహుమతులు | ₹ 516/- |

నిబంధనలు

- ఇతివృత్తం ఏదైనా పర్వాలేదు. 1500 పదాలకు మించి ఉండకూడదు.
- కథను తెలుగులో 'వర్డ్' లో 'యూనికోడ్' లో టైపు చేసి పంపాలి. 'పిడియఫ్' లో పంపే కథలు అనుమతించబడవు.
- కథతో పాటు వేరే పేజీలో హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో.. కథ స్వీయ రచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, అలాగే ఇతర సాంఘిక మాధ్యమాలలో ప్రచురణ/ప్రసారణ జరగలేదనే హామీని పొందుపరచాలి. పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా ఎంపిక చేసుకుని వీలువెంబడి కథామంజరిలో ప్రచురణ జరుగుతాయి. ప్రచురణ కు తీసుకున్న కథలను శ్రావ్య సంచికలో తీసుకునే అవకాశం ఉంది. వీటికి అంగీకారం ఈ హామీపత్రంలోనే పొందుపరచాలి.
- కథల హామీపత్రం మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాసి పంపాలి.
- ఈ కథలను submit@kathamanjari.in కు ఇమెయిల్ ద్వారా 05.10.2021 తేది రాత్రి పది గంటలలోగా మాకు చేరేలా పంపించాలి. ఆ తర్వాత వచ్చే కథలను పోటీకి పరిశీలించడం జరగదు.
- కథల పోటీ ఎంపిక విషయంలో కథామంజరిదే తుది నిర్ణయం.

కథామంజరి దీపావళి ప్రత్యేక సంచిక ప్రత్యేకంగా ముస్తాబై నవంబరు ఒకటో తారీఖున మీ నట్టింట వెలుగుతుంది.

ఈ పోటీలో కథకులు అందరూ మంచి కథలతో పాల్గొని, విజయవంతం చేయవలసినదిగా కోరుతున్నాం!



# స్మైల్ ప్లీజ్

యువ కథ

శ్రీనివాస్ సూపి

వెంకటేష్ ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు.. రంగస్థల నటుడు కూడా! నాటకాలు అంతరించినా.. గోడకు ఏకపాత్రాభినయ ఫొటోలతో పాటు, అతని జులపాల జుట్టు కూడా ఇంకా అలానే వేళాడుతూనే ఉంది. వయస్సు ముప్పై అయిదేళ్ల లోపే ఉంటుంది. అతని బక్కపలుచని దేహం ఏ పాత్రకైనా నప్పుతుంది. వేసిన ప్రతి పాత్రలో ఒదిగిపోతుంది. నూటముప్పయిరెండు కోట్ల పాత్రల్లో, తొంభై శాతం పేద మధ్య తరగతి ముఖాలవే కదా! రేఖలు స్పష్టంగా కనపడుతున్న రెండు అరచేతుల ఫొటోను చూడగానే వెంకటేష్ కు తన ప్రేమకాలం గుర్తొచ్చింది.

ఆమెకు అతను ఇచ్చిన మొదటి కానుక అది. మూడు రోజులపాటు సమ్మక్క సారక్క జాతర్లో ఫొటోలు తీస్తున్నాడు వెంకటేష్. తన స్నేహితురాళ్లతో కలిసి ఆ జాతర కొచ్చిందో అమ్మాయి. వెంకటేష్ ను దాటి ముందుకెళ్ళి, మళ్ళీ ఒకడుగు వెనక్కేసి 'బ్లాక్ అండ్ వైయిట్ ఫొట్వలే తీస్తవా' అంది .. అతని ముఖంలోకి చూస్తూ! ఆమె అలా అనగానే స్నేహితురాళ్ళు పకపకా నవ్వారు.

ఇంటికెళ్లాక కెమెరా క్లీన్ చేస్తుండగా.. ఆమె మాటలు, ఆమె స్నేహితురాళ్ళ నవ్వు వెంకటేష్ కి మళ్ళీ ధ్వనించాయి. కెమెరా అక్కడ పెట్టి లేచి అద్దంలో చూసుకున్నాడు. బ్రష్ తో ముఖానికి రంగేసుకొని తృప్తి పడ్డాడు, ఆ తరువాత చేతులు చూసుకుంటూ ఉస్సూరుమన్నాడు.

గుడిసె అక్కడక్కడ కురుస్తోంది. బయట వర్షం నోరు తెరిచి అరుస్తోంది.

“అమ్మా నేనేందుకే కర్రెగున్నా..” అని తల్లినడిగాడు.

“ఒక్క నువ్వేనా! అగో.. మీనాయిన, మీ తాత, మొత్తం మన వంశెపు రంగే అంత. నలుపు మన గుర్తింపు! మనదే ఈ దేశపు అసలు రంగు..” అంటూనే ‘నీ చెవి ఇటు పడెయ్' అన్నట్టు సైగ చేసేసరికి వెంకటేష్ ఆసక్తిగా ముందుకు వంగాడు. “తెలుపు, ఎరుపు గోధుమ రంగోళ్లంతా ఇంగిలీసోడికో, డచ్చోడికో.. ఎవడికి పుట్టారో తెలియని సంకర రకాలు!!” అంది. ‘ఢాం’ అని పెద్ద ఉరుము శబ్దం వినపడటంతో, అర్జునా, అర్జునా.. అని అరిచారెవరో.

ఆ మరుసటి రోజు జాతరలో రంగు రంగుల పూలపూల డ్రెస్ వేసుకున్నాడు వెంకటేష్. బారుజెడ చేతిలో పట్టుకొని, వడిసెల తిప్పినట్టు తిప్పుకుంటూ వస్తూ, దూరం నుంచే అతన్ని ఓరకంట చూస్తోంది.. నిన్న కనిపించిన అమ్మాయే! అతన్ని దాటుకొని వెళ్ళి ఆగింది. శరీరం కదల్చకుండానే మెడ వెనక్కి తిప్పి వెంకటేష్ ను చూస్తూ 'కలర్ ఫోట్వలూ తీస్తావన్నమాట' అంటూ అప్పటి వరకూ చేతిలో ముందున్న జడను విసురుగా వెనక్కు తోసేసరికి.. ఆమె జడగంటలు అతని గుండెకు తాకాయి. వెళ్తోన్న ఆమెకు వినపడేలా 'పిల్లా' అని అరిచాడు. అది విని ఆమె వెనక్కు తిరిగింది.. 'ఏంటన్నట్టు'! ఆగి చూస్తుండగా 'నీ పేరేంది' అని అరిచాడు వెంకటేష్.

"పిల్ల అనే పిలుచుకో బానే ఉంది!" అంటూనే, అటుగా వస్తోన్న ఇంకో అతని జేబులో పెన్ను చేతిలోకి తీసుకుంది. అటు తిరిగి వెళ్ళిపోతుండటంతో 'హే..చెప్పి వెళ్ళు' అని మరింత గట్టిగా అరిచాడు వెంకటేష్. ఆమె అతనివైపు తిరుగుతూ తన అరచెయ్యి చూపింది. దానిపై 'పద్మ' అని రాసుంది. అలా ఆ సంతలో వెంకటేష్ తన నుండి తాను తప్పిపోయాడు. జాతర వాళ్ళిద్దరి మధ్య ప్రేమకు పెళ్ళికి కారణమయ్యింది.

మరుసటి రోజు భుజాన కెమెరా బ్యాగుతో రమణగుట్ట దిగుతూ "ఈసారి ఫోటో కాంపిటీషన్లో ఈ మెట్లు ఫోటోతీసి 'ఎ హైట్ గ్యాప్ అనో, బిట్వీన్ ద రిచ్ అండ్ పూర్'..అనో క్యాప్షన్ పెట్టాలి" అని మనసులో అనుకున్నాడు వెంకటేష్.

'ఏం పోగ్రం బిడ్డా అని ఎవరో పలకరిస్తే.. 'పెండ్లి పోగ్రం బాబాయ్' అనుకుంటూ, గుట్ట మెట్లు దిగుతున్నాడు వెంకటేష్.

చెన్నయ్ దగ్గర పల్లెటూరు నుండి బతుకు తెరువుకోసం పదేళ్ల క్రితమే ఇక్కడికొచ్చాడు. అందుకే అతని మాటలో తమిళ యాస ఉంటుంది. అతను వెళ్ళిన చోట పెళ్లివారిల్లు యమా కలర్ ఫుల్ గా ఉంది. 'స్మైల్ ప్లీజ్' అంటూ కంటికి కెమెరా అడ్డం బెట్టుకుంటూ తన పనిలో నిమగ్నమయ్యాడు వెంకటేష్. పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటిసింది.

మర్నాడు ఉదయాన్నే లేచి, బయటకు వెళ్ళడానికి తయారవుతుంటే.. "నాన్నా స్కూల్ ఫీజ్ వారం రోజుల్లో కట్టకపోతే ఆన్ లైన్ క్లాసులకు అలో చెయ్యమని టీచర్ వార్నింగ్ ఇచ్చారు!" ఫిఫ్త్ క్లాస్ చదువుతున్న పెద్దకూతురు అతని దగ్గరకు వస్తూ మెల్లగా అంది.

"సరే అమ్మా" అని అంటుండగా.. 'నాన్నా నా బర్త్ డే ఇంకో టెన్ డేస్ లో ఉంది. మంచి డ్రెస్ తీసుకుంటావా!" అని గారాలుపోతూ చిన్న కూతురు అడిగింది. వాళ్ళకు సమాధానం చెప్పబోతుండగా.. "ఇప్పటికే రెండు నెలలు బాకీ ఉన్నాం.. కిరాణా కొట్టు బాబాయ్ ఆగేటట్టు లేడు. పాలోడైతే మరీ పరువు తీస్తున్నాడు!" అన్న

భార్య మాటలు వినబడ్డాయి. తనకేం సమాధానం చెప్పకపోవటంతో చిన్న కూతురు అతని వంక సీరియస్ గా చూసింది. ఆమె చూపులో భావాన్ని గ్రహించి 'ఓకే' అని తలాడిస్తూ తనని నవ్వించే ప్రయత్నం చేశాడు. 'కుంభ రాశి వారికి బ్రహ్మాండంగా ఉంది. రాబోయే కాలమంతా పట్టిందల్లా బంగారం'..అని టీవీలో రాశిఫలాలు చెబుతున్నారు. పిల్లలు హోం వర్క్ చేసుకుంటూ.. 'నాన్నా నీది కుంభరాశే కదూ' అన్నారు. చొక్కా వేసుకుంటూ.. "అవునమ్మా! కరోనా వల్ల పోయినేడంతా పనిసాగక అందరికి అప్పు పడ్డాం. వచ్చేది పెండ్లిళ్ల సీజనే కదా. ఇవ్వాళ రేపట్ల ఆర్డర్లు మొదలవుతాయి. అన్ని బాకీలు తీరుద్దాం, అన్ని ఖర్చులూ ఎల్లదీద్దాం!" అన్నాడు వెంకటేష్.

"లాక్ డవున్ మళ్ళీ ఏస్తే" అని పద్మ అంటుండగా, పాప హాచ్ మని తుమ్మింది.

ఆఖరు గుండీ పెట్టుకుంటున్న వెంకటేష్ "దివాళ తీయటం అంటే గవర్నమెంటుకు కూడ తెలిసొచ్చింది. ఇంకోసారి లాక్ డవున్ పెట్టదు. కరోనాతో సహజీవనం తప్పదని కూడా చెపుతున్నారుగా!" అంటూ బయలుదేరాడు.

కెమెరా బ్యాగు భుజాన తగిలించుకొని గుట్ట దిగుతున్నా వెంకటేష్ ని.. "ఏం పోగ్రం కొడుకా" అని ఎవరో అడిగేసరికి.. "పుట్టిన రోజు పోగ్రాం అమ్మా!" అంటూ సమాధానం చెప్పి ముందుకు పోయాడు. 'స్మైల్ ప్లీజ్' ..అంటూ తాను ఫొటో తీయబోతున్న వాళ్ల ముఖాల్లో నవ్వు పువ్వు పూయించే యత్నం చేస్తున్నాడు వెంకటేష్.

రెండ్రోజులు గడిచాయి.

ఇంట్లో కట్టెలపొయ్యి మీద అన్నం వండుతోంది పద్మ. చిన్న కూతురు తండ్రి భుజమ్మీద చేతులేసి ఉయ్యాలూగుతోంది. పెద్ద కూతురు ఏదో పనిలో ఉంది. ఇంతలో టీవీలో బ్రేకింగ్ న్యూస్ లో 'రాష్ట్రంలో రేపటినుంచి లాక్ డవున్'..అని చెపుతుండేసరికి షాక్ కు గురయ్యాడు వెంకటేష్. న్యూస్ రీడర్ వార్తలు చెప్పుకుపోతోంది. వెంకటేష్ భార్య భయం భయంగా టీవీ వైపు చూస్తోంది. ఇంతలో అన్నం పొంగి పొయ్యి పాలయ్యింది.

తెల్లారి యధాప్రకారం కెమెరా బ్యాగు తగిలించుకొని 'పోయొస్తా' అని చెప్పుకుంటు, గడప దాటుతుండగా 'గీ లాక్ డవున్ల యాడికి పోవుడూ' అని అతని భార్య అడిగేసరికి 'ప్చ్'..అని నిట్టూర్చాడు వెంకటేష్. గుట్ట మెట్లు దిగుతున్నా ఆరోజెవరూ పలకరించలేదు. మెయిన్ రోడ్ లో హ్యాప్పీ స్టుడియో వెలవెలపోతోంది. లోపల లైట్ స్టాండ్ లా, ఒక్కడే కూర్చొని ఉన్నాడు వెంకటేష్. డార్క్ రూముని మించిన చీకటి అతని మనసులో ఆవరిస్తోంది.

ఇంటికొచ్చేసరికి చిమ్మ చీకటిగా ఉంది. "కరెంటు బిల్ ఆదా చేస్తున్నారుగా, ఆ డబ్బుతో కారుకొనొచ్చు" అని అంటుండగా .. "అంత సీన్ లేదు" అని అంది చిన్న కూతురు.

'ఏం' అడిగాడు వెంకటేష్.

“ఫ్యూజ్ పీక్కెళ్లారు! నీ మొఖం అందంగా ఉంటుంది కదా.. చూస్తారట! రేపొకసారి వాళ్లాఫీసుకు రమ్మన్నారూ..!’ అంది పెద్ద కూతురు.

“ఇంగో.. గివి దీస్కపోయి కరెంట్ బిల్ కట్టు” అంటూ తన చెవి దిద్దులిచ్చింది అతని భార్య.

మరుసటి రోజు.. “లాక్ డవునే కదా ఇక్కడేం చేద్దాం మా వూరెల్దాం” అని అన్నాడు వెంకటేష్.

“ఎన్నాళ్ళనెల్తాం ఊరు.. ఇక్కడ ఇంటద్దె, షాప్ అద్దె కట్టాల్సిందేకదా!” అందామె.

“తిండికి కూడా ఇబ్బందైతంది కదా”..అని అతనన్నాడు.

మరేం మాట్లాడకుండా.. అతనితో బయలుదేరారు.

“వచ్చారా బిడ్డ మీ కోసమే ఎదురు చూస్తున్న, కలోగంజో తిని బతుకుదాం!” అని వెంకటేష్ తల్లి ప్రేమగ అంది. పిల్లలు పల్లెలో ప్రశాంతతని అనుభవిస్తున్నారు. ఆ ఊరి తమిళ్ సంప్రదాయ కట్టు బొట్లు వింతగా ఉన్నాయి. బయటికెళ్ళొచ్చిన వెంకటేష్ తో తమిళంలో ఏదో ప్రశ్నించింది పెద్ద కూతురు. అది విని ఆశ్చర్యపోయాడతను. భార్య కూడా తమిళం నేర్చుకునే సరికి మరింత షాక్ అయ్యాడు వెంకటేష్. వారం రోజుల తరువాత ఒక రోజు అతని తల్లికి విపరీతమైన జ్వరమొచ్చింది.. పరీక్షించిన ఆర్ఎంపీ డాక్టర్. అర్జంట్ గా సిటీకి తీసుకెళ్లండి అని తొందరపెట్టాడు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉండటంతో, తన మెడలో తాళిబొట్టు తీసిచ్చింది పద్మ. అందరు కలసి, తిరిగి పార్శిగుట్ట వచ్చేసారు.

ఆ రోజు ఇంట్లో నుంచి బయలుదేరుతుంటే, వెంకటేష్ కి అతని భార్య ఒట్టి టీ గ్లాస్ చేతికిచ్చేసరికి.. ‘టీ ఏది’ అని అడిగాడు. ఆమె కళ్లెత్తి చూడలేదు. కిందకు చూస్తూనే తమిళ్ లో ఏదో అంది. బయటకు వెళ్ళిన తర్వాత కూడా .. 'పాతబాకీ చెల్లు చేసేదాక పాలువోయనన్నాడు..’ అన్న ఇందాక భార్య మాటలు చెవుల్లో ధ్వనించాయి. స్టుడియోల కూర్చొనుండంగ.. సెల్లు రింగ్ అయ్యింది. పెండ్లి ఆర్డరేమో అని ఆశగా ఫోన్ ఎత్తాడు. “స్టుడియో ఎక్విప్మెంట్ కొనెటందుకు డబ్బు తీసుకున్నవ్ కిస్తీలు కడతలేవ్.. గిట్లైతె వచ్చి సామానేస్కపోత..” అని అప్పిచ్చినతని హెచ్చరిక వినిపించింది. అది కట్ చేసి పక్కన పెట్టాక కొద్దిసేపటికి ఫోన్ మళ్ళీ రింగయ్యింది. లిఫ్ట్ చేయగానే.. 'మడిగె కిరాయి మూడు నెలల్నుంచి కడ్తలేవు.. గీ పస్టుకు గిన గట్టకపోతె మంచిగుండది చెప్తన్న' అంటూ ఓనర్ వార్నింగ్ వినిపించింది.

ఆసాయంత్రం గుట్ట మెట్లెక్కుతుంటే ఫోన్ రింగయ్యింది.. జేబులోనుంచి బయటకు తీసి లిఫ్ట్ చేస్తే 'నా ఇంటి అవసరాల నిమ్మిత్తం అని ప్రాంసరీ నోటు రాసిచ్చావ్. ఇందుకు సాక్షులు ఎద్దుమూతి ఎంకన్న, పిల్లితోక రాములు అన్నావ్, నూటికి రెండు రూపాయల వడ్డీతో ఎప్పుడు తీరుస్తావయ్యా నారెండు లక్షల అప్పు' అని ఎవరిదో గొంతు వినిపించింది. కట్ చేసి జేబులో వేసుకొని ఇంటికి వెళ్లి చొక్కా విప్పుతుండగా, పిల్లల మొఖాలు విచారంగా ఉన్నట్టు అనిపించింది. 'ఏమైందమ్మా..అందరు ఎట్లనో ఉన్నరు.. కొంపదీసి గా

సీరియల్ అయిపోయిందా' అని అంటుండగా.., 'నోటికొచ్చిన బూతులు తిట్టి.. ఇప్పుడే వెళ్ళారు కిరాణ కొట్టోళ్ళు..' అంది వెంకటేష్ భార్య జెడ కొప్పు చుట్టుకుంటూ. ఆమె అలా అంటుండగా పిల్లల కళ్లల్లో నుంచి కన్నీరు కారుతుంటే వెంకటేష్ వాళ్ల దగ్గరికెళ్లి కన్నీరు తుడుస్తూ, 'స్మైల్' అంటూ నవ్వించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవటంతో, వాళ్ల నోటిని నవ్వు షేప్ లోకి తెచ్చేందుకు యత్నిస్తున్నాడు. అందరూ చాపమీద పడుకున్నారు. ఆరోజు ఏ ఒక్కరిలోనూ నవ్వు భంగిమ లేదు. ఇంతలో వెంకటేష్ భార్య మాట్లాడటం మొదలుపెట్టింది.

'తాళిబొట్లు, ఉంగరాలు అన్నీ తాకట్టు పెట్టేశావ్. నేను, పిల్లలు ఇంక మేమే మిగిలాం'.. అని అంటుండటంతో వెంకటేష్ బాధతో విలవిల్లాడాడు. తనకేదో చెప్పేందుకు నోరు తెరుస్తుండగా.. 'ఇద్దరూ ఆడపిల్లలే పుట్టటం నీకు మేలే అయ్యింది' అని అంది. ఆమె అలా ఎందుకు అన్నదో అని ఆలోచిస్తుండగా.. 'మమ్మల్నీ తాకట్టు పెట్టకు' అంది. 'ఉఫ్' అని నిట్టూరుస్తుండగా.. 'పూర్తిగా అమ్మేయ్, మేం అనుకోవట్లేదు.. మళ్లీ నీ దగ్గరకు రావాలని' అని కటువుగా అంటూ అటువైపు తిరిగింది.

అందరూ నిద్రపోయాక వెంకటేష్ లేచి నిలుచున్నాడు. గోడ మీద తగిలించి ఉన్న తన నాటక ఫొటోల మీదుగా అద్దంలోకి చూస్తున్నాడు. అతని ముఖమూ విచారంగానే ఉండటంతో, మరింత దగ్గరికెళ్ళి 'స్మైల్' అన్నాడు. భంగిమ మారకపోవటంతో 'స్మైల్ ప్లీజ్' అన్నాడు. అయినా లాభం లేకపోవటంతో, సొరుగులో నుంచి లిప్ స్టిక్ తీసి అద్దం మీద దిద్దాడు. కొంతసేపటి తరువాత అద్దంలో అతని ముఖం జోకర్ లా అనిపించింది. కానీ స్మైల్ రాలేదు. 'నేను చేతగానోడ్ని కాదు. నన్ను చేతగానోడిగా మార్చిందీ లాక్డవున్' అని గట్టిగా అరిచాడు.

ఆ ఉదయం మెట్ల వైపు నడుస్తుంటే ఏడుస్తున్న పిల్లలు అతన్ని చూసి ఏడుపు మరుస్తున్నారు. ఇంకొందరు వింతగా చూడసాగారు. మెట్ల మధ్యకు వచ్చాక, అతను ఒక కాలు కొద్దిగా మడిచి మరో కాలు నిటారుగా నిలిపి రెండు చెతులూ గాల్లోకెత్తాడు. ఒక సిగరెట్ తీసి వెలిగించి, మానసిక వత్తిడి నుంచి రిలాక్స్ కోసమన్నట్టుగా తోచిన స్టెప్పులు వేస్తున్నాడు. అలా అతను గతం లోకెళ్ళాడు.

అతని చిన్నప్పుడు పిల్లలు క్రికెట్ ఆడుతున్నప్పుటి సంఘటన గుర్తుకొచ్చింది.
వెంకటేష్ ఫెన్సింగుకు అవతల నుండి చూస్తున్నాడు. కొట్టిన షాట్ కి బంతి దొర్లుకుంటూ ఫెన్సింగ్ దగ్గరికొచ్చింది. దాన్ని వాళ్లకు అందిచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. 'ముట్టుకోకు' అన్న అరుపు వినపడింది. వెంకటేష్ అటువైపు చూడగా ఒక పిల్లోడు “చెప్పులు కుట్టుకునేవాడి కొడుకువి, డప్పు కొట్టుకొనేవాడి మనవడివి నువ్వు మా బాల్ ముట్టుకోకూడదు” అని హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు.

ఆసాయంత్రం వెంకటేష్ తండ్రి చెప్పు కుడుతుండగా, తాత డప్పుకు నిప్పు కాపుతున్నాడు. దిగులుగా కూర్చున్నాడు వెంకటేష్ ను చూస్తూ "ఊరుకోరా.. కడజాతోడివి కనుకే కంచీ కాడున్నావ్! లేకుంటే ఆళ్లతోనే ఆడకపోదువా.. అయినా ఈ రాతలు ఇప్పటియి కాదులేరా... ఆ పిల్లల మీద పగపెట్టుకోబాక. కోడి, మేక సరాలు కోసినట్టు మన కుతికె కోసి ఆళ్ల కులాలకు బలిచ్చినట్టున్నార్రా. మన తలలు అందుకే కిందికేళాడుతున్నాయ్, తలల్ని తిట్టుకోటం కాదు, తలరాతల్ని మార్చుకోవాలి. అటొక చెప్పు, ఇటొక చెప్పు కుతికెకు కుట్టుకోనైనా సరే.. మన తలల్ని ఎర్రజెండాల్లా ఎగరెయ్యాల్రా!" అన్నాడు. తాత మాటలు అర్ధమయ్యే వయస్సు కాదు కనుక, ఆ మాటలు అతని బాధను పోగొట్టలేకపోయాయి.

ఆలోచనల్లోంచి తెరుకుని, అలా నడుస్తుండగా ఒక చెత్త కుండీ ముందు దిబ్బలో ఎవరో పారేసిన జోకర్ బొమ్మ కనపడింది. దానిని చూడగానే అతనిలో దిగులు ఎగిరిపోయింది. పెదవుల్లో నవ్వు అలుముకుంది.. సన్నగా వర్షం మొదలయ్యింది.. ఉన్నట్టుండి చొక్కా గాల్లోకి విసిరేసి.. ఒక స్లోగన్ బోర్డ్ చేతుల్లోకి ఎత్తి పట్టుకొని మెట్ల మీదుగా పరుగు తీశాడు.

కొద్దిసేపటి తరువాత అతను స్టూడియో ముందు నిర్జీవ స్థితిలో పడిపోయున్నాడు. అతని పక్కనే' సేవ్ స్మైల్స్, సేవ్ ఫొటోగ్రాఫర్స్, సేవ్ పూర్ పీపుల్' అనే బోర్డులు పడి ఉన్నాయి. లాక్ డవున్ సడలింపు టైం కావటంతో దారిన పోతున్న వాళ్లు అక్కడ ఆగుతున్నారు. కొందరు గొడుగులు, కొందరు ప్లాస్టిక్ కవర్లు వేసుకుని ఉన్నారు. వాళ్ల చూపులు ఆ బోర్డుల మీద కాకుండా.. అతని వేషం మీద పడుతుండడంతో, అందరూ నవ్వుతున్నారు.. అతను చనిపోయాడన్న సంగతి పట్టించుకోకుండా! కరోనా తన వృత్తికి అంటరానోడ్ని చేసింది, బతుక్కి అంటరానోడ్ని చేసింది.. పేదోళ్ల ఆకలికి కనీసావసరాలకూ లాక్ డవునుంటే ఎన్ని వృత్తి జీవితాలు బతికేవో.

***0***

# వెన్నెల



యువ కథ

## రేవతి నంద

పరంధామయ్య గారు బీచ్ ఒడ్డున కూర్చున్నారు దిగాలుగా. ప్రపంచంలోని దైన్యమంతా ఆయన మొహంలోనే గోచరిస్తోంది. ఎదురుగా ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రం. పడి లేచే కెరటాలతో, వచ్చి పోయే అలలతో అల్లకల్లోలంగా ఉంది... ఆయన మనసులాగే.

ఆరోజు ఆదివారం కావడంతో బీచ్ అంతా సందడిగా ఉంది. తనని సందర్శించి, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పొందడానికి వయసు తారతమ్యాలు లేవని సముద్రం ఘోషిస్తున్నట్టుంది. పిల్లలు ఆటల్లో మునిగిపోయారు. పెద్దవాళ్ళు పిల్లలై పోయి సాగరాన్ని చూస్తూ ఆనందిస్తున్నారు. అందరి మొహాల్లో ఎంతో సంతోషం, ఆనందం కన్పిస్తున్నాయి. కానీ తన మొహంలో ఎంతో దిగులూ, విచారం! అసలు వీళ్లంతా అంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారో అనుకున్నారు ఆయన. ఒకప్పుడు తనూ అంతే సంతోషంగా, ఆనందంగా ఉండేవాడే కాని అవేవీ ఇప్పుడు లేవు. కష్టాలు, కన్నీళ్లు తప్ప!

పట్టుపరికిణి, పట్టుజాకెట్ వేసుకున్న ఓ అందమైన అమ్మాయి ఒడ్డున నీళ్ళల్లో సంతోషంగా ఆడుతూ కనిపించింది ఆయనకు. ఆ అమ్మాయిని చూడగానే ఆయనకు వెన్నెల గుర్తుకొచ్చింది. ఆయన కళ్ళు జలధారలయ్యాయి. 'వెన్నెల'... తన బంగారు కూతురు!

తను అలా చేసుండకూడదు. తొందర పడింది. చిన్నపిల్ల. లోకం పోకడ తెలియనిది. ఆవేశంలో నిర్ణయం తీసుకుంది. కానీ తనేం చేశాడు? పెద్దవాడు. అన్నీ తెలిసిన వాడు. తనూ అలాగే ప్రవర్తించాడు. తను అలా మాట్లాడి ఉండకూడదు. ఆవేశంలో తను మాట్లాడిన తీరుకు పాపం ఆ లేతమనసు ఎంతగా గాయపడిందో!! ఎంతలా విల విల్లాడిందో!! కష్టకాలంలో ధైర్యాన్నిచ్చే ఒక తండ్రిగా తను ఉన్నానంటూ భరోసా ఇవ్వడం పోయి, తన మాటలతో ఆమెని చిత్రవధ చేశాడు.

ఛ.. ఛ.. తను చాలా మూర్ఖంగా మాట్లాడాడు. బాధ్యత కలిగిన తండ్రిగా తను ప్రవర్తించి ఉంటే, ఈరోజు తనకూతురు తనకు దూరమయ్యేది కాదు. తనకు ఈ గుండె కోత ఉండేది కాదు. తను సరిదిద్దుకోలేని

పొరపాటు చేశాడు. తన కూతురిని తనే పొట్టన పెట్టుకున్నాడు. ఆమె జ్ఞాపకాలు రేగిన కందిరీగల్లా ఒక్కసారిగా ఆయనను చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేసాయి.

***

పెళ్ళైన చాలాకాలం తర్వాత తమకు పుట్టిన గారాల పట్టి వెన్నెల! ఒక్కతే కూతురు కావడంతో ఎంతో అల్లారుముద్దుగా, గారాబంగా పెంచి పెద్ద చేశారు. ఏది అడిగితే అది కాదనకుండా క్షణాల్లో అమర్చేవాళ్ళు. ఆడింది ఆటా పాడింది పాటగా సాగిపోయింది వెన్నెల జీవితం. కూతురు మీద అమితమైన ప్రేమతో ఆమెను ఎప్పుడూ ఒక్క మాట కూడా అని వుండలేదు తాము. ఆ అతి గారాబమే, మితిమీరిన ప్రేమే తమకు గర్భ శోకాన్ని మిగుల్చుతుందని, ఆ క్షణం తాము ఊహించలేదు.

వెన్నెల చిన్నప్పటి నుంచి చాలా తెలివైన పిల్ల. ఆటపాటలలో, చదువుసంధ్యల్లో చాలా చురుగ్గా ఉండేది. అందానికి అపరంజి బొమ్మలా ఉండేది. పై చదువుల కోసం ఆమె సిటీకి వెళ్ళ వలసి వచ్చింది. తమకు ఇష్టం లేకపోయినా ఆమె ఎక్కడ నొచ్చుకుంటుందోనని, ఆమె ఇష్టం మేరకు పంపవలసి వచ్చింది. చదువు పూర్తి చేసి ఇంటికి వచ్చిన వెన్నెల చెప్పిన పిడుగు లాంటి వార్త విని తల్లిదండ్రులుగా తాము తల్లడిల్లి పోయారు.

వెన్నెల ప్రేమలో పడింది. తనతో పాటు చదివిన ఓ కుర్రాడ్ని ప్రేమించింది. ఆ అబ్బాయినే పెళ్లి చేసుకుంటానని భీష్మించుకు కూర్చుంది. ఆమె మొండితనం తెలిసిన తను, చేసేది లేక ఆ అబ్బాయి గురించి వాకబు చేశాడు. భయంకరమైన నిజాలు తెలిసాయి తనకు. అతడు మంచివాడు కాదు. వ్యసనపరుడు. చాలామంది ఆడపిల్లల జీవితాలతో ఆడుకున్నాడు.

ఆ విషయమే తాము వెన్నెలకు విశదంగా చెప్పారు. అతనితో ప్రేమ, పెళ్లి ఆమె జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తాయని మొత్తుకున్నారు. కానీ అతని ప్రేమ మైకం పూర్తిగా కమ్మిన వెన్నెలకు తమ మాటలు రుచించలేదు. తేలిగ్గా కొట్టిపారేసింది. అతనెంతో మంచివాడని, అతని గురించి తనకు బాగా తెలుసునని, మాకు అతనంటే ఇష్టం లేకే అలా చెబుతున్నామని మొండిగా వాదించింది.

ఆ అబ్బాయి, అబద్ధాలతో వెన్నెలను ఎంతలా ప్రేమ మత్తులో ముంచాడో అర్థమైన తాము, గుడ్డిగా అతడ్ని నమ్మి, మమ్మల్నే ఎదిరించి మాట్లాడిన వెన్నెల మాటలకు నిశ్చేష్టులయ్యాం. నివ్వెరపోయాం. వెయ్యి పిడుగులు మీద పడ్డట్టు అదిరి పడ్డాం. అతనితో పెళ్లి మాకు ఇష్టం లేదని ఖరాఖండీగా చెప్పేశాం. అంతే. ఆ రాత్రే వెన్నెల ఓ ఉత్తరం రాసి పెట్టి ఆ అబ్బాయితో వెళ్లి పోయింది. తనూ తన భార్యా గుండెలు పగిలేలా ఏడ్చారు.

కాలక్రమంలో కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు ఇంట్లో ఫోన్ మోగింది. ఫోన్ పైకెత్తి మాట్లాడిన తన మొహం కోపంతో ఎర్రబడింది. ఆ కాల్ వెన్నెల నుంచి! తను ప్రేమించి పెళ్లిచేసుకున్న అబ్బాయి తనని మోసం చేసి వదిలేసాడని, ఇప్పుడు తనకేం చెయ్యాలో తెలియటం లేదని కన్నీరు మున్నీరుగా విలపించింది వెన్నెల.

తమ మాట వినలేదని వెన్నెల మీద తను చాలా కోపంగా ఉన్నాడు. ఆ కోపంతో ఆమె చెప్పేది పూర్తిగా వినకుండా వెంటనే ఫోన్ పెట్టేశాడు. ఆ విషయం తన భార్యకు చెప్పాడు. ఆమె కన్నతల్లి కాబట్టి తన కూతురుని కడుపులో పెట్టి చూసుకోవాలనుకుంది. కానీ తను ససేమిరా అన్నాడు.
మళ్ళీ ఫోన్ మోగింది. "నాన్నా! నేను చేసింది తప్పే! మీ మాట విననందుకు నాకు తగిన శాస్తే జరిగింది. ఇప్పుడు నా జీవితం అగమ్యగోచరంగా ఉంది. ఈ ఒక్క తప్పుకి నన్ను క్షమించండి నాన్నా. జీవితంలో మళ్ళీ పొరపాటు చేయను. మీరు రమ్మంటే నేను మీ దగ్గరకి వచ్చేస్తాను నాన్నా!.. కాదంటే నేను మీతో మాట్లాడిన ఈ మాటలే నా చివరి మాటలవుతాయి!.." అంటూ కళ్ళ నీళ్ల పర్యంతమైంది వెన్నెల.

కానీ పరువు కోసం ఆలోచించే తన మనసు అందుకు ఒప్పుకోలేదు. కూతురి మీద ప్రేమని పరువు అనే నివురు కప్పేసింది. క్షణికావేశంలో, "ఇంటికి రావద్దు!.. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో!.." అంటూ తను కటువుగా మాట్లాడి ఫోన్ పెట్టేశాడు. కానీ క్షణం లోపే తేరుకున్న తను చేసిన పొరపాటు గుర్తుకొచ్చి, తప్పుగా మాట్లాడినది తెలుసుకుని, వెన్నెల పై ప్రేమ పొంగి అదే నంబర్ కు వెంటనే ఫోన్ చేశాడు. కానీ మొబైల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది! కన్నతల్లిలా గోదావరి తల్లి వెన్నెలకు ఆశ్రయం ఇచ్చి తన పరిష్వంగంలోకి తీసుకుంది.

ఆ రోజునుండి తనూ, తన భార్యా వెన్నెలని తలచుకోని రోజు... కాదు.. కాదు.. క్షణం లేదు. కళ్ళు మూసినా తెరిచినా వెన్నెలే తమకు గుర్తుకొస్తూ ఉంటుంది. 'నాన్నా! ఈ ఒక్క తప్పు క్షమించరూ?!' అంటూ వేడుకుంటున్నట్టు అనిపించేది. పగలూ రేయి కలల్లో కనిపించేది. నవ్వేది. ఏడ్చేది. అందకుండా దూరంగా పారిపోయేది. తమని ఏడ్పించేది. గర్భ శోకాన్ని మిగిల్చి పోయిన వెన్నెల్ని మర్చిపోవడం తమ వల్ల కావటం లేదు.

అప్పుడప్పుడైనా తను కాస్త మరిచిపోగల్గుతున్నాడు గానీ, తన భార్య వెన్నెల చావుకు తనే కారణమంటూ గుండె పగిలేలా ఏడుస్తోంది. తన ముద్దుల కూతుర్ని తనకి తెచ్చివ్వమని పిచ్చిదానిలా మాట్లాడుతోంది. ఆమెని ఓదార్చటం తన వల్ల కూడా కావటం లేదు. కాస్తంత మనశ్శాంతి కోసం వాకింగ్ పేరుతో తను రోజూ బీచ్ కి రావటం అలవాటు చేసుకున్నాడు.

***

జలధారలతో తడిచిన కళ్ళు తుడుచుకొని మళ్ళీ సముద్రం కేసి చూస్తూ ఉండిపోయారు పరంధామయ్య గారు. అప్పటికే సంధ్య చీకట్లు అలుముకున్నాయి. బీచ్ కి వచ్చిన జనమంతా వెళ్ళి పోయి బీచ్ బోసి పోయింది. తను కూడా లేచి వెళ్ళటానికి ఆయత్తమయ్యాడు.

సరిగ్గా అప్పుడే ఓ దృశ్యం అతని కంట పడింది. దూరంగా లీలగా ఓ ఆకారం సముద్రం వైపు నడుస్తూ వెళుతోంది. ఆయన చూస్తూనే ఉన్నాడు. ఆ ఆకారం సముద్రం లోపలికి వెళ్ళటానికి నిశ్చయించుకునే అటు వెళుతున్నట్టుగా ఎందుకో తనకు అనిపించింది. అంటే ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకోబోతున్నాడన్నమాట. ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం ఆయన వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్ళి, ఆ వ్యక్తిని సమీపించాడు. నీళ్లలో మునిగి చనిపోవాలనుకుంటున్న ఆ వ్యక్తి చేతిని పట్టుకొని బలంగా లాక్కుంటూ ఒడ్డుకి తీసుకువచ్చాడు. అప్పుడు చూశాడు “వదలండి.. నన్ను వదలండి.. నన్ను చావనీయండి..” అంటూ మెల్లగా రోదిస్తున్న ఆ వ్యక్తిని. నిర్ఘాంత పోయాడు. నివ్వెరపోయాడు.


ఆ వ్యక్తి...అతను కాదు. ఆమె! తన కూతుర్లాంటి మరొకరి కూతురు! అభం శుభం తెలియని మరొక అమాయకురాలు. జీవితంలో మోసపోయినందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటోంది.... తన కూతురులాగానే అన్న విషయం తెలుసుకున్న పరంధామయ్య గుండె తరుక్కుపోయింది. ఆ అమ్మాయిలో ఆయనకు తన వెన్నెల కనిపించింది. తప్పు చేసిందని ఆ అమ్మాయి తండ్రి కూడా తన లాగే మూర్ఖంగా మాట్లాడినందుకు ఆమె ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. ఒకసారి తను తప్పు చేశాడు. మరోసారి మళ్ళీ అలాంటి తప్పు జరగకూడదు. తను చేసిన తప్పుని సరిదిద్దుకోవాలనుకున్నాడు. ఆమెతో అదేమాట చెప్పాడు.

"అమ్మా నువ్వు ఆత్మహత్యకు పాల్పడవద్దు. నువ్వు తప్పుచేసావని మీ వాళ్లు నిన్ను వదిలేసినా మేము కన్నబిడ్డలా నిన్ను అక్కున చేర్చుకుంటాం. నీ జీవితాంతం నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. దత్త పుత్రికగా మా ఇంట్లో అడుగుపెట్టు తల్లీ!" అంటూ భగవంతుడు ప్రసాదించిన కూతురితో తన ఇంటివైపు నడిచాడు హుషారుగా అమావాస్యలాంటి తమ జీవితాల్లో ‘వెన్నెల’ మళ్ళీ విరియబోతోందన్న ఆనందంతో.

***0***

# ప్రేమతో ముందడుగు

## పేట యుగంధర్




ఆఖరి రౌండు కూడా సంతృప్తికరంగా సాగింది. రిజల్ట్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను.

క్యాంపస్ సెలక్షన్లో సెలక్ట్ అయిన వారి పేర్లు చదువుతున్నారు. అందులో నా పేరు ఉంటుందో, లేదోనని ఆత్రుతగా వింటున్నా. ఆందోళనతో నా శరీరం సన్నగా వణకసాగింది. నా మనసు అందరు దేవుళ్ళను ప్రార్థిస్తూ ఉంది. వాళ్ళు ఒక్కొక్క పేరూ చదువుతూ ఉంటే ఎంతో ఉత్కంఠత'; మరెంతో అలజడి. విజయానికీ పరాజయానికీ, లక్ష్యానికీ, కష్టానికీ, కలకూ, కన్నీటికి మధ్య ఉన్న అతి సన్నని గీతపై నిలుచున్న భావన. మరుక్షణం ఎటువైపు తోసేయబడతానో తెలీదు. ఓవైపు అగాధం, మరోవైపు ఆనందం.

"అండ్ ద లాస్ట్ కేండిడేట్ ఈజ్ మిస్టర్ ప్రవీణ్".

నా పేరు వినబడగానే పాకిస్తాన్ పై సెంచరీ కొట్టిన కోహ్లీలా ఆకాశంలోకి ఎగిరి, నా పిడికిలికి పని చెప్పాను. మొదటిసారి నా జీవితంలో ఒక తిరుగులేని విజయం సాధించాను. ఆ క్షణాన ప్రపంచాన్ని గెలిచినంత సంతోషం కలిగింది. మొట్టమొదటిసారి ఉద్యోగం పొందిన క్షణాన నా తల్లిదండ్రుల నిరంతర త్యాగం, 'మేఘమాల' అందించిన ప్రోత్సాహం గుర్తుకొచ్చి, ఉక్కిరిబిక్కిరి చేసాయి.

***

నేను పట్నంలో 'ఏం.సి.ఏ' చేస్తున్నాను. నా స్నేహితుడు గణేశ్ తో కలసి రూమ్ తీసుకొని అక్కడే ఉంటున్నాను. వంద గడపలు ఉండే చిన్న పల్లెటూరు మాది. మాకు ఎకరం పొలం మాత్రమే ఉంది. నీటి సదుపాయం కొంచెం కూడా లేని పొలం. వర్షాలు సక్రమంగా పడితే తప్ప పండని పొలం.

నా తల్లిదండ్రులు సర్పంచి శివయ్యగారి ఆరెకరాల పొలం కౌలుకు తీసుకొని, వ్యవసాయం చేస్తారు. ఏడాదంతా కష్టపడ్డా మాకు వచ్చే వాటాలో విత్తనాలకూ, ఎరువులకూ పోను, ఇరవై నుండి ముప్పైవేలు కూడా గిట్టుబాటు కాదు. కానీ ఇప్పుడు నాకు రాబోయే జీతమే నెలకు నలభైవేలు. హైదరాబాద్లో కొలువు.

ఇకపై మా ఇంట్లో పేదరికం కనబడదు. మా నాన్న సర్పంచిగారి పొలంలో గొడ్డులా కష్టపడాల్సిన పనిలేదు. మా అమ్మ కట్టెల పొయ్యితో వంట వండాల్సిన అవసరం అసలు లేదు. నా చెల్లెళ్ళి పెద్ద చదువులు సులువుగా చదివించుకోగలను కూడా.

***

పొద్దున ఆరుగంటలకంతా మా ఊరికి వచ్చేసాను. మా నాన్న పొలం వెళ్ళకుండా నాకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆయన కళ్ళలో  ముందెప్పుడూ కనబడని సంతోషం, గర్వం కనబడుతున్నాయి నాకు. అమ్మ నాకు ఇష్టమైన పాయసం చేసి తినిపించింది. చెల్లెలి ఆనందానికైతే అవధుల్లేవు.

***

నాకు ఉద్యోగం వచ్చిన విషయాన్ని మేఘమాలకు చెప్పడానికి బయలుదేరాను. మేఘమాల ఎవరో కాదు, సర్పంచి శివయ్య కూతురు. తనకు నేనంటే చిన్నప్పటి నుండీ చెప్పలేనంత ఇష్టం!  నాకు కూడా తనంటే అంతే ఇష్టం. మా అంతస్తుల మధ్య ఉన్న అంతరం మా ప్రేమకు అడ్డంకి కాగలదని నాకు తెలుసు. అదే విషయాన్ని మేఘమాలకు చెప్పాను. స్నేహితులుగానే ఉండిపోదామని అడిగాను. నేను ఉద్యోగం సంపాదిస్తే మా కుటుంబాల మధ్య ఉన్న ఆర్థిక అంతరాలు కాస్తయినా తగ్గుతాయని తన నమ్మకం. ఆ నమ్మకంతోనే తను నన్ను ప్రోత్సహించింది. అదృష్టం కూడా తోడు కావడంతో ఇవ్వాళ నేను ఉద్యోగం సాధించగలిగాను.

నాకు జాబ్ వచ్చిన విషయం అప్పటికే ఊరంతా తెలిసిపోయింది. అందరూ నా గురించే మాట్లాడుకుంటున్నారు. అసలు ఏ పల్లెటూర్లోనైనా ఉండే సమస్యే ఇది.  ఏ విషయమైనా అందరికీ ఇట్టే తెలిసిపోతుంది.  అందులోనూ మా ఊర్లో  పై చదువులు చదివిందీ, ఉద్యోగం పొందిందీ మొట్టమొదటివాడ్ని నేనే కావడంతో,  ఈ విషయం 'టాక్ ఆఫ్ ద విలేజ్' అయికూర్చుంది.  ఇప్పుడు మా ఊర్లో యువతకు నేనొక పెద్ద హీరోనైతే,  పిల్లలకు రోల్ మోడల్ని.  దారిలో మేఘమాల వాళ్ళ నాన్న ఎదురుపడ్డాడు. చూడనట్టు ముందుకు నడిచాను.

"ఏరా! అబ్బాయ్!! నీకు సాఫ్ట్వేర్ ఉద్యోగం వచ్చిందట కదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును అంకుల్!" తల పైకెత్తి ధీమాగా చెప్పాను.

"ఓర్నీ! మొన్నటిదాకా 'అయ్యగారూ' అనేవాడివి, ఉద్యోగం రాగానే అంకుల్ అంటున్నావ్!!" కాస్త వ్యంగ్యాన్ని జోడించి అడిగాడు.

నేను కూడా చిన్నగా నవ్వాను. శివయ్యకు కూడా నవ్వు వచ్చినట్టు ఉంది.

"చాలా సంతోషం రా అబ్బాయ్! మీ నాయిన కష్టం ఊరికే పోలేదు!" అంటూ మెచ్చుకోలుగా నా భుజం తట్టాడు. నేను సంతోషంతో ముందుకు నడిచాను.

***

కోనేటిమెట్లపై మేఘమాల నాకోసం ఎదురుచూస్తూ ఉంది. నన్ను చూడగానే ఒక్క పరుగులో నా దగ్గరకు వచ్చింది.

"నీకు ఉద్యోగం వచ్చిందట కదా!" తన కళ్ళలో ఆనందబాష్పాలు!!

"అవును గాని, నువ్వు ఇంతకన్నా ఎక్కువగా సంతోషపడే విషయం ఇంకొకటుంది, చెప్పనా?" తన కళ్ళలోకి చిలిపిగా చూస్తూ అడిగాను.

"చెప్పు" అంది నా వేపు ఆరాధనగా చూస్తూ.

"ఐ లవ్యూ మేఘమాలా!!" తను ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న విషయాన్ని చెప్పేసాను.

సిగ్గుపడుతూ నా గుండెలపై వాలిపోయింది మేఘమాల. తన చుట్టూ నా కౌగిలి బిగించాను. కళ్ళు మూసుకున్నాను తన వెచ్చని స్పర్శను ఆస్వాదిస్తూ.

***

"ప్రవీణ్! ప్రవీణ్!!" ఎవరో దూరంనుండి పిలుస్తున్నారు. నేను కళ్ళు తెరవలేదు.

"ఒరేయ్ ప్రవీణ్!" దగ్గరకు వచ్చి నా భుజంతట్టి మరీ పిలుస్తున్నారు.

నేను నా కౌగిలి సడలించలేదు. మేఘమాలను మరింత గట్టిగా హృదయానికి హత్తుకున్నాను.

"ఇంటర్వ్యూకు టైం అవుతోందిరా! తొందరగా లెగు!!" ఈసారి గట్టిగా చెవిలో వినబడింది కేక.

తుళ్ళిపడి, కళ్ళు తెరిచాను. కౌగిలీ లేదు, అందులో వెచ్చని మేఘమాలా లేదు. నా వేపు కోపంగా చూస్తూ నా రూమ్మేట్ గణేష్ నా ఎదురుగా. అయోమయంగా చుట్టూ చూసాను. కోనేటిగట్టున కాదు నేనున్నది...నా గదిలో, నా మంచంపై...

కలగన్నానని అర్థం చేసుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది నాకు. అయినా నాకు నిరాశ కొంచెమైనా కలగలేదు. గణేశ్ వేపు చూసి, చిన్నగా నవ్వి, మంచం దిగాను, వచ్చిన అందమైన కలను నిజం చేసుకోవాలన్న బలమైన కోరికతో... చేసుకోగలనన్న ఆత్మవిశ్వాసంతో.

***0***

# అరుణోదయం

యువ కథ

## కిరణ్ విభావరి



చుట్టూ చిమ్మ చీకటి. ఆకాశంలో తారలే కాదు చంద్రుడు కూడా కనిపించడం లేదు. కానీ మా హెడ్ లైట్స్ వెలుగులో మంచు ముద్దలు అక్కడక్కడ మెరుస్తూ కన్పిస్తున్నాయి. నేపాలీ షేర్పాకి ఈ ప్రాంతం కొట్టిన పిండి కాబోలు, అతను చక చక వెళ్ళిపోతున్నాడు. పగటి వేళల్లో భయంకరంగా గర్జించిన ఈ సానువులు, ఈ నిశ్శబ్ద నిశాసతితో సేదదీరుతున్నట్టుగా ప్రశాంతంగా పరుచుకుని ఉన్నాయి. అందుకే వీటి మెడలు వంచి, సవారీ చెయ్యడానికి రాత్రిని మించిన అనువైన సమయం ఇంకేది లేదని ఆరోహకులు పర్వతారోహణ రాత్రి పూట చేస్తూ ఉంటారు.

కాలుని ఏదో బలంగా తాకినట్టుగా అనిపించింది. టార్చ్ లైట్ కాలు వైపు వేసాను. ఒక నల్లని చెయ్యి నన్ను ముందుకు పోనివ్వకుండా నా కాలికి అడ్డంగా ఉంది. చెయ్యి మాత్రమే కనిపించడంతో లైట్ చుట్టూతా ఫోకస్ చేశాను. కొద్ది దూరంలో ఒక శవం. దగ్గరకు వెళ్ళి చూసాను. ఎవరో పర్వతారోహకుడు, శరీరం మొత్తం నల్లబడిపోయి, అక్కడక్కడ నరాలు చిట్లి, రక్తం గడ్డకట్టి,  చచ్చిపడున్నాడు. నా వెన్ను జలదరించింది.

"ఆక్సిజన్ తక్కువైతే అంతే మేమ్ సాబ్. ముందు శరీరం ఎర్రబడుతుంది. రక్తం కారుతుంది. ఆ తర్వాత కొద్ది కొద్దిగా నీలం రంగులోకి మారుతూ అవయవాలు చలనం కోల్పోతాయి. ఇక చివరగా నల్లగా మారి ఒక్కో అవయవం ఊడి పోతుంది. ఇతడు పాపం అలాగే చచ్చిపోయినట్టు ఉన్నాడు!" నా గైడ్ గా వచ్చిన షేర్పా మొహంలో ఎటువంటి ఫీలింగ్ లేదు. ఇదేదో అతి సాధారణ విషయం అన్నట్టు చెబుతున్నాడు. నేను భయంతో గుటకలు మింగుతూ చూసాను. పేగులు మెలిపెట్టినట్టు అయ్యింది.

"ఏం మెమ్ సాబ్... భయం వేస్తుందా?" అతడు నవ్వుతూ అడిగాడు. ఆ నవ్వులో నాకు వెక్కిరింత కనిపించింది. దేవుడికే నా బత్రుకు ఒక జోక్ అయినప్పుడు, ఈ మనుషుల నుండి నేనేం ఆశించగలను? నేను అతడికేమీ బదులివ్వకుండా ముందుకు సాగాను. చేతకాని వారే అనవసర మాటలతో సమాధానం ఇస్తారు. నన్ను వెక్కిరిస్తున్న ఈ సమాజానికి, ఆ దేవుడికి ఎలా జవాబు చెప్పాలో నాకు బాగా తెలుసు.

మరింత కసితో వేగంగా అడుగులు వేస్తూ ముందుకు కదిలాను. సమయం చాలా తక్కువ. రేపు ఉదయం పదకొండు గంటల లోపే అక్కడికి చేరుకోవాలి. లేదంటే ఇన్నేళ్ల నా శ్రమ  గంగలో పోసిన పన్నీరే.
ఈ మంచు శ్రేణులు నిద్రలో ఉన్నాయి. పసివాడు ఆదమరచి నిద్రపోతున్నప్పుడే, తల్లి తన పనులు చేసుకోవడానికి కుదిరినట్టు, ఆకాశాన్ని అంటుతున్న ఈ శిఖరాలు సుప్తావస్థలో ఉన్నప్పుడే నా కలను సాకారం చేసుకోవాలి.
దారి పొడవునా కొన్ని అచేతన శరీరాలు ఎదురవుతూ నన్ను పరీక్షిస్తూ ఉన్నాయి. నేనూ వీళ్ళలాగే చచ్చిపోతాననే భయం నాకు లేదు. కానీ నేను చేరాల్సిన లక్ష్యం చేరకుండా పోతాననేమో భయం పట్టుకుంది. "ప్రకృతి దృఢమైన మనస్కులకే కష్టతరమైన సవాళ్ళను ఇస్తుంది. నెగటివ్ ఆలోచన ఒక్కటీ రానివ్వకు. కడివెడు పాలలో ఒక్క విషపు చుక్క చాలు. "అమ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఆమె రూపం కళ్ళముందు మెదిలింది. నేనచ్చం అమ్మ పోలికే అంటారు అందరూ. కానీ, దేశం కోసం ఆర్మీ యోధుడిగా అసువులు బాసిన మా నాన్న గుండె నిబ్బరానికి,  ధైర్యానికి నేను ప్రతీక అని నాకు తెలుసు. ఆయన రూపం లీలగా కనిపించింది. ఆయన్ని ఫోటోలలో చూడటమే తప్పా ఆయన జ్ఞాపకాలు ఏవీ నాకు లేవు. అలా లేకుండా చేసింది ఈ మంచు శిఖరాలే కదా. ఏ క్షణాన ఎలా మారుతుందో తెలియని ఈ నిర్జన భయానక ప్రాంతంలో హిమపాతంలో కూరుకుపోయి మా నాన్న మాకు దూరం అయ్యారు.

"అందరికన్నా ఎత్తులో ఉన్నానని నీకు పొగరు కదూ...! చూస్తూ ఉండు నీ తలమీదకెక్కి నీ పొగరెలా దించుతానో!" ఎదురుగా కనిపిస్తున్న ఎవరెస్టును చూసి కసిగా అనుకున్నాను. వేగంగా అడుగులు వెయ్యబోయాను. కాలు జారింది. ఆ మంచుముద్దలో బోర్లా పడ్డాను. ఎవరెస్ట్ వెక్కిరింపుగా నవ్వుతున్నట్టు అనిపించింది. షేర్పా నా జబ్బ పట్టుకుని లేపి "సాహస్ ఛ మేం సాట్ నడరావూ.. మ త్యాహం ఛు" నేనున్నానంటూ... నేపాలీ భాషలో ధైర్యం చెప్పాడు. అతడి కళ్ళలోకి కృతజ్ఞత పూర్వకంగా చూసాను. నిర్మలంగా ఉన్న అతడి కళ్ళు హిమాలయాలను తలపించాయి.

మెల్ల మెల్లగా తెల్లవారుతోంది. అరుణోదయ కాంతులు మంచు శ్రేణుల మీద ప్రసరిస్తుంటే, ఆ వేడికి కొద్ది కొద్దిగా మంచు కరగడం తెలుస్తోంది. కాళ్ళు జారడం ఎక్కువవుతోంది. జాగ్రత్తగా అడుగులు వేస్తూ తొందరగా గమ్యం చేరుకోవాలి. ఇదే ఆఖరి మజిలీ. సేద తీరడానికి ఇక క్యాంపులు కూడా ఉండవు. భూమికి ఏడు వేల మీటర్ల ఎత్తులో ఉన్నాను. ఇంకొన్ని మీటర్లు ఎక్కితే చాలు.
కళ్ళముందు ఎవరెస్ట్ శిఖరాగ్రం నన్ను ఆహ్వానిస్తూ కనిపిస్తోంది.
"లక్ష్యం పెట్టుకోవడం మంచిదే, కానీ ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే అంకితభావంతో పాటు సరైన శిక్షణ ఉండాలి. అటు చూడండి." అంటూ కిందకి చూపించాడు షెర్పా.
మేము నడిచి వచ్చిన దారే అది. ఆ తెల్లని మంచు దుప్పటి కప్పుకున్న ఆ సానువుల్లో రంగు రంగుల మచ్చల్లా చలనం లేని శరీరాలు. తూర్పు కాంతిలో ఆ దృశ్యం భయంకొల్పేలా ఉంది.

"మై గాడ్.." ఊపిరి బలంగా పీలుస్తూ అన్నాను.

"సాగర్ మాత పట్ల గౌరవం ఉండాలి. ప్రకృతి ఏ సమయంలో మనల్ని అనుమతి ఇస్తుందో, ఆ సమయంలోనే స్కేలింగ్ చెయ్యాలి. చాలా మంది వేరే వాళ్ళు చేశారని తాము కూడా ఎంతో డబ్బు ఖర్చు పెట్టి ఇక్కడకి వస్తారు. మేము శత విధాల చెప్పి చూస్తాం. శిక్షణ లేకుండా, సరైన సేఫ్టీ లేకుండా వెళ్ళకూడదు. రాత్రుళ్ళు మాత్రమే స్కేలింగ్ చెయ్యాలి అని. అయినా, చాలా మంది పట్టించుకోక ఇదిగో.. ఇలా అనాథ శవాల్లా మిగిలిపోతున్నారు!" అతడా శరీరాల్లో కాస్తైనా కొన ఊపిరి ఉందేమో అని పరీక్షిస్తూ చెబుతున్నాడు.

"ఇక్కడున్న ఈ డెడ్ బాడిలలో నా మిత్రులవే ఎక్కువ!" అతడి గొంతు బొంగురు పోయింది. ఆపై మాట పెగల్లేదు. అన్నీ త్యజించిన సాధు పుంగావుడిలా మౌనంగా ముందుకు కదిలాడు. అతడి మనసులో ఆమ్ల వర్షం కురుస్తున్నా, కళ్ళల్లో వైరాగ్యం తచ్చాడుతోంది.

ఈ హిమాలయ సానువుల్లో స్కేలింగ్ కి వచ్చే వారికి టూరిస్ట్ గైడ్లుగా ఎక్కువగా ఈ నేపాలి షెర్పాలే ఉంటారు. వీళ్ళకి ఇదే జీవనోపాధి కావడంతో, ఈ పర్వతాలను ఎక్కి దిగడం వీరికి కష్టతరం కాదు. కానీ ఇక్కడి వాతావరణం అకస్మాత్తుగా మారిపోతూ ఉంటుంది. భయంకర హిమపాతాలు విరుచుకుపడతాయి. ఒక్కోసారి ఆక్సిజన్ లెవల్ పడిపోయి, సిలిండర్ రెగ్యులేట్ చెయ్యడం రాక ఒత్తిడి ఎక్కువై చనిపోతూ ఉంటారు. అయితే ఈ షెర్పాలు ప్రాణాలను సైతం అడ్డు వేసి తమ టూరిస్ట్ లను కాపాడే ప్రయత్నం చేస్తారు. ఆ ప్రయత్నంలోనే ఇలా అసువులు బాస్తారు.

నేనూ కాళ్ళీడ్చుకుంటూ అతన్ని అనుసరించాను. నాలో ఒత్తిడి పెరుగుతున్నట్టు అనిపించింది. ఆక్సిజన్ సిలిండర్ చెక్ చేశాను. గుండెల మీద పిడుగు పడ్డట్టయ్యింది. నా దగ్గరున్న ఆక్సిజన్ అయిపోవచ్చింది. ఒళ్లు కంపించిపోయింది. కొన్ని మీటర్ల ఎత్తులో నిల్చున్న ఎవరెస్ట్ నాకో మృత్యు కుహరంలా కనిపిస్తోంది. తెలియకుండానే కళ్ళు నీటి చెలమలయ్యాయి. అడుగులు ముందుకు సాగలేదు. షేర్పాకి నా పరిస్థితి అర్థం అయ్యింది.

"కిందకి వెళ్ళిపోదాం. పదండి మేం సాబ్.." అతడు వెనక్కి మర్లాడు. నేను యధాస్థానంలో కదలకుండా స్థాణువులా నిల్చుండిపోయాను.

"ఇంటికి దూరంగా రెండేళ్లు నేను పడ్డ శ్రమ కళ్ళముందు మెదిలింది. ప్రతి రోజూ ముప్పై కిలోల బరువును మోస్తూ, పది కిలోమీటర్ల శిఖరాలు ఎక్కి దిగి నేను పొందిన శిక్షణకు, పడిన కష్టానికి ఇదేనా ఫలితం?" దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా అరిచాను. షెర్పా బెదిరిపోయాడు. నా మానసిక స్థితిని అర్థం చేసుకుని కాసేపటికి కుదుటపడ్డాడు.

"సమయం మించిపోతోంది. బ్రతికుంటే మళ్లీ రావొచ్చు. కిందకి వెళ్ళిపోదాం. లేదంటే వాళ్లకు పట్టిన గతే మనకూ పడుతుంది!" అతడు ఆ శవాలను చూపించి హెచ్చరించాడు.

నాకు జీవితంలో మళ్లీ ఈ అవకాశం రాదు. ఈ లక్ష్య సాధనకు దాతలు అందించిన నలభై లక్షల రూపాయలు ఖర్చు చేశాను. మళ్లీ డబ్బు సమీకరించడం, శిక్షణ తీసుకోవడం సాధ్యం కాని పని. డూ ఆర్ డై.. గాంధీజీ నా చెవిలో చెప్పినట్టు అయ్యింది. వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.
"చావుకి నేనంటే భయంలే షెర్పా. అది నన్నప్పుడే తీసుకుపోదు. నీకు భయంగా ఉంటే నువ్వెళ్ళిపో. నేను శిఖరాన్ని ఎక్కకుండా కిందకి దిగేది లేదు!" నవ్వుతూ అతనితో చెప్పాను. కానీ లోలోన ఆక్సిజన్ అయిపోతే కలిగే ఒత్తిడి తెలుస్తూనే ఉంది. ఒక గంట పాటు నెట్టుకు రావొచ్చు. ఈలోపు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలి. నా కాయిలింగ్ తాడు హుక్ శిఖరం వైపు వేసి అడుగులు అటుగా వేసాను.
"మూర్ఖ కేటి." నేపాలీ భాషలో నన్ను తిట్టుకుంటూ నా వెనుకే అనుసరించాడు. ఈ షెర్పాలు ఎంతో నిబద్ధతతో ఉంటారు. టూరిస్ట్ ల క్షేమమే వారి ప్రాధాన్యం. అందుకోసం వారి ప్రాణాలను కూడా లెక్క చేయరు. ఎవరూ గుర్తించని అన్సంగ్ హీరోలు వీళ్ళు. అతనికి మనసులో కృతజ్ఞతలు చెప్పుకుంటూ , ముందుకు కదిలాను.

గాలి ఒత్తిడికి గుండె వేగంగా కొట్టుకోవడం తెలుస్తూఉంది. ఊపిరి పీల్చడం చాలా కష్టంగా మారింది. నేను నా ఆక్సీజన్ సిలిండర్ స్పీడ్ 0.5 లో పెట్టాను. ఇలా చేసి ఆక్సిజన్ కొద్ది కొద్దిగా వాడుకోవచ్చు. ఎవరెస్టు శిఖరం అంచుల్లో కొందరు ఆరోహకులు చతికిలపడి కూర్చుని ఉన్నారు. మరి కొందరు కళ్లెదుటే జారిపోతూ నాలో మృత్యుభయం కలిగిస్తున్నారు. ఎవరెస్టు శిఖరాగ్రాన్ని చేరడానికి కేవలం ఒక్క ఇరవై అడుగుల బండరాయి మాత్రమే అడ్డుగా ఉంది. ఆ ఒక్కటీ దాటేస్తే మొట్ట మొదటి పర్వతారోహకురాలిగా రికార్డు సృష్టిస్తాను. నాలోని శక్తినంతా కూడదీసుకుని అడుగులు వేసాను. "పర్వతాన్ని కాదు నీ మనసును జయించు. నీ భయాల్ని వదిలేసి అడుగులు ముందుకు వెయ్యి. ఎవ్వరూ నీకు దారివ్వకున్నా, నువ్వే కొత్త దారులు వెదుకుతూ దూసుకుపో." బచెంద్రి పాల్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఒక్కో అడుగు కూడదీసుకుని ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాను.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం నా కాళ్ళ కింద ఉంది. ఈ ఎత్తులో ప్రపంచాన్ని చూసే ప్రయత్నం చేశాను. అంతటా శ్వేతవర్ణమే. తెల్లని దూదిపింజల్లా ఈ మంచు పర్వతాలు స్వచ్ఛంగా మెరుస్తూ ఉన్నాయి. "నేను చావడానికి శిఖరాన్ని ఎక్కలేదు. శిఖరం ఎక్కేందుకు చావడానికైనా సిద్ధమే!" మనస్సనే తెల్ల కాగితం మీద నేను రాసిపెట్టుకున్న మాటలు నాతో నేనే చెప్పుకున్నాను. ఆ శ్రేణుల్లో ప్రతి ధ్వనించేలా నా ఆనందాన్ని పంచుకుంటూ గట్టిగా అరిచాను. జీవిత లక్ష్యం చేరుకోవడంలో ఉండే తృప్తి అనుభవ పూర్వకంగా తెలుస్తుంటే, ఇక హాయిగా కళ్ళు మూసినా పర్వాలేదు అనిపించింది. నా విజయం నాలాంటి ఎన్నో జీవితాలలో ఆశాకిరణాలు నింపుతుందని నా ప్రగాఢ నమ్మకం. అందుకే, నా అధిరోహణను వీడియోగా తీసాను. ఒకవేళ నేను కిందకి వెళ్ళ లేకపోతే, ఈ వీడియోని నా వాళ్ళకి అందించమని షేర్పాకి చెప్పాను.

ఆక్సిజన్ స్థాయి తగ్గుతూ వస్తోంది. కిందకి పదమని షెర్పా తొందర పెట్టాడు. ఈసారి అతడి మాటల్ని కొట్టి పారేయ్యకుండా, నా వెన్నంటే నిలిచిన అతనికి గౌరవమిస్తూ, కిందకి అడుగులు వేసాను. నా చేతులు ఎర్రగా కందిపోయాయి. వేళ్ళ చివర్ల నుండి రక్తం కారడం మొదలు పెట్టింది. మొద్దుబారి పోయిన చేతులు ముడవడానికి కూడా కుదరటం లేదు. చావును దగ్గిరనుంచి చూసిన నాకిదేం కష్టతరంగా లేదు. అనుకున్నది సాధించాననే విజయోత్సాహంతో కిందకి పరుగులు తీస్తున్నాను.

నాలుగు వేల మీటర్ల దూరంలో ఉన్న బేస్మెంట్ కాంప్ కి చేరాలంటే ఇంకో పది గంటలు పడుతుంది. అంతవరకూ ఏదో అద్భుతం జరిగితే కానీ నేను బతకనని నాకు తెలుసు. చుట్టూ ఉన్న శవాలలో నేను కూడా ఒకటవుతానేమోననే చిన్న గగుర్పాటు.. అంతే!! ఆక్సిజన్ ఇక పూర్తిగా అయిపోవస్తోంది. షెర్పాకి నా పరిస్థితి అర్థమైంది. ఇక ఈ లోకానికి వీడ్కోలు చెప్పే సమయం ఆసన్నమయిందని నాకు తెలిసిపోయింది. వెనుకకు తిరిగిచూసాను. దేశాన్ని, ప్రజల్ని శత్రువుల నుండి, చల్లటి గాలుల నుండి కాపాడుతున్న ఎవరెస్ట్ సమ్మిట్ కు గౌరవంతో సెల్యూట్ చేశాను. ఈ హిమాలయ పర్వత శిఖరాలలో ఎంతోమంది సైనికులు అసువులు బాసారు. మా నాన్న... ఇక్కడే ఈ మంచు దిబ్బల్లో, దేశ రక్షణలో భారతమాత ముద్దుబిడ్డగా అసువులు బాసాడు. ఎవరో నన్ను పిలుస్తున్నట్టనిపిస్తోంది. అదెవరో కాదు... మా నాన్నే! నన్ను తన దగ్గరికి రమ్మని పిలుస్తున్నాడు. ఇంకొన్ని నిమిషాలే నా ఊపిరి నిలుస్తుంది. షెర్పాని వెళ్ళిపోమని చెప్పాను. అతడు కదలకుండా అక్కడే నిల్చుని ఉన్నాడు. అతడి పెదాలు ఏదో మంత్రాలు చదువుతున్నట్టుగా వణుకుతున్నాయి.

ఈ చివరి క్షణాల్లో ఒక్కసారిగా అమ్మని చూడాలనిపించింది. నాన్న లేకున్నా... అన్నీ తానై నన్నూ, తమ్ముడిని కంటికి రెప్పలా పెంచింది. ఒంటరి ఆడదంటో చుట్టుపక్కల వాళ్ళు ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా ధైర్యంగా ఎదుర్కొంది. మా ఇద్దరిలో మొక్కవోని ఆత్మవిశ్వాసాన్ని, స్థైర్యాన్ని నింపింది. ఆ మాతృమూర్తిని మనసులోనే స్మరించుకున్నాను. ఊపిరి పీల్చడం కష్టమవుతుంటే నీరసంగా చతికిలబడి పోయాను.

నేను ఓడిపోవడం ప్రకృతి కూడా ఇష్టం లేదేమో! ఎప్పుడూ నన్ను పరీక్షించే భగవంతుడు ఈసారి ఓ టూరిస్ట్ రూపంలో వచ్చాడు. నా పరిస్థితి గ్రహించి తన దగ్గరున్న సిలిండర్ ని నాకు అందించి నాకు కొత్త ఊపిరి పోశాడు. నా ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందగానే నూతన ఉత్తేజం కలిగింది.

షెర్పా ఆనందంతో డాన్స్ చేసాడు. బహుశా అతడి ప్రార్థన భగవంతుడు ఆలకించాడనేమోనని కామోసు. మళ్ళీ మా నడక కిందకి సాగించాం.

ఎవరెస్ట్ పైకి వెళ్ళడం ఒక ఎత్తయితే కిందకి దిగడం కూడా మరొక ఎత్తు. సమయం గడిచే కొద్దీ నెత్తిన ఎక్కుతున్న సూరీడి వేడికి మంచు కరుగుతూ ఉంటుంది. అకస్మాత్తుగా భారీ హిమపాతాలు పుట్టుకొస్తాయి.

మంచు చరియలు విరిగి పడతాయి. ప్రకృతి విలయతాండవం చేస్తూ భయానకంగా మారిపోతుంది. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా క్యాంపు చేరుకోవాలి. పరుగులాంటి నడకతో కిందకి బయలుదేరాము.
అంతలోనే అనుకోకుండా ఒక బండరాయికి నా కాలు బలంగా కొట్టుకుంది. కింద పడి కొంత దూరం దొర్లాను. షెర్పా నన్ను వెతుక్కుంటూ వచ్చి లేపాడు. నా ప్యాంటు లోంచి వేలాడుతున్న కాలును చూసి ఖంగుతిన్నాడు. నోట మాట రాక బిగుసుకుపోయాడు. "ఖుట్టా..ఖుట్ట...కట్ కట్" అంటూ అరిచాడు. నేపాలీ భాషలో ఖుట్టా అంటే కాలు.. కాలు తెగిపోయింది అని ఉన్మాదిలా అరుస్తూ చూపించాడు. మోకాలి చిప్ప వరకే ఉన్న కాలు నుంచి రక్తం కారుతోంది. మొద్దుబారిన నా శరీరానికి నొప్పి తెలియడం లేదు. తెగి పడిన కాలుని తెమ్మని అతనికి సైగ చేశాను. మరబొమ్మలా అతను తెగిపడిన నా కాలును అందించాడు.
"భయపడకు. ఇది ప్రొస్తెటిక్ లెగ్. అంటే ఆర్టిఫీషియల్ కాలు!" భయపడ్తున్న షేర్పాకు మంచి నీళ్ళు అందిస్తూ చెప్పాను.
"అంటే... మీరు... అవిటి వారా...? పెట్టుడు కాళ్లతో ఈ శిఖరాన్ని అధిరోహించారా?" షాక్ తిన్నట్టుగా అన్నాడు.
అవునంటూ తలాడించాను.
"నేనో జాతీయ వాలీబాల్ క్రీడాకారిణిని. సిఐఎస్ఎఫ్ ఉద్యోగ పరీక్ష రాసేందుకు ఢిల్లీ వెళ్లడానికని లక్నోలో పద్మావతి ఎక్స్ ప్రెస్ ఎక్కాను. రైలు వేగం అందుకోగానే, అప్పటికే ట్రైన్లో మాటు వేసిన దోపిడీదొంగలు ఒక్కసారిగా ప్రయాణికులపై పడి దోచుకోడం మొదలెట్టారు. ప్రయాణికులను తుపాకులతో బెదిరించి, డబ్బు, బంగారం, మరెన్నో విలువైన వస్తువులను దోచుకుంటున్నారు. ప్రాణ భయంతో ఏ ఒక్క ప్రయాణికుడు వాళ్ళనెదిరించడానికి ముందుకు రాలేదు. ఆ దొంగలు నా బంగారు గొలుసు లాక్కున్నారు. నా బ్యాగ్ కూడా లాక్కునే ప్రయత్నం చేశారు. అందులో కొంత డబ్బు, నా పరీక్ష హాల్ టికెట్ ఉన్నాయి. జీవితంలో పోరాడటమే కానీ, లొంగిపోవడం తెలియని నేను, ఆ దొంగలని ఎదిరించాను. ఆ సమయంలో మా అమ్మ, మా కోసం పడుతున్న కష్టం గుర్తు కొచ్చింది. నేను కూడా మా నాన్నకు మల్లే ఆర్మీలో చేరాలన్న.. ఆమె కల గుర్తుకొచ్చింది. ఈ ఉద్యోగం వస్తే నేను ఆమెకో ఆసరాగా ఉండొచ్చనుకున్నాను. నా బ్యాగ్ కోసం వాళ్ళకు ఎదురు తిరిగాను. నా బలం కొద్దీ గింజుకున్నాను. విలవిలలాడాను. అరిచాను. వాళ్ళ చేతుల్ని కరిచి, వాళ్లతో కలియబడ్డాను. ఆ పెనుగులాటలో వాళ్ళల్లో ఒకడు నన్ను బోగీ నుంచి బయటకు తోసేశాడు. నేను రైలు నుంచి పక్క పట్టాల మీద బోర్లా పడిపోయాను. ఆ పట్టాల మీద వస్తున్న గూడ్స్ రైలు నా కాళ్ళను ఛిద్రం చేస్తూ వెళ్ళిపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు, ఏకంగా నలభై తొమ్మిది చక్రాలు.. ఒక్కొక్కటిగా నా కాళ్ళ మీద నుండి పోతుంటే, ఆ నొప్పి భరించలేక నా గొంతు పగిలిపోయేలా అరిచాను. ఆ ట్రైన్ కూతలో నా ఆర్తనాదం అరణ్యరోదనే అయ్యింది.
పైకి లేవాలని ప్రయత్నించినా నా వల్ల కాలేదు. నా శరీరం నుంచి ఒక కాలు బయటకు వచ్చేసింది. మరో కాలి ఎముకలు ప్యాంటును చీల్చి బయటకు పొడుచుకు వచ్చాయి. తీవ్రమైన నొప్పి నరనరాన్ని

మెలిపెడుతుంటే, అలాగే ఏడు గంటల పాటు పట్టాల మీద పడి ఉన్నాను. రక్తం కారుతున్న నా కాలుని కొన్ని ఎలుకలు కొరకడం మొదలు పెట్టాయి. ఏడ్వడానికీ కూడా నాకు ఓపిక లేక సొమ్మసిల్లి పడిపోయాను. మర్నాడు పొద్దున్న కొందరు గ్రామస్తులు పట్టాలపై పడున్న నన్ను చూసి ఆసుపత్రికి తరలించారు. కానీ నాకు ఆపరేషన్ చేయడానికి ఆసుపత్రిలో మత్తు మందు లేదని డాక్టర్స్ మధన పడుతున్నారు. ఇన్ని గంటలుగా నొప్పిని అనుభవిస్తున్న నేను ఎంత నొప్పైన భరించగలనని, మత్తు మందు ఇవ్వకుండానే ఆపరేషన్ చేయమని డాక్టర్స్ ని వేడుకున్నాను. నా మనోధైర్యానికి ఆశ్చర్యపోయిన డాక్టర్లు నా కాలు తొలగించారు. ఇంకో కాలుకి రాడ్లు వేశారు. ఆపరేషన్ కి కావల్సిన రక్తాన్ని ఆ డాక్టర్లే దానం చేసి, నాకు ప్రాణదానం చేశారు.

నేను హాస్పిటల్ లో ఉండగానే నాకు జరిగిన ఏక్సిడెంట్ పై కొందరు పుకార్లు లేవదీసారు. నేను రైల్లోంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం జరిగిందని నమ్మించే ప్రయత్నం చేశారు. ఒక మిడిల్ క్లాస్ అమ్మాయికి ఇటువంటి పుకార్లు ఎంత బాధాకరమో  చెప్పక్కర్లేదు. దాంతో నా మనసు ముక్కలయ్యింది. నన్నూ, నా ఫ్యామిలీని టార్గెట్ చేస్తూ ఎన్నో అవమానాలకు గురి చేశారు. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలని అప్పుడే నేను నిర్ణయించుకున్నాను. నేను పర్వతారోహకురాలిని అవుతానని చెప్పాను. రెండు కాళ్ళు పోగొట్టుకుని నడవడమే చేతకాని నేను శిఖరాలు అధిరోహిస్తాను అంటే అందరూ నవ్వారు. గేలి చేశారు. అమ్మ మాత్రం అండగా నిలిచింది. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే అని నాలో స్ఫూర్తి నింపింది. ఆ స్ఫూర్తితోనే ఈరోజు ఇలా శిఖరాగ్రానికి చేరుకుని, భారతదేశంలోనే మొట్ట మొదటిసారిగా ఎవరెస్టును అధిరోహించిన వికలాంగురాలిగా చరిత్ర సృష్టించాను. మామూలు మనుషులే చెయ్యలేనిది నీకెందుకీ పని అని ఎందరో అడిగారు. నాకదే నచ్చదు. నేనూ మీ లాంటి మనిషినే. అవిటితనం అనేది శరీరానికే కానీ మనసుకి కాదు. అది నిరూపించి నాలాంటి వారికి ఆదర్శంగా నిలవాలనే నేనీ లక్ష్యం ఎంచుకున్నాను. ఈ ఒక్క ఎవరెస్టు శిఖరమే కాదు.. ప్రపంచంలోని అన్ని ఎత్తైన పర్వతాలూ అధిరోహించి చూపిస్తాను!"

నా గతాన్ని పూస గుచ్చినట్టు షెర్పాకు చెప్పాను.

అశ్రు నయనాలతో నన్ను బలంగా కౌగలించుకుని తనివితీరా ఏడ్చాడు షెర్పా.

నా కళ్ళు కూడా వర్షించాయి.

**"మెమ్ సాబ్...మీ పూర్తి పేరేంటి మేమ్ సాబ్..." గద్గద స్వరంతో అడిగాడు.**

"అరుణిమా సిన్హా" గర్వంగా జవాబిచ్చాను

***0***



# అదీ అసలు సంగతి

యువ కథ

**గంగాధర్ వడ్లమన్నాటి**

ఉదయం లేచింది మొదలు, మధుని లలిత సూటి పోటి మాటలంటోందే కానీ, సూటిగా అతని వంక ఓ చూపు చూడలేదు. ఓరచూపుకి బదులు ఊరపిచ్చుక లేహ్యం అమ్ముకునేవాడ్ని చూసినంత తేలిగ్గా చూసి తల తిప్పేస్తోంది. అదే చిరాగ్గా ఉందతనికి.

ఇక ఉండబట్టలేక, కుండ బద్దలుకొట్టినట్టు "ఇదేం బాలేదు. నిన్న శనివారం వీకెండ్ కదా అని స్నేహితులంటే, రెండు చుక్కలు, అంటే పిల్లలు పోలియో డ్రాప్స్ వేసుకున్నంత మందు తాగానంతే. దానికే ఏదో కొంపలు తేలినట్టు ఇలా రాద్ధాంతం చేసి నన్ను సాధించాలా. నేను ఉదయం నుండీ అన్నీ గమనిస్తూనే ఉన్నాను. నేను పళ్ళు తోమేప్పుడు నువ్వు పళ్ళుకొరకడం చూశాను. స్నానానికి వెళ్లినప్పుడు మూడు, నాలుగు సార్లు దబేల్, డబేల్ అని గిన్నెలు పడేసిన శబ్దం విని తుళ్ళిపడి రెండు సార్లు సబ్బు పడేసాను. అయినా ఎప్పుడో అమావాస్యకో, పౌర్ణమికో ఓ సారి స్నేహితులతో మాటా, మంతీ కోసం రెండు చెంచాల మందు తాగుతాను. దానికే మొహం మాడిన ముంతలా పెట్టుకుని, నన్ను ఇంతలా సల సలా వేపుకు తినాలా ? నీకు తాగుడు గురించి అవగాహన లేక ఇలా మాట్లాడుతున్నావ్." గయ్యిమన్నాడు మధు.

"నాకు తెలీదనుకోకండి. ఆ విషయానికొస్తే మా ఇంట్లోనూ తాగుబోతులు ఉన్నారు తెలుసా. మా పెద్ద నాన్న తాగుడు కోసం పది ఎకరాల భూమి అమ్మేసి తాగి తాగి, ముప్పైతొమ్మిదేళ్లకే చనిపోయాడు. మా నాన్న భూమితో పాటు ఇల్లు కూడా అమ్మి, అతని కంటే సంవత్సరం ముందు టపా కట్టేసి అతని రికార్డు బద్దలు కొట్టాడు. మా నాన్న ఎంత తాగాడో, ఆయన వాగుడుని బట్టి మా అమ్మ కనిపెట్టేసేది. అలాంటి కుటుంబంలో పుట్టిన నా దగ్గర అబద్దం చెప్పి తప్పించుకోవాలని చూడకండి. మీరు ఎంత ఎక్కువ తాగితే, నన్ను అంత ఎక్కువ పొగిడి, ఉక్కిరిబిక్కిరి చేస్తారని నాకు తెలుసు. మొన్నటివరకూ నన్ను చిన్న చితకా హీరోయిన్స్ తో పోల్చేసి పొగిడేవారు. అలాంటిది నిన్న ఏకంగా ఐశ్వర్యరాయితో పోల్చారు. అప్పుడే అనుకున్నాను. మీరు అలా ఇలా కాకుండా పీతలా పీకల దాకా తాగారని. అయినా నన్ను నేను అనుకోవాలి. వేరు కాపురం, వేరు కాపురం అంటే నేను మారు మాట్లాడకుండా సరే అని ఎగిరెగిరి గంతులేసాను. కానీ అత్తమామలతో

ఉంటే ఈ కొత్త అలవాటు ఎప్పుడు పడితే అప్పుడు సాగదని, ఇలా ప్లాన్ వేసారని ఆనక గానీ నాకు అర్ధం కాలేదు." అంటూ చేతిలో ఉన్న చీపురు విసిరేసింది.

ఆ చీపురు నుండి తప్పించుకుని, ఛ ఛ అని హాల్లోకి వెళ్లిపోయాడు. ఏదో గుర్తొచ్చినట్టు "ఆ అవును ఇవాళ మా రామం బాబాయిని ఇంటికి పిలవాలనుకున్నాను కదా." అని ఫోన్ చేతిలోకి తీసుకుని కాల్ చేసి, "ఆ బాబాయ్ ఎలా ఉన్నావ్. ఇవాళ మాటల సందర్భంలో నీ గురించి అనుకున్నాం. నువ్వు భోజనానికి వస్తే బావుంటుందని నా ఉద్దేశం. పిన్నిని కూడా తీసుకురా." చెప్పాడు మధు.

"పిన్ని రాలేదురా. నేను వస్తాలే. మీ పిన్ని వంటనుండి ఓ పూట విముక్తి. అమ్మాయి ఏం వండినా భలే కుదిరుతుందిరా. వీలుంటే ఆ పప్పుచారు కూడా పెట్టమనరా" అడిగాడాయన .

"సరే బాబాయ్ అలాగే. నువ్వు రా చెప్తాను" అంటూ ఫోన్ పెట్టేశాడు మధు.

రామం, మధు వాళ్ళ నాన్నకి సొంత తమ్ముడు. మధు వాళ్ళ ఇంటికి దగ్గరలోనే ఉంటాడాయన. మధు అంత అభిమానంగా పిలవడంతో సరిగ్గా భోజనం సమయానికి ఇంటికి వచ్చేసాడాయన.

కుశల ప్రశ్నలూ అవీ అయ్యాక, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ "అమ్మా లలితా నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా. ఇలాంటి భర్త దొరికాడు. నేను రాను రాను అన్నా సరే రావాల్సిందే అని పట్టుబట్టాడు. ఇది మొదటిసారి కాదు. నీకు తెలుసు కదా. ఎప్పుడు గుర్తొస్తే అప్పుడు ఇలా పిల్చేస్తాడు. ఇంటికి వచ్చి భోజనం చేసే దాకా వదలడు." చెప్పారు రామం గారు.

ఇంతలో లలిత కాస్త ఇబ్బందిగా చేతులు నులుముకుంటూ, "అదేం కాదు చినమావయ్యా. ఇన్నాళ్ళూ నువు ఏమన్నా అనుకుంటావని నేను నీకు అసలు విషయం చెప్పలేదు. ఆయన నిన్ను అడ్డు పెట్టుకుని ఆయన పబ్బం గడుపుకుంటున్నారు. అదీ అసలు సంగతి " చెప్పిందామె.

"అర్ధం కాలేదమ్మా" అన్నారు రామం గారు తల గోక్కుంటూ

"ఏం లేదు. ఆయన ముందు రోజు మందు తాగి వచ్చి పడుకుంటే, ఆ మరుసటి రోజు నేను ఆయనతో మాట్లాడను. ఆ పూట వంట చేయను. నాకు ఎలాగో ఉపవాసాలు అలవాటు కనుక, నేను తినక పోయినా ఉండిపోతాను. కానీ ఆయన అలా ఉండలేరు. అలాగని వండలేరు. బయట తింటే ఆయనకి పడి చావదు. అందుకే నీకు ఫోన్ చేస్తారు. నువ్వు వస్తే, నీకు టిఫిన్ లేదా భోజనం అదీ చేసిపెడతాను కదా, అప్పుడే ఆయన కూడా మెక్కేస్తున్నారు. ఇదీ అప్పుడప్పుడూ జరుగుతున్న అసలు బాగోతం!" చెప్పింది లలిత.

లలిత మాటలకి చిన్నగా నవ్వేసి "ఈ సంగతి నాకు ముందే తెలుసమ్మా. వాడితో ఉన్నదానివి నీకే ఇన్ని తెలిస్తే, వాడిని ఎత్తుకున్న వాడిని, పెంచిన వాడిని. నాకు ఇది తెలియక పోదా. కాకపోతే, ఇలా అయినా మీ ఇద్దరినీ రాజీ చేసినట్టు ఉంటుందని ఇలా హాజరవుతాను అంతే." చెప్పాడాయన చిరునవ్వుతో లలిత తలపై చేయి వేస్తూ.

అటుగా వస్తూ మధు ఇదంతా విన్నాడు. "ఛ ఛ, బాబాయ్ అంతా తెలిసి కూడా పాపం నాకోసం తెలియనట్టే వచ్చి, మా ఇద్దరినీ రాజీ చేసి వెళ్తున్నాడు. నేను మరోసారి ఇలా ప్రవర్తించకూడదు. ఇకపై ముందులా మందు తాగకూడదు. ఇది మళ్ళీ రిపీట్ చేయకూడదు" గట్టిగా నిర్ణయించుకున్నాడు.

"హమ్మయ్య, మధుకి ఈ విషయం తెలియాలని మనం గట్టిగా మాట్లాడుకోవడంతో, వాడు విన్నాడు. నే గమనించాను. మన ప్లాన్ సక్సెస్" అని రామం గారు గుసగుసగా అనగానే, 'అవును' అన్నట్టు హుషారుగా తల ఊపింది లలిత.

***0***

# క 'న్నీటి' ప్రవాహం



యువ కథ

రాచమళ్ళ ఉపేందర్

జోరు వాన, హోరు గాలి. జతగా చలి. ఉదయం నుంచీ ఒకదాన్ని మించి మరొకటి పోటీ పడ్తున్నాయి. ఏదీ తగ్గటం లేదు. తగ్గే సూచనల్లేవు. ఈదురు గాలి తాకిడికి పెద్ద పెద్ద చెట్లు వంగుతూ, లేస్తూ భీకర శబ్దం చేస్తున్నాయి. పిట్ట గూడులాంటి గుడిశల్లో ముడుచుకుపోయారు మనుషులు.

రాత్రి ఏడు కావొస్తోంది. ఏకధాటిగా ఏడుస్తున్నాయి మేఘాలు. వాగులు, వంకలూ పొర్లుతున్నాయి. వెంకట్రామ్ గుడిసె మాత్రం గుబులు వరదలో తేలుతోంది.

అనుకోని అతిథిలా ఊడిపడ్డ వానకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు వెంకట్రామ్. ఉరుములు, మెరుపులు... భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. తేప తేపకు గుడిసె బయటకు వచ్చి, వాన ప్రభావాన్ని అంచనా కడుతున్నాడు. తగ్గని చినుకులను తిట్టుకుంటూ, పెరుగుతున్న ఒత్తిడిని తట్టుకుంటూ లోపలికి వెళుతున్నాడు. లోనకు వెళ్లిన ప్రతిసారీ కూతురి తలపై చేయి పెట్టి, "భయపడకు నేనున్నానే" ధైర్యం చెప్తున్నాడు. కూతురి పక్కనే కూర్చున్న భార్య వైపు చూస్తూ 'ఏమీ కాదులే' అన్నట్లు కనుసైగలు చేస్తున్నాడు.

వెంకట్రామ్‌ది ఏజన్సీలోని ఓ మారుమూల గిరిజన పల్లె. బయట ప్రపంచానికి దూరంగా పదహారు కిలోమీటర్లు లోపలికి ఉంటుంది. అత్యవసరమైనా, ప్రాణాపాయం సంభవించినా హుటాహుటిన ఆసుపత్రికి చేరాలంటే కాలినడక తప్ప మరో దారి లేదు. చుట్టుప్రక్కల మరో పది గిరిజన పల్లెలు వున్నాయి. వాటి పరిస్థితీ అంతే. పైగా ఈ గిరిజన పల్లెల్ని ఏళ్ళ తరబడి వాగు సమస్యగా మారి వేధిస్తోంది. వానాకాలం వచ్చిందంటే చాలు ఉవ్వెత్తున ప్రవహిస్తూ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. పసివారి నుండి పండు ముసలి వరకు నిత్యావసరాలకో, వైద్య చికిత్సకోసమో వెళ్ళాలంటే, ఆ వాగుపై సర్కస్ ఫీట్లు తప్పనిసరి. గర్భిణీ స్త్రీల అవస్థలైతే వర్ణనాతీతం. వాన లేకుంటే ఈపాటికి కూతుర్ని ఆసుపత్రికి

తీసుకెళ్ళేవాడు. ఓ పక్క కూతురికి నొప్పులు .. మరో పక్క చినుకుల కుప్పలు .. వెంకట్రామ్ కు, అతని భార్యకు కాళ్ళు చేతులు ఆడటం లేదు. మూడు రోజుల కిందటే ఆసుపత్రిలో చూపించారు. డెలివరీకి మరో పది, పదిహేను రోజులు పట్టొచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ కథ అడ్డం తిరిగింది. కడుపులో బిడ్డ ఎగిరెగిరి తంతున్నట్లుగా కూతురి గుండె పగులుతోంది.

***

కాలే కడుపు, కడు పేదరికం వెంకట్రామ్‌ను పోడు వ్యవసాయం చేస్తున్న తండ్రికి చేదోడువాదోడుగా మార్చాయి. కాలక్రమంలో తండ్రి మరణించడంతో పోడు వ్యవసాయమే జీవనాధారమైంది. వైవాహిక జీవితంలో ఇద్దరు పిల్లలు కలిగారు. కొడుకు నవీన్‌ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పించాడు. కూతురు బుజ్జి. ఆడపిల్ల కావడంతో తమకు దూరంగా ఉంచి చదివించడానికి భయపడ్డాడు. వెంకట్రామ్‌కు కూతురంటే చెప్పలేనంత ప్రేమ. దానికి కారణం కూడా లేకపోలేదు. వెంకట్రామ్ పుట్టిన రెండేళ్ళకే తల్లి చనిపోవడం తనని ఎంతగానో బాధించింది. తండ్రి చూపించిన అనురాగంతో కొద్దికొద్దిగా బాధలోంచి తేరుకున్నాడు. మళ్ళీ తన తల్లే కూతురి రూపంలో పుట్టిందని ఎంతగానో సంతోషించాడు. ప్రతి వారం జరిగే సంతకు కూతుర్ని భుజాల మీద ఎక్కించుకొని, జాగ్రత్తగా వాగు దాటి వెళ్ళేవాడు. సరుకులతో పాటూ, కూతురు అడిగిన బొమ్మలు, ఆట వస్తువులు, పీచు మిఠాయి ఏదీ కాదనకుండా కొనిచ్చేవాడు. రంగురంగుల గౌనులు కూడా తీసుకునేవాడు. నెలకు ఒకసారి కొడుకు దగ్గరకు వెళ్ళి చూసి వచ్చేవాడు.

వెంకట్రామ్ చదువుకోలేదు. కానీ మంచి మాటకారి. ఎంతటివారినైనా తన వాక్చాతుర్యంతో కట్టిపడేయడంలో దిట్ట. ఆ చుట్టుప్రక్కల పల్లెల్లో ఆయన మాటను గౌరవిస్తారు. మంచీ, చెడు మాట్లాడే విషయంలో అందరూ అతన్నే పిలుస్తుంటారు. ఈ క్రమంలో ఎప్పటిలానే ఎన్నికల జాతరొచ్చింది. పలు రాజకీయ పార్టీలు వెంకట్రామ్‌కు ఉన్న బలాన్ని గుర్తించాయి. అతని మాటకారితనాన్ని అవకాశంగా మార్చుకొని, అతని సహకారంతో ప్రచారం చేసాయి. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామని, వాగుపై బ్రిడ్జి కడతామని, మీ కష్టాలు తీరుస్తామని వాగ్దానాల ఎర వేసి, వెంకట్రామ్‌ను కీలుబొమ్మను చేసి ఓట్లు పిండుకున్నాయి. గద్దెనెక్కినాక 'యథా రాజా - తథా ప్రజా'.

గెలిచిన నాయకులు మొఖం చాటేయడంతో పల్లె ప్రజల ముందు అవమానంగా తోచింది వెంకట్రామ్‌కి. కానీ ఒక్కడే ఏం చేయగలడు. వెంకట్రామ్‌కి ముందుచూపు కూడా ఎక్కువే. నలుగురు నాలుగు నిందలు వేయకముందే మేలుకొన్నాడు. కనీసం డొంక దారినైనా బాగుచేసి, మట్టిరోడ్డు పోయాలనుకున్నాడు. కొందరిని కూడగట్టి, చందాలు పోగేసి కొంతవరకు మట్టిరోడ్డు పోయించాడు. కానీ అది ఎక్కువ కాలం నిలవలేదు. వరుసగా విరుచుకుపడిన తుపాన్ల ధాటికి మట్టిరోడ్డంతా చెల్లాచెదురైంది. శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు కావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు వెంకట్రామ్.

కాలం గడుస్తుండగా పల్లెల్లో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులందరినీ కూడగట్టి, పోడు భూముల పట్టాల కోసం ఎం.ఎల్.ఏ. ని కలవడానికి పోయాడు వెంకట్రామ్. కొన్ని గంటల నిరీక్షణ తరువాత ఎం.ఎల్.ఏ. దర్శనం దొరికింది. పెరుగుతున్న ఖర్చులకు కుటుంబ పోషణ దినదినగండంగా మారిందని, తరతరాలుగా సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని, వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వేడుకున్నాడు వెంకట్రామ్. గిరిజన రైతుల బాధ నాకు బాగా తెలుసని, త్వరలోనే ఈ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు ఎం.ఎల్.ఏ. ఈ క్రమంలో వారు తిరిగి వస్తుండగా ఎం.ఎల్.ఏ. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రాంజీతో పరిచయం కలిగింది. అతను కూడా గిరిజనుడు కావడంతో యుక్తవయసుకు వచ్చిన తన కూతుర్ని, వాళ్ళ పెద్దలతో మాట్లాడి, తన శక్తి కొలది కట్న కానుకలు ఇచ్చి పెళ్ళి చేసాడు.

***

రాత్రి పదైంది. బిడ్డకు నొప్పులు ఎక్కువతున్నాయి. అప్పటి వరకు నొప్పులు తగ్గడానికి తనకు తెలిసిన చిట్కాలు ఉపయోగించింది వెంకట్రామ్ భార్య. ఐనా ఫలితం లేదు. త్వరగా ఆసుపత్రికి తీసుకుపోకపోతే బిడ్డ ప్రాణానికే ప్రమాదమని హెచ్చరించింది. భార్య సూచనకు తనలో ఇంకా గుబులు ఎక్కువైంది. రోడ్డు సరిగా లేదు. వాగు దాటాలి. పైగా రాత్రి. ఆలోచనల సుడిగుండంలో వెంకట్రామ్. గుడిసెలోంచి మళ్ళొకసారి బయటకు తొంగిచూసాడు. ఈడ్చి ఈడ్చి కొడుతోంది వాన. బయట కుండపోత... లోపల కూతురి చెంపలపై కన్నీటి ధార .. కన్నపిల్లలు కళ్ళెదుటే కంటతడి పెడ్తుంటే ఏ తండ్రైనా ఎలా తట్టుకోగలడు. ఆలస్యం చేస్తే లాభం లేదనుకున్నాడు. చూరుకు తగిలించిన గొడుగు తెరిచాడు. ఒక్కసారిగా నక్షత్రాల్లా మెరిసాయి గొడుగుకు పడిన చిల్లులు. ఎటు గాలొస్తే .. అటు బ్యాలెన్స్ చేస్తూ బురదలో నడవసాగాడు. నాలుగు గుడిసెలు దాటాడో లేదో అప్పటికే సగం తడిసాడు. గుండె లోపల పెరుగుతున్న కన్నీటి తడి... ఒంటి మీద నీళ్ళ తడికి .. సన్నటి వణుకు మొదలైంది. ఐనా గబగబా నడిచాడు. "హరిలాల్... హరిలాల్...!" అంటూ కేకలేసాడు. అప్పటికే పడుకున్నాడో ఏమో గానీ చాలాసేపటికి "ఆ...బియ్యా..." అంటూ బయటకు చూసాడు. జరిగింది చెప్పాడు. హరిలాల్ గబగబా టార్చిలైట్ అందుకొని, పశువుల పాక పక్కనున్న రెండు వెదురు బొంగుల్ని పట్టుకొని వెంకట్రామ్‌ను అనుసరించాడు.

కాసేపట్లోనే రెండు బొంగులకు మందం దుప్పటిని కట్టి జోలె తయారుచేసాడు హరిలాల్. కూతుర్ని దాంట్లో పడుకోబెట్టారు. ముందు వెంకట్రామ్, వెనుక హరిలాల్ జోలెను భుజాలపైకి ఎత్తుకున్నారు. దానిపైన కూతురు తడవకుండా ప్లాసిక్ కవర్‌ను, కర్రలతో కలిపి పట్టుకున్నారు. వెంకట్రామ్ భార్య టార్చిలైట్ ఆన్ చేసి వారి వెనుక నడుస్తోంది.

కురిసి కురిసి విసుగొచ్చిందో... లేక వారి అదృష్టం బాగుందో.... మొత్తానికి విరామం లేని వాన తగ్గుముఖం పట్టింది. చిన్న చిన్న చినుకులు అడపా దడపా రాల్తున్నాయి. కాస్త ఊరట లభించింది. నడకలో వేగం పెంచారు. వాగును సమీపించగానే వెంకట్రామ్ భార్య ముందుకొచ్చి టార్చిని ముందుకు, వెనక్కి జరుపుతూ ప్రవాహన్ని గమనించింది. ప్రవాహం ఉధృతంగానే వుంది. కూతురికేమో ఎక్కువవుతున్న నొప్పులు... తప్పదు... ఆరు నూరైనా వాగు దాటాల్సిందే.

పుట్టి పెరిగినప్పటి నుండి కొన్ని వందల సార్లు వాగు దాటి వెళ్ళాడు, తిరిగి వచ్చాడు వెంకట్రామ్. దాని గురించిన అనుభవం తనకు చాలా ఎక్కువ. ఎక్కడ కాలుపెట్టాలో... ఎంత జాగ్రత్తగా నడవాలో తనకు బాగా తెలుసు. ఆ ధైర్యంతోనే ముందుకు కదిలాడు. వెంకట్రామ్ భార్యకు పై ప్రాణాలు పైనే పోతున్నట్లుగా అన్పిస్తోంది. "తమాళన్ సాల్" అంటూ భయం భయంగానే అడుగు తీసి అడుగు వేస్తోంది. వాగు సగం దాటారు.

ఉన్నట్లుండి వెంకట్రామ్ కుడికాలుపై ఏదో పురుగు కుట్టింది. "అబ్బా..!" బాధతో కొద్దిగా వంగి కుట్టినచోట రుద్దుకోబోయాడు. అంతే! అప్పటి వరకు బొంగుల్ని మోసి మోసి కందిపోయిన భుజాల్లో పట్టు సడలిందేమో ఎడమవైపు కర్ర పట్టుతప్పింది. వెంకట్రామ్‌కు గుండె జారినంత పనైంది. చటుక్కున కర్ర అందుకోబోయాడు. ఈలోపు కుడికాలు జారింది. ముందుకు ఒరిగాడు. హరిలాల్ ఒక్కడే బ్యాలెన్స్ చేయలేకపోయాడు. కూతురు నీళ్ళలోకి జారింది. "యే యాడియే... మార్ బేటీ పడిగియే.." అంటూ గట్టిగా అరిచింది వెంకట్రామ్ భార్య. "యే...బా... యే...బా...!" అంటూ కొట్టుకుపోతూనే వుంది కూతురు. ఉన్నపళంగా లోపలికి దూకాడు వెంకట్రామ్. కూతురు... తండ్రి.... తండ్రి... కూతురు... ప్రవాహానికి తారుమారవుతున్నారు. చీకటి కావడంతో ఒకరికి ఒకరు చిక్కడం లేదు. అరుపు వినిపించిన వైపుకి బలంగా ఈదుతున్నాడు. హరిలాల్, వెంకట్రామ్ భార్య వాగు పక్క నుంచి వెంకట్రామ్ అరుపు వినబడినప్పుడల్లా పరుగు తీస్తున్నారు. నీళ్ళలోకి టార్చి వేస్తూ "తమాళన్ బియ్యా..." జాగ్రత్తలు చెప్తున్నాడు. కిలోమీటరు వరకు సాగిన వెతుకులాట ఒక్కసారిగా ఆగిపోయింది. చేతికి దొరికిన కూతుర్ని జాగ్రత్తగా పట్టుకొని వాగు పక్కకు చేరాడు. అతి కష్టమ్మీద హరిలాల్ వాళ్ళిద్దరిని పైకి లాగాడు.

ఆయాసంతో రొప్పుతున్నాడు వెంకట్రామ్. ఉలుకుపలుకూ లేకుండా పడిఉన్న వెంకట్రామ్ కూతురి ముఖంపై టార్చి వేసాడు హరిలాల్. అక్కడున్న ముగ్గురి కంట్లో నెత్తురు చుక్క లేదు. హరిలాల్‌లో కత్తిపోట్లు దిగుతున్నంత నొప్పి. ఆకాశం కూలి మీదపడ్డుందా అన్నట్లు ఏడుస్తున్నాడు హరిలాల్. వెంకట్రామ్, అతని భార్య వూహించని పరిణామం ఎదురుకావడంతో స్థాణువులైనారు.

"ఓ... బియ్యా... మార్ బేటా... ఎలా అయ్యాడో చూడు... తెలివికల్లోడంటివి... సదువుకొని గొప్ప ఉద్యోగం చేస్తాడంటివి... నాకెందుకు ఇలా జరిగింది? వాణ్ణొకసారి లేపు బియ్యా... వస్తున్నానని పొద్దున్నే ఫోన్

చేసాడు. వానొస్తుంది రావద్దని చెప్పాను. అయినా నా మాట విన్లేదు. మన బతుకులింతేనా? ఇంకెన్ని ప్రాణాలు ఈ వాగులో కలిసిపోవాలి? మమ్మల్ని చూడ్డానికొస్తుంటే, నా ఒక్కగానొక్క కొడుకుని వాగు పొట్టనబెట్టుకుంది'' అంటూ గుండెలవిసేలా ఏడ్వసాగాడు.

'మరి నా కూతురేది?' కట్టలు తెగుతున్న దు:ఖంతో వాగు వైపు తిరిగాడు వెంకట్రామ్. రెప్పపాటులో నీళ్ళలోకి దూకాడు. ''నా బుజ్జి... ముద్దులతల్లి ఏమైపోయావే? ఎక్కడున్నావే?'' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తూ... బలంగా ఈదుతున్నాడు.

హరిలాల్ కొడుకుని, వెంకట్రామ్ కూతుర్ని పొట్టనబెట్టుకుంది ఎవరు? వానా..? వాగా..? కాదు... ముమ్మాటికి కాదు... కారకులు ఎవరో కారకులకు తెలుసు. వారికి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమూ తెలుసు. ఎందుకంటే వాళ్ళు మనుషులు కాదు... అమాయక గిరిజనులను శవాలుగా మార్చి పీక్కుతినే రాబందులు...!

***O***

# దైవం మానుష రూపేణా

శశికళ ఓలేటి



"లోటు పెట్టిన భగవంతుడే...ఆ లోటును పూరించే మార్గాలు కూడా చూపిస్తాడమ్మా! సరయిన సమయంలో...సరయిన ప్రదేశంలో...సరయిన వ్యక్తిని ఆయనే చూపిస్తాడు. ఆయనే దారి చూపిస్తాడు! నిరుత్సాహపడకు రాధా! ఓపిగ్గా ఆశావాదంతో... వేచివుండడమే నువ్వుచెయ్యగలిగింది!".... అంటూ తన దుఃఖాన్ని తగ్గించడానికి .. తండ్రి తరచూ చెప్పే మాటలు గుర్తొచ్చాయి .. ఆ కొత్త ఊరిలో... ఊరి శివార్లలో ఉన్న హెచ్ బీ కాలనీలో, ఆ చిన్న ఎల్ ఐ జీ ఇంటికి ... మోహన్ కు .. ట్రాన్స్ఫరై మారినప్పుడు!

ఈ కొత్త ఊరూ, కొత్త పరిసరాలూ ఎంతవరకూ తండ్రి మాటలు నిజంచేస్తాయో .. చూడాలి అనుకుంది రాధ!

పెద్ద పిల్లాడు కేతన్, తండ్రితో పాటూ కొత్తగా అడ్మిషన్ తీసుకున్న స్కూల్ కు వెళ్ళిపోయాడు. తల్లితో పాటూ.. ఇంటి మెట్టు మీదే కూర్చున్న .. చిన్నాడు పదేళ్ళ చేతన్ .. తల్లిని సతాయిస్తున్నాడు! "నన్ను స్కూల్ పంపవా".. అంటూ... ముద్ద మాటల్లో... మాటలు గుణించుకుంటూ!

"వెతకాలి నాన్నా! నీకు సరిపడా స్కూలు ఎక్కడుందో ఈ ఊళ్ళో! అయినా మన దగ్గర అన్ని డబ్బులు లేవు కదా... నీ స్పెషల్ స్కూలుకు ఫీజ్ కట్టడానికి!".... అంటూ ఏవో సంజాయిషీలు ఇస్తోంది రాధ కొడుక్కు! లోపలికి పరుగెత్తాడు చేతన్. రయ్యిమని బయటకు వచ్చాడు. చేతిలో మట్టి డిబ్బీ! ఫట్టుమంటూ నేలకేసి కొట్టాడు. నాలుగు వేపులా చిమ్మేసిన చిల్లరంతా ఏరి, తల్లి ఒడిలో వేసి "ఇవిగో డబ్బులు! పద స్కూలుకు" అంటూ గుంజుతుంటే, వాడికేసి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది రాధ!

ఇంతలో "లక్ష్మీ! ఆకుకూరలబ్బి వచ్చాడు! గోంగూర తీసుకోనా? పచ్చడి చేసుకుందాం!" అంటూ పక్కింట్లోంచి స్వరం వినిపించింది! ఆ వీధిలో ఉన్న వరుస ఇళ్ళన్నీ ఎంత చిన్నవంటే .. ఇళ్ళ మధ్య గోడలున్నా లేనట్టే! ఒకరి మాటలు ఇంకొకరికి స్పష్టంగా వినిపిస్తాయి!

పక్కింటాయన, వాళ్ళ చిన్న లోగిట్లో వేసిన పూలమొక్కల నుండి పూలు తెంపుకుంటూ, లోపలికి చూస్తూ అరుస్తున్నారు. బహుశా ఆయన భార్య ఏ పనిలో ఉన్నారో ఏమో, జవాబివ్వలేదు. ఆయన గోంగూర కొనుక్కుని, లోపలకు పోబోతూ .. రాధనూ, చేతన్ నూ చూసి ఆగి, నవ్వుతూ పలకరించారు "సుబ్బారావు గారింట్లోకి కొత్తగా వచ్చారేవిటమ్మా?" అంటూ!

"అవునండి!" అంటూ జవాబిచ్చింది రాధ!

"నీ పేరేవిటోయ్!" అంటూ చేతన్ ను పలకరించారు! ఆయన ప్రశ్నించిన ఒక నిమిషానికి కానీ ఆ ప్రశ్న వాడి బుర్రలో నమోదవ్వకపోవడంతో ఎటో చూస్తూ ఉన్నాడు. ఆయన లోపలికి వెళ్లబోతుంటే .. మెల్లగా "చేతన్"... అంటూ ముద్దముద్దగా చెప్పాడు!

ఆయన ఒక్కసారి తేరిపార చూసారు వాడికేసి! చక్కని ఛాయలో, ఎత్తుగా, బలంగా, ఆరోగ్యంగా ఉన్నాడు వాడు! కానీ నిస్తేజమైన ఆ కళ్ళు .. చంచలంగా ఎటో చూస్తూ, నిర్వికారమైన ఆ మొహంలో .. మాట్లాడుతుంటే చొంగకారుతున్న ఆ నోరు, వాటి ఆటిజమ్ చిహ్నాలు దాచలేకపోతున్నాయి! మౌనంగా తలాడించి, లోపలికి పోయారాయన! రాధకు అర్థమయింది .. చేతన్ స్థితి ఆయనకు అర్థమయ్యిందని.

రాధ, మోహన్ ల మధ్యతరగతి స్థాయి చేతన్ పుట్టుకతో దిగువ మధ్యతరగతికి దిగజారిపోయింది. కేతన్ పుట్టిన మూడేళ్ళకు వచ్చిన అవాంఛిత గర్భాన్ని వదిలించుకోవాలని, రాధ మింగిన నాటు మందుల ఫలితమే .. బుద్ధిమాంద్యంతో పుట్టిన చేతన్! వాడి వైద్యాలు, సైకియాట్రిక్ కౌన్సలింగులు, స్పెషల్ స్కూల్స్ .. వారిద్దరినీ ఆర్థికంగా కుదేలు చేసాయి! పిల్లాడిని దగ్గరుండి చూసుకోవలసిన పరిస్థితి అవ్వడంతో, రాధ ఉద్యోగానికి వెళ్ళలేని పరిస్థితి! ఇంట్లోనే ప్రస్తుతం చేతన్ కు చదవడం, రాయడం నేర్పుకుంటోంది.

ఇద్దరు పిల్లల్లో ఒకడు మేధావి, మరొకడు మందబుద్ధి అయితే పుట్టుకొచ్చే అసమానతలూ, అసహనాలూ అన్నీ కేతన్, చేతన్ ల మధ్య నెలకొని ఉన్నాయి! మోహన్ దృష్టంతా కేతన్ మీద, వాడి భవిష్యత్తు మీదే! అతని ఉద్దేశ్యంలో చేతన్ .. తాము జీవితాంతం భరించాల్సిన ఒక భారం! ఎలాంటి ఆశా, భవిష్యత్తు లేని ఒక వృధా జన్మ అంతే! అలాగే... తమ ఇంటి పేదరికానికీ, సమాజంలో సానుభూతికీ, తల్లిప్రేమ తనకు దూరం కావడానికీ కారణమైన చేతన్ అంటే... కేతన్ కు లేశమాత్రం కూడా ఆత్మీయత, సోదరబంధం లేదు! తన వెంట వెంట తిరిగే తమ్ముడిని, తొందరలో తీసుకుపొమ్మని భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటాడు వాడు!

ఇల్లు, ఆటిస్టిక్ కొడుకూ రాధకు తప్పని, తప్పించుకోలేని బాధ్యతలు! ఆమె మాతృహృదయం ఎప్పుడూ ఆ చిన్న కొడుకు చుట్టూరా పరిభ్రమిస్తూ ఉంటుంది. తను చేసిన తప్పిదానికి శిక్ష వాడు అనుభవిస్తున్నందుకు ఆమె అనుక్షణం కుమిలిపోతూ ఉంటుంది. ఇలాంటి రోజుల్లో .. ఒక ఉదయం చేతన్ ఇంట్లోంచి మాయమయ్యాడు! పిచ్చిదానిలా వీధంతా పరుగెట్టింది. ఆమెకు సాయం చెయ్యడానికి .. పక్కింటి కుటుంబరావుగారు కూడా వెనుకనే పరిగెట్టారు. ఒక గంటసేపు వెతికాకా, ఇంక పోలీస్ రిపోర్ట్ ఇవ్వడం మంచిదని అనుకుంటుంటే, అప్పుడు కనిపించాడు చేతన్, ఇద్దరు వృద్ధులను చెరో చేత్తో పట్టుకుని వస్తూ!

వీరుండే ఏరియాలో ఉన్న ప్రముఖ వృద్ధాశ్రమంలో ఉంటారుట వారిద్దరూ! చేతన్ ఆశ్రమంలోకి వచ్చి, వారందరితో ఆడుకున్నాడని, ఆ వయసు పిల్లల్లో అంత దయ, ఆదరణ తాము ఎక్కడా చూడలేదని వారంటుంటే, కొడుకులోని ఈ కొత్త కోణానికి ఆశ్చర్యపోయింది రాధ!

“ఏమ్మా! పిల్లాడిని అలా ఇంట్లో ఉంచడం ప్రమాదం! ఏదయినా స్పెషల్ ఎడ్యుకేషన్ ఫర్ ఛాలెంజ్డ్ కిడ్స్... స్కూల్ లో వెయ్యకపోయావా?” అని అడిగారు కుటుంబరావుగారు! రాధ కళ్ళలో అసహాయతతో కూడిన కన్నీరు, ఆమె మౌనము ఆయనకు వారి స్థితిని పట్టిచ్చింది!

ఆ రోజు నుండీ చేతన్ మకాము ఇంచుమించు కుటుంబరావు గారింటికి మారిపోయింది. మొదటిరోజు పిల్లాడిని ఇంటికి రమ్మని పిలవడానికి వెళ్ళిన రాధ .. ఆయన భార్య లక్ష్మిగారిని చూసి ఆశ్చర్యపోయింది. ఆమె పూర్తిగా మంచాన్ని ఆశ్రయించి ఉన్నారు! కేవలం కళ్ళూ, చెవులూ, కాస్త మెడ మాత్రమే తిప్పగల అచేతన స్థితిలో , వెజిటబుల్ స్టేట్ లో ఉన్న ఈమెనా ఆయన పదేపదే పిలుస్తూంటారు! అభిప్రాయాలు అడుగుతుంటారు, సలహాలు చెప్పమంటారు, బతిమాలడాలూ, కోపం తెచ్చుకోవడాలూ .. అన్నీ ఈ జీవమున్న అచేతనురాలితోనా! ఒక సహాయకురాలి సాయంతో భార్యను అపురూపంగా చూసుకుంటున్న ఆయన మీద ఒక్కసారిగా వెయ్యింతల గౌరవం పెరిగిపోయింది ఆమెకు.

చేతన్ బాధ్యత చాలా ఆనందంగా, స్వచ్ఛందంగా తీసుకున్నారు కుటుంబరావు గారు. ఆయన ప్రోద్బలంతో రాధ అక్కడకు దగ్గరే ఉన్న చిన్న సాఫ్ట్వేర్ కంపెనీలో డేటా అనలిస్ట్ గా జాయిన్ అయింది. చేతన్ మెల్లమెల్లగా రాయడం, చదవడం నేర్చుకుంటున్నాడు! వాడిలో ఉన్న సేవాభావం వాడికి కొత్త ద్వారాలు తెరిచింది. కుటుంబరావుగారు వాడికి చిన్నచిన్న నర్సింగ్ టాస్కులు నేర్పేవారు. లక్ష్మిగారికీ, తనకూ టెంపరేచర్, బీపీ చూడడం, సుగర్ టెస్ట్ చెయ్యడం, ఆ రీడింగ్స్ అన్నీ రిజిస్టర్లో రాయడం వంటివి చేతన్ చకచకా చేస్తున్నాడు ఇప్పుడు! అలాగే రకరకాల మందుల పేర్లు చదవడం, మందులు గుర్తుపట్టడం, ఏ

జబ్బుకు ఏ మందో చెప్తూ, ఆ మందుల ఫార్మస్యూటికల్ కాంపోజిషన్లు చెప్పడం .. ఇవన్నీ నేర్పిస్తున్నారు వీడికి!

చేతన్ ది జెనిటికల్ గా సంక్రమించిన ఆటిజమ్ కాకపోవడంతో వాడి మెదడు కొన్ని పజిల్స్, లెక్కలు సాధించడం ద్వారా, స్పెల్లింగులు, ఎక్కాలూ కంఠతా పట్టడం ద్వారా, చురుకుదనం సంతరించుకోసాగింది! వాడి మాట మాంద్యానికి తనకు తెలిసిన స్పీచ్ థెరపిస్ట్ దగ్గర ట్రీట్ మెంట్ కు తీసుకుపెళ్ళే వారు. పూర్తిగా కాకపోయినా కాస్త అర్థమయ్యేంత స్పష్టంగా వాడికి మాటలు వస్తున్నాయి. లక్ష్మిగారి పక్కన కూర్చోపెట్టి న్యూస్ పేపర్ చదివించేవారు వాడితో. వాడి తప్పుడు తడకలకు ఆమె కళ్ళలో మెరిసే చిన్న దరహాస రేఖ ఆయనకు చాలా అబ్బురంగా ఉండేది!

చేతన్ బాధ్యత తగ్గడంతో రాధ కుటుంబ పరిస్థితులు మెరుగవుతున్నాయి. కొడుకులో వస్తున్న మార్పులకు మోహన్, కేతన్ చాలా ఆశ్చర్యపోయారు. రాధ ఎంత మొత్తుకున్నా వాడి బాధ్యత కొంతయినా తీసుకోకుండా, విస్మరించకుండా ఉంటే, వాడిలో ఈపాటికే కాస్త ఇంప్రూవ్ మెంట్ ఉండేదేమో అనుకున్నాడు మోహన్! చిన్న కొడుకు మీద కాస్త ఆదరణ పెరిగింది మోహన్ కు!

చేతన్ కు పద్నాలుగేళ్ళొచ్చాయి. ఒక రాత్రి వేళ నిద్రలోనే పోయారు మహాలక్ష్మిగారు! కుటుంబరావుగారి దుఃఖానికి అంతులేదు. చాలా క్రుంగిపోయారు. కొడుకులు అమెరికా నుండి వచ్చారు. తండ్రిని తమతో వచ్చేయమని ఎంత బలవంతం చేసినా, తన భార్య జ్ఞాపకాలున్న ఆ ఇంటిని వదిలి ఎక్కడకూ రానన్నారు. ఏమో .. చేతన్ తో ఆయనకు ఏర్పడిన బంధం కూడా, ఆయనను నిరోధించిన ఒక కారణం కావచ్చు!

ఆయన చిన్నతనంలో వారి కుటుంబంలో జరిగిన ఒక దుర్ఘటన ఆయనను చేతన్ విషయంలో శ్రద్ధ తీసుకునేట్టు దృఢ నిశ్చయుడ్ని చేసింది. మేనమామనే పెళ్ళాడిన తన అక్కకు డౌన్ సిండ్రోమ్ తో పుట్టిన అమ్మాయి ఆ కుటుంబానికి పెను భారమవ్వడం, ఆ అమ్మాయిని పదిహేనేళ్ళ వయసులో ఎవరో సెక్సువల్ అబ్యూజ్ చెయ్యడంతో ఆ అమ్మాయి ప్రెగ్నెంట్ అవ్వడం .. ఇవన్నీ భరించలేని బావగారు, ఆ అమ్మాయికి పీక పిసికేసి నూతిలో పడేసి, చేతులు దులుపుకోవడం గుర్తొచ్చి, ఆయన మనసు వికలమైపోతూ ఉంటుంది. ఆ సంఘటన చూసిన ఆయన అక్కగారు అపరాధ భావంతో తనూ కూతురి దగ్గరకే వెళ్ళిపోయింది .. అదే బాటన!

"ఏ అపరాధం చేసారని ఈ పిల్లలు ఇంత దయనీయంగా జీవిస్తున్నారు? ఎవరికీ అక్కరలేని పిల్లలు వీరు. కన్నందుకు తల్లితండ్రుల గుండెలపై భారంగా మిగిలిపోయి, ఎప్పుడెప్పుడు ఈ భూమిమీంచి

విముక్తులవుతారా అని అందరూ ఎదురుచూసేలా ఉన్న వీరి భవిష్యత్తే ఒక పెద్ద ప్రశ్నార్థకం! బ్రతకడానికి కావలసిన జీవన నైపుణ్యాలు ఏవీ లేక, పరులపై ఆధారపడి బ్రతుకుతూ, ప్రేమనూ, నిందలనూ ఒకేలా అనుభవిస్తూ, ఎంత దుర్భరం వీరి జీవితం!" ఆయన ఆలోచనలు ఎడతెగకుండా సాగుతూ ఉంటాయి చేతన్ ను చూస్తుంటే!

చేతన్ భవిష్యత్తులో ఎవరి మీదా ఆధారపడకుండా కుటుంబరావు గారు వాడికి కొన్ని జీవన నైపుణ్యాలు నేర్పించసాగారు. టీ పెట్టడం, కుకర్ పెట్టి అన్నం, పప్పు వండడం, జాగ్రత్తగా కూరలు కోయించి, వేపుళ్ళు, సాంబారూ, రసం పెట్టడం నేర్పించారు! తన ఇంటినే వాడికి పాఠశాలగా మార్చారు. ఆయనకు తెలుసు తనది ఈ భూమ్మీద మూన్నాళ్ళ ముచ్చటేనని!

చేతన్ లో మరొక అద్భుతమైన నైపుణ్యాన్ని కుటుంబరావుగారు గుర్తించారు! రంగులను నేర్పుగా మిళితం చేసి కాన్వాస్ మీద అతను సృష్టించగల కళాఖండాలు... అతని జీవితానికి కొత్త ద్వారాలు తెరవగలవని ఆయన భావించారు! ప్రాథమిక స్థాయి నుండి మొదలు పెట్టించి, అంతర్జాలంలో ప్రముఖ చిత్రకారుల చిత్రలేఖనాన్ని పరిశీలింపచేస్తూ, ఆన్లైన్ క్లాసెస్ ద్వారా అతను చిత్రలేఖనంలో మరిన్ని మెళుకువలు నేర్చుకొని, అతనిలోని అద్భుత కళకు మెరుగులు దిద్దుకునేట్టు ప్రోత్సహించడం మొదలుపెట్టారు! ఇవన్నీ చాలా ఖర్చుతో కూడుకున్న పనులు! అయినా ఖర్చుకు వెరవకుండా, చేతన్ ను చిత్రలేఖనంలో తీర్చిదిద్దడం మొదలుపెట్టారు!

వాడికి డబ్బు విలువ, డబ్బు సంపాదన ఆవశ్యకతలతో పాటూ డబ్బు లెక్కపెట్టడం, బేంక్ పనులు చెయ్యడం ఎలాగో వివరిస్తూ మెల్లగా అలవాటు చేసారు. సైకిల్ , స్కూటర్ కూడా నేర్పించారు ఒక మనిషిని పెట్టి! సమీపంలో ఉన్న వృద్ధాశ్రమానికి తీసుకెళ్ళి, వృద్ధులకు బట్టలూ, డైపర్స్ మార్పించేవారు వాడిచేత. ఎప్పుడూ అసహ్యం కానీ, విసుగు, చిరాకు కానీ లేని వాడిని చూస్తుంటే .. ప్రపంచపు కల్మషం వీడిలోకి చేరనివ్వని వీడి మెదడు ఎంత గొప్పది అనుకుంటారు ఆయన!

స్పెషల్ కేటగిరీలో టెన్త్ అవ్వడంతో, ఒక ప్రైవేట్ నర్సింగ్ స్కూల్ లో ఐదేళ్ళ నర్సింగ్ కోర్స్ లో పెట్టారు రాధ మోహన్లు చేతన్ ను!

థియరీ కాస్త ఇబ్బంది పడుతున్నా, ప్రాక్టికల్స్ లో చేతన్ చూపించే ఉత్సాహం అక్కడ టీచింగ్ స్టాఫ్ కు ఆశ్చర్యంగా ఉంటుంది. చేతన్ దినచర్య కూడా తన మెంటార్ నిర్దేశించినట్టే సాగుతుంది. ఉదయం, రాత్రి ఆరు, ఎనిమిది లోపున నలుగురు వృద్ధులకు ఇన్సులిన్ ఇంజక్షన్లు చేసి వస్తాడు! ఆదివారాలు

వృద్ధాశ్రమంలో వాలంటీర్ గా పనిచేస్తాడు! దీని వలన గడించిన డబ్బంతా అతని చేతే బేంక్ లో వేయిస్తారు కుటుంబరావుగారు! సమయం ఉన్నప్పుడల్లా కుటుంబరావుగారి మేనల్లుడి ఆసుపత్రిలో నర్సింగ్ డ్యూటీ చేస్తాడు. ఈ మధ్య కొత్తగా ఐసీయు నైపుణ్యాలు కూడా ఆసక్తిగా నేర్చుకుంటున్నాడు. ఆక్సిజన్ మాస్క్, ఐవీ కాన్యులా అమర్చడం, ఈసీజీ రికార్డ్ చెయ్యడం వంటివి!

చేతన్ కు మామూలు కుర్రాళ్ళ ఐక్యూ చురుకుదనం, స్పందన కాస్త తక్కువ ఉండచ్చేమో కానీ .. మానవత్వం, సేవాభావం, అంకితభావంలో అతనికి సాటిలేదు! అతను నర్సింగ్ లో ప్రావీణ్యాలు సంపాదించినా ప్రభుత్వ రంగ వైద్య సంబంధిత ఉద్యోగాలకు అర్హుడు కాదు! కానీ ముందు ముందు ప్రైవేట్ ఆసుపత్రులలో అతను నర్సింగ్ అటెండెంట్ గా పని చేసుకోగలడు! ఏ వృద్ధాశ్రమంలోనైనా వృద్ధులకు సేవలందించగలడు! ఆ విధంగా ఎవరి మీదా ఆధారపడకుండా తన జీవికను తాను సంపాదించుకోగలడు!

తన మెదడులోని రకరకాల సంఘర్షణలకు రంగులద్ది అపూర్వమైన కళాఖండాలు తయారు చేయగలడు! తద్వారా కొంత ఆదాయం పొంది, తన జీవితాన్ని భద్రం చేసుకోగలడు! అతని అదృష్టం బాగుంటే, ముందు ముందు అతన్ని ప్రేమతో స్వీకరించే జీవిత భాగస్వామిని కూడా దొరకవచ్చు, అతనికి అన్ని విధాల సహకారం అందిస్తూ!

ఈ రోజు రాధకు కొడుకు గురించి బెంగ లేదు. తన తరువాత వాడి బ్రతుకేమిటనే ప్రశ్న లేదు! అతనెంచుకున్న సేవా మార్గమే అతని జీవితానికి బ్రతుకు తెరువు! తండ్రి చెప్పిన మంచి మాటలు నిజమైనందుకు ఆమె పదే పదే భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకుంటుంది!

అయితే భగవంతుడు ఆమెకు చూపించిన మార్గదర్శి కుటుంబరావుగారు మాత్రం చేతన్ జీవితంలోనే తన చరమాంకాన్ని రచించుకున్నారు. “ప్రవచనాలూ, పురాణ కాలక్షేపాలతో గడపవలసిన కాలం ఇలా ఒక మానసిక పరిపక్వతలేని వాడిని తీర్చిదిద్దడంలో గడపడం ఏంటండి?” అని ఎవరైనా ప్రశ్నిస్తే “మానవసేవే మాధవసేవ కదండీ ! పై వాడు ప్రతీవాడినీ ఒక ప్రత్యేక లక్ష్యం కోసం, ఒక ప్రణాళికతో పంపిస్తాడు. వీడి జీవితం అంతే! నేను చేసేది భగవంతుని ప్రణాళికలో భాగం అవ్వడం మాత్రమే!” అంటూ వినమ్రతతో జవాబిచ్చి, శిష్యునితో ముందుకు సాగిపోతారంతే కర్మయోగిలా!

***0***

# అభిమాని

**భాగవతుల కృష్ణారావు**



రవి పార్కులో అడుగుపెట్టాడు. అతనికివాళ చాలా ఆనందంగా వుంది. నిన్న తన అభిమాన రచయితతో ఫోన్లో మాట్లాడి ఇవాళ తనని ఈ పార్కులో కలియటానికి ఒప్పించగలిగాడు. అసలాయన తన ఫొటోని ఎక్కడా ఎందుకు ప్రచురింపనిచ్చగించడో అర్థం కావడం లేదు.

కురూపా?! వికలాంగుడా?! భగ్నప్రేమికుడా?!

రవిలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. ఏదేమైనా తనివాళ ప్రముఖ రచయిత శతభిషాన్ని కలుసుకోబోతున్నాడు.

చాలా ఎగ్జైటింగ్ గా కంగారుగా వుంది.

ఎలా వుంటాడో?

ఎలా మాట్లాడతాడో?

ఇవాళ అన్ని అడిగేయాలి..

అతని అబిమాన రచయిత ఎవరో, అతని భవిష్యత్ ప్రణాళికలు, అతని సంసారం .. పెళ్లయిందా? ఏమో?

చుట్టూ చూసాడు. సాయంత్రం కావడంతో చాలా మందే వున్నారు. తన చుట్టూ వున్న సిమెంట్ బెంచీలన్నీ నిండిపోయాయి. వీళ్లెవరికీ తెలీదు తను ఆంధ్రుల అభిమాన రచయిత శతభిషాన్ని ఇక్కడే మరికాస్సేపట్లో కలుసుకోబోతున్నాడని. నవ్వుకున్నాడు. పార్క్ లో అందరూ ఎవరి గోలలో వాళ్లున్నారు. బానపొట్ట అంకులాంటీలు సిమెంట్ చప్టా వాకింగ్ పాత్ మీద రకరకాల విన్యాసాలతో జాగింగ్ చేస్తునారు. ముందు రాత్రి పార్క్ బెంచీ కింద యీనిన నల్ల కుక్కపిల్లలు ఒకదానిపై ఒకటి యెక్కి పాలకోసం దాని పొదుగు మీద దాడి చేస్తున్నాయి. సంఘసేవిక యెవరో బన్నులు, పాల పేకట్ పట్టుకు నించుని వాటిని అదలిస్తోంది. మధ్య మైదానంలో యోగా టీచర్ స్థూలదేహులకు సూక్ష్మయోగాన్ని నేర్పుతున్నాడు. మరొకాయన అదేపనిగా రామ్దేవ్ బాబా ప్రాణాయామాన్ని తన పద్ధతిలో ఆచరిస్తున్నాడు. ఇంకొకాయన చేతులు పక్క వాళ్ల మొహాలకు తగిలేంతగా పైకి విసుర్తున్నాడు. సుగర్, బీపీ లు తగు మాత్రపు ఖర్చుతో చూసేందుకు, అవసరమైన సామగ్రితో బల్ల పెట్టుకున్న మనిషి, వచ్చేపోయే వారిని గమనిస్తున్నాడు. పార్క్ బయట కొర్రలు, రాగులు,జొన్నలు,సిరి ధాన్యాల వర్తకుడు ఆరోగ్యం కాపాడుకోమని మైకులో హెచ్చరిస్తున్నాడు.

రవి మాటిమాటికీ గేటు పేపు చూస్తున్నాడు.  నిన్న ఆయన అన్న మాటలు గుర్తొచ్చాయి.

"నాకు ఎవర్నీ కలవటం ఇష్టముండదు.  నా ఫొటో ఏ పత్రికలో ప్రచురింపబడదు.  మా వాళ్లకి, కొద్దిమంది సన్నిహితులకీ తప్ప నేనెవరో ఎవరికీ తెలియదు.  కాబట్టి, మీరు సెల్ఫీలు కోసం ఆశించకండి.  నేను మిమ్మల్ని గుర్తు పడతాను.  కానీ మీరు .. మీ అంతట మీరే నన్ను గుర్తు పట్టాల్సుంటుంది.  అలాగైతేనే నేను మిమ్మల్ని కలుస్తాను." అన్నాడాయన.  తనొప్పుకున్నాడు.

ఆంధ్రదేశంలో బాగా పేరున్న కమర్షియల్ రచయిత.. అతని పుస్తకాలు అందరూ వయోభేదం లేకుండా పేలం వెర్రి గా చదువుతారు.   అతడెలా ఉంటాడో, అలవాట్లు, అభిరుచులు ఏమీ తెలియదు ఎవరికీ.  అటువంటి వ్యక్తిని కలుసుకోబోతున్నాడు తను.

వస్తాడా!

కాలం గడుస్తోంది.  రవి చూపులు మాటి మాటికీ పార్క్ గేటు పేపు తిరుగుతునాయి.

కొంపదీసి రాడా!

మనసులో అనుమానం..

ఛ ఛ.. అలా చెయ్యడు.. మాటిచ్చాడు కదా!  తనకి తానే సర్ది చెప్పుకున్నాడు.

సెకన్లు నిమిషాలుగా మారాయి.  నిముషాలు గంటగా మారకముందే, గేటు దగ్గర ఆరడుగుల వ్యక్తి కనపడ్డాడు.  చాలా హుందాగా వున్నాడు.. క్రీమ్ కలరు షర్ట్.. వైట్ పేంట్.. టక్ చేసుకున్నాడు..  తిన్నగా రవి కూర్చున్న సిమెంటు బెంచ్ దగ్గరకు వచ్చి "మిస్టర్ రవీ..." అన్నాడు.

రవి సంభ్రమంగా లేచి,

"వావ్..వచ్చారా శతభిషం గారు" అన్నాడు కాస్త బిగ్గరగా.

అంతే.

పార్కులో కూచున్న జనాల కళ్లన్నీ వీళ్లిద్దరి పేపు తిరిగాయి.

ప్రఖ్యాత రచయిత శతభిషం.

పుస్తకాలు చదివే ప్రతివారికీ ఆ పేరొక తారక మంత్రం.  ఉవ్విళ్లూరించే శృంగార కథలు, ఆకట్టుకునే సీరియళ్లు, సస్పెన్స్ అదరగొట్టే డిటెక్టివ్ కథలు,  ఒకటేమిటి .. అతని రచనలు ప్రచురించని పత్రిక లేదు.

అతడి కథలు ఇతర భాషల్లోకి కూడా అనువదించబడ్డాయి.

రవి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ఈలోగా వారిని అక్కడి జనం బిలబిలలాడుతూ చుట్టుముట్టారు. ఎవరెవరో ఏవేవో అడుగుతున్నారు.

సెల్ ఫోన్లలో సెల్ఫీలు తీసుకుంటున్నారు.

ఎవరి మాట ఎవరికీ అర్థం కాకుండా గందరగోళం గా వుంది.

ఈలోగా చీకట్లు ముసురుకున్నాయి.

అ సందట్లో శతభిషం ఎలా జారుకున్నాడో ఎవరూ గమనించలేదు.

తన అభిమాన రచయితను కళ్లారా చూడగలిగినందుకు రవి మాత్రం సంతోషంగా ఇంటి దారి పట్టాడు.

రెండురోజులు గడిచాయి.

ఆ రోజు వచ్చిన ఉత్తరం అందుకున్న రవి, కవరు చింపి మడతపెట్టిన కాగితం విప్పి చదివాడు.

అందులో మూడే లైన్లున్నాయి.

రవిగారికి,

నేను ముందే చెప్పాను.

ఇలాంటి గొడవ జరుగుతుందని ఊహించే, నా బదులుగా నా స్నేహితుణ్ణి పార్క్ కి పంపాను.

శలవు.

శతభిషం.

***0***

# జీవత్ తాత పాదుండు

దత్త శర్మ పాణ్యం



జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వెల్దుర్తి, కర్నూలు జిల్లా యస్.యస్.సి. 'బి' సెక్షను తెలుగు క్లాసు. జమదగ్ని సారు పాఠం చెబుతున్నారు. 'వనితా మానస సూనసాయకుడు, జీవత్తాతపాదుండు... "తెనాలి రామకృష్ణ కవి రచించిన పాండురంగ మహాత్మ్యము" లోని తృతీయాశ్వాసము నుండి, పాఠ్యాంశమైన "నిగమశర్మోపాఖ్యానము" పాఠం జరుగుతూంది.

విద్యార్థినీ విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారు. "ఒరేయ్ చూశారా! మహాకవి ఎంత బాగా చెప్పాడో? మొదటి రెండు విశేషాలూ భావగర్భితమైనవి. వనితలంటే వార వనితలు. అంటే వేశ్యలు. వారి మనసులకు సూన అంటే పుష్పములు, శాయకుడు అంటే బాణములుగా గలవాడు .. అంటే మన్మధుడు. అర్థమయిందా? వేశ్యలకెంతో ఇష్టమయినవాడు. వేశ్యలకెవడిష్టమవుతాడు? బాగా డబ్బు ఇచ్చేవాడు. ఈ సమాసంలో నిగమశర్మ తిరుగుబోతని చెప్పాడు మహాకవి. వెంటనే, రెండవ సమాసంలో "జీవత్తాతపాదుండు" అన్నాడు. అంటే "తండ్రి ఇంకా బ్రతికే ఉన్నవాడు" అని అర్థం. ఆ సమాసం ఆయన వాడటంలో చాలా ఔచిత్యముంది. వాడి తండ్రి బ్రతికే వుండటం వలననే వాడి ఆటలు సాగుతున్నాయని కవి చెపుతున్నాడు. నిజమే కదా! తండ్రి బ్రతికున్నంతవరకే తనయుని జీవితం ఆడింది ఆటగా పాడింది పాటగా సాగుతుంది. విచిత్రమేమిటంటే ఆయన బ్రతికున్నంత వరకూ కొడుక్కు ఆయన విలువ అస్సలు తెలియదు. పాపం ఆ పండితోత్తముడు కొడుక్కు "నిగమశర్మ" అని పేరు పెట్టుకున్నాడు. నిగమాలంటే వేదాలు. కుమారుడు వేద వేదాంగ పారంగతుడు అవ్వాలని ఆ తండ్రి కోరిక. కానీ వాడు జూదరి, తిరుగుబోతు అయ్యాడు. తెనాలివారు ఆ పదబంధముపయోగించి శతాబ్దాలు గడిచినాయి. కానీ ఈ రోజుకూడ దానికి 'సార్వజనీనత' ఉన్నది. క్షేమేంద్రుడు తన "ఔచిత్య విచార చర్చ" అనే గ్రంథంలో ఇలా అంటాడు.

"అనౌచిత్యాదృతే కావ్యం రసభంగస్సకారణమ్. మహాకవులు ఏ పదాలు వాడినా అవి సందర్భోచితంగానే కాక విశ్వజనీనతను సంతరించుకుంటాయి."

ముందు బెంచీలోనే కూర్చుని సారు చెబుతున్న మాటలు ఏకాగ్రతతో వింటున్నాడు మురహరి. ఇంతలో బెల్లు మ్రోగింది.

"మిగతాది రేపు చెప్పుకుందాం" అని వెళ్లిపోయారు జమదగ్ని సారు.

స్కూలయింతర్వాత ఇంటికి వచ్చాడు మురహరి. పుస్తకాల సంచీ గూట్లో పెట్టి, ఇంటి వెనుక వసారాలో చివరనున్న "జాల్లాట్లో (బాత్‌రూం) కాళ్లు చేతులు కడుక్కొని, వంటింట్లో అమ్మ దగ్గరకు వెళ్లాడు. అక్కడ అమ్మ, అక్కయ్య, తండ్రి పౌరోహిత్యంలో తెచ్చిన బియ్యం, బేడలు, అరటిపళ్లు, ఎండిన ఖర్జూరం, దక్షిణలు అన్నీ వేరు చేస్తున్నారు.

"వచ్చావా మురా!" అంటూ కొడుక్కు రెండు అరటిపళ్లిచ్చింది జ్ఞానప్రసునాంబ. బియ్యంతో పాటు మూట కట్టడంవల్ల అవి కొంచె నల్లబడినాయి. అవే "ఈవినింగ్ స్నాక్స్" మురహరికి. అక్కయ్య విశాల నాలుగేళ్ల క్రితమే టెంత్ పూర్తిచేసి ఇంట్లో అమ్మకు తోడుగా ఉంది. ఆమెకు సంబంధాలు చూస్తున్నారు గానీ, వీరి స్థోమతకు మించినవే వస్తున్నాయి.

అరటిపళ్లు తినేసి మంచినీళ్లు తాగాడు మురహరి. మరో రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు. తర్వాత కాలేజీలో చేర్చే తాహతు తండ్రికి లేదు. ఆయన పేరు మార్కండేయ శాస్త్రి. పైతృకంగా వచ్చిన పౌరోహిత్యాన్నే నమ్ముకొని జీవిస్తున్నాడు. తాతల నాటి యిల్లు స్వంతమే. మట్టి మిద్దె. ప్రతి వర్షాకాలానికి ముందు మట్టి మార్చి చవిటిమన్ను తోలించాలి. చవిటిమన్నులో నీళ్లింకవు. పారిపోతాయి. దానివల్ల వానలు పడినా యిల్లు కారదు.

పుస్తకాలు ముందేసుకొని కూర్చున్నాడు మురహరి. లెక్కలసారిచ్చిన లెక్కలు, ఇంగ్లీషుసారిచ్చిన గ్రామరు ఎక్సర్‌సైజులు చేశాడు. తర్వాత తెలుగు వాచకం తీసుకొని జమదగ్ని సారు చెప్పిన పద్యాన్ని చదివాడు. మిగతా పద్యమంతా నిగమశర్మను గురించి మంచిగానే వర్ణించారు తెనాలివారు. "మరి సారెందుకు వేశ్యాలోలుడని చెప్పారు? రేపు సారునడగాలి" అనుకున్నాడు మురహరి.

ప్రక్కవీధిలోని రామాలయంలో రోజు పురాణ ప్రవచనం చేస్తాడు మార్కండేయ శర్మ. ప్రవచనం తర్వాత మంగళహారతి ఇస్తాడు. హారతి పళ్లెంలో శ్రోతలు వేసిన చిల్లర నాణేలు, చిన్న నోట్లు తీసుకొని ఇంటికి వస్తాడు. ఎనిమిది గంటలకల్లా యిల్లు చేరిన ఆయన కొడుకు శ్రద్ధగా చదువుకుంటూండడం చూసి సంతోషించాడు. మురహరికి పన్నెండో ఏటనే ఉపనయనం చేసి, నమక చమకాలు, మహన్యాసం, దేవతార్చన నేర్పించాడాయన. సెలవుల్లో తనతోపాటు తీసుకొని వెళ్లి పౌరోహిత్యంలో కూడ తర్ఫీదుయిస్తున్నాడు. టెంత్ తర్వాత తనను కూడ ఆ రంగంలోనే దింపాలనుకున్నట్లుగా లీలగా అర్థమవుతూ ఉంది మురహరికి.

మరునాడు క్లాసులో జమదగ్ని సారు నిగమ శర్మ పాఠాన్ని కొనసాగించారు. మురహరి లేచి సారునడిగాడు. "సార్, వనిత అంటే వార వనితలనే ఎందుకనుకోవాలి? మిగతా పద్యమంతా నిగమశర్మ గురించి చెడుగా లేదు. మరి ప్రత్యేకంగా అతని తండ్రి బ్రతికే ఉన్నాడని చెప్పడమెందుకు?"

"బాగా అడిగావురా భడవా!" అన్నాడు తెలుగుసారు. "కావ్యార్థ సూచన" అని ఒక కవితా సాంప్రదాయముంది. దాని ప్రకారం ముందు జరగబోయే కథను సూచన ప్రాయంగా మనకు తెలియజేస్తాడు కవి. ఇదింకా ఆ కథలో తొలి పద్యమే. రాను రాను నిగమశర్మ ఎలా భ్రష్టుడయ్యేది తెలుస్తుంది. వాడి వ్యక్తిత్వం గురించి మీకు మానసికంగా సిద్ధమవుతారని అలా చెప్పాను. మీరు పరీక్షల్లో ఈ పద్యానికి ప్రతిపదార్థం గనక అడిగితే వనితలు అంటే స్త్రీలనే రాయండి"

ఆయన మనసులో అనుకున్నాడు. "ఈ మురహరిగాడితో జాగ్రత్తగా ఉండాలి!"

***

టెంత్ పరీక్షలయిపోయినాయి. సెలవుల్లో తండ్రి వెంట రుద్రాభిషేకాలకు వెళ్లాడు మురహరి. ఏకాదశ రుద్రాభిషేకం. వీరిరువురూ కాక మరొక బ్రాహ్మణుడిని సహాయంగా తీసుకున్నారు. "అన్యోన్య సహాయేన" అని సంకల్పం చెప్పుకున్నారు. ముగ్గురూ కలిసి ఒకసారి నమకాన్ని, చమకంలో ఒక పనసను చదివితే మూడుసార్లుగా లెక్కకొస్తుంది. అలా అభిషేకం ముగించారు. గృహ యజమాని ఐదు వందల పదహారు రూపాయలు తాంబూలంలో పెట్టి ఇచ్చి నమస్కరించాడు.

సహాయంగా వచ్చిన బ్రాహ్మడికి వందరూపాలిచ్చేశాడు మార్కండేయ శర్మ. ఇంటివారిచ్చిన స్వయంపాకం దినుసులన్నీ టవలులో మూట కట్టాడు. కొన్ని కొబ్బరి చిప్పలూ, అరటి పండ్లు వేరే ప్లాస్టిక్ కవరులో వేసుకున్నారు. అప్పటికి పన్నెండు దాటింది. కార్తీకమాసం కాబట్టి ఎండ అంతగా లేదు. రిక్షాకు డబ్బులు దండగని ఇద్దరూ నడచి యింటికి వస్తున్నారు. మురహరి స్వయంపాకం మూట మోస్తుండగా, తండ్రి కవరు తెస్తున్నాడు.

"నాయనా మురహరీ! ఎందుకో ఛాతీలో ఎడమ వైపున స్వల్పంగా నొప్పిగా ఉందిరా" అన్నాడాయన.

"ఆ కవరు కూడ యిటివ్వండి నాన్నా! కాసేపు ఆ మోరీ గట్టు మీద కూర్చుందాం రండి" అంటూ మురహరి తండ్రిని ప్రక్కనే ఉన్న 'కానా' మీద కూర్చోబెట్టాడు. ఆయనకు నొప్పి తగ్గలేదు.

"ఎడమ చెయ్యి విపరీతంగా లాగేస్తుందిరా" అన్నాడాయన, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతున్నాడు. అటుగా వెళుతున్న రిక్షాను పిలిచాడు మురహరి. రిక్షావాడి సాయంతో తండ్రిని ఎక్కించి, ఆయన్ను పట్టుకుని కూర్చున్నాడు. ఇంటికి కాకుండా హాస్పిటల్‌కు వెళితే మంచిదని తోచిందా అబ్బాయికి.

"డాక్టర్ ప్రభాకరరెడ్డిగారి ఆసుపత్రికి తీసుకుపో బాబూ" అని అర్థించాడు. తండ్రి తన భుజంమీద వాలిపోయి ఉన్నాడు. హాస్పిటల్ వచ్చింది. రిక్షావాడు వెళ్లి పంతులుగారికి బాగాలేదని తీసుకువచ్చామని చెప్పాడు లోపల. డాక్టరు గారికి కూడ పురోహితుడు ఆయనే.

డాక్టరుగారు పరుగుపరుగున వచ్చారు. స్ట్రెచర్ తీసుకురమ్మని పురమాయించారు. స్ట్రెచర్‌లో శర్మగారిని తీసుకువెళ్లి ఒక బెంచీమీద పడుకోబెట్టారు. మురహరి ఆందోళనగా ఉన్నాడు. డాక్టర్‌గారు తండ్రిని పరీక్షిస్తున్నాడు. ఆయన ముఖం వివర్ణమయింది. శర్మగారు శివైక్యం చెందారని ఆయనకు అర్థమయింది. మురహరిని పిలిచి చెప్పాడు.

"ఐయామ్ సారీ! మీ నాన్నగారు ఇక లేరు!"
మురహరికి ఆ మాటలు మెదడులో ఇంకటానికి కొన్ని క్షణాలు పట్టింది. కళ్లముందు మసకలు కమ్మసాగాయి.
"సార్! మీరంటున్నది నిజమేనా?" అన్నాడు లోగొంతుకతో.
"అవును బాబూ, మాసివ్ హార్ట్ అటాక్! బి బ్రేవ్! మీ వాళ్లను పిలిపిస్తాను"
కాసేపట్లో అమ్మ, అక్కయ్య వచ్చారు. ముగ్గురూ ఆయన పార్థివ శరీరంపై బడి రోధించారు.

***

తండ్రి గతించి నెల రోజులైంది ! భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది ! "జీవత్తాతపాదుండు" అన్న మాటల్లో ఎంత అర్థముందో తెలియసాగింది. నిజమేమరి! ఆయన ఉన్నప్పుడు నిశ్చింతగా ధైర్యంగా ఉండేది.
కాలం ఎటువంటి దుఃఖాన్నైనా మరపిస్తుంది. మురహరి కుటుంబం మెల్లగా తేరుకుంది. తల్లి, అక్కయ్య వంటలు చేయడానికి వెళ్లసాగారు. మురహరి తండ్రి వృత్తినే కొనసాగించసాగాడు. టెంత్‌లో ఐదువందల ముప్పై ఆరు మార్కులు వచ్చాయి.

విశాలక్కకు పెళ్లి చేశారు. ఇల్లు అమ్మివేశారు. వరుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రికార్డు అసిస్టెంట్. వారూ పేదవాళ్లే. కొంత అప్పుకూడ చేయవలసి వచ్చింది.
తల్లీ కొడుకులిద్దరూ రెండు గదుల చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నారు. భుక్తికి లోటు లేదు గాని మౌఢ్యం రోజుల్లో పౌరోహిత్యం పనులు లేక ఇబ్బందులు పడసాగారు.
జమదగ్ని సారు సలహాపై ఇంటర్‌మీడియట్ ప్రయివేటుగా కట్టాడు మురహరి. ఆర్ట్స్ గ్రూపు తీసుకున్నాడు. టెంత్ పాసయి రెండేళ్లు కావస్తూంది కాబట్టి, రెండు సంవత్సరాల పరీక్షలూ ఒకేసారి రాసి సెకండ్ క్లాసులో పాసయ్యాడు.
తన కులవృత్తి చేసుకుంటూనే, బి.ఎ. పరీక్షకు కట్టాడు. గ్రూపులో స్పెషల్ తెలుగు తీసుకున్నాడు. జమదగ్ని సారు కోచింగ్ యిచ్చేవారు. మూడు సంవత్సరాలలో డిగ్రీ పూర్తయింది. బి.ఎ. స్పెషల్ తెలుగువారు తెలుగు పండిట్ ట్రెయినింగ్ చేయడానికి అర్హులని సారు చెప్పారు. అప్పటికింకా ఎంట్రన్స్ లు లేవు. సారే వచ్చి కర్నూలులో చేర్పించారు. ఆ కోర్సు అప్పుడు ఐదు నెలలు మాత్రమే ఉండేది. దాన్ని కూడ విజయవంతంగా పూర్తి చేశాడు మురహరి. ఎంప్లాయిమెంట్ ఎక్స్ ఛేంజిలో తన పేరు నమోదు చేయించుకున్నాడు ట్రెయినింగ్ క్వాలిఫికేషన్‌తో సహా.

ఆరు నెలల తర్వాత ఇంటర్వ్యూ వచ్చింది. కర్నూలు మున్సిపల్ హైస్కూళ్లలో రెండు ఖాళీలున్నాయి. ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. వెల్దుర్తిలో డాక్టర్ ప్రభాకరరెడ్డి గారి వియ్యంకుడు మున్సిపల్ ఛైర్మన్. ఆయన్నందరూ ఛైర్మన్ నాగిరెడ్డిగారని పిలుస్తారు. డాక్టరు గారి వద్దకు వెళ్లి తనకా ఉద్యోగం యిప్పించమనీ,

జీవితాంతం ఋణపడి ఉంటాననీ అభ్యర్థించాడు. డాక్టరు గారికి మార్కండేయ శర్మ అంటే గౌరవం. ఆయన తన హాస్పిటల్లోనే చనిపోవడం డాక్టరు గారికి మరింత సానుభూతి కలిగించింది.
మురహరిని వెంటపెట్టుకొని వియ్యంకుడిని కలిశాడాయన. 'ఇటువంటి వారికి సహాయపడితేనే మన పదవులకు సార్థకత' అని చెప్పాడు.
"సరేలే బావా! నీవు జెప్పింతర్వాత తిరుగేముంటాది!" అన్నాడు ఛైర్మన్ గారు.
వారం రోజుల్లో అపాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. నెలకు రూ. 398/- కన్సాలిడేటెడ్ వేతనం. డి.ఎ. హెచ్.ఆర్.ఎ. లాంటివేమీ ఉండవు.
వెల్దుర్తి నుండి రోజు డోన్`కర్నూలు లోకల్ రైల్లో ఉద్యోగానికి వెళ్లి వచ్చేవాడు మురహరి. సెలవుల్లో పౌరోహిత్యం కూడ చేసుకునేవాడు. అలా మూడేండ్లు కష్టపడింతర్వాత ఉద్యోగం రెగ్యులరైజ్ అయింది. చక్కని పేస్కేలు, డి.ఎ., హెచ్.ఆర్.ఎ., పీరియాడికల్ ఇంక్రిమెంట్లు అన్నీ అమిరాయి. ఆ సంవత్సరమే పే రివిజన్ కూడ జరిగి, జీతం బాగా పెరిగింది.
తల్లితో సహ కర్నూలుకు మకాం మార్చాడు మురహరి. గిబ్సన్ కాలనీలో ఇల్లు తీసుకున్నాడు. స్కూలుకు వెళ్లి రావటానికి సైకిలు కొనుక్కున్నాడు. ఇంట్లో తల్లికి అన్నీ అమర్చాడు.

మురహరికి సంబంధాలు రాసాగాయి. నంద్యాలలో సిండికేట్ బ్యాంక్‌లో పని చేస్తున్న శేషగిరిగారమ్మాయిని ఇస్తామని వచ్చారు. అమ్మాయి చక్కగా ఉంది. పేరు మృణాళిని. వారికి నంద్యాలలో స్వంత యిల్లుంది. మృణాళిని డిగ్రీ పాసయింది. తల్లీ కొడుకులిద్దరికీ బాగా నచ్చింది.
నంద్యాలలోని సంజీవనగర్ రామాలయంలో వివాహం జరిగింది.

***

వివాహమైన రెండో సంవత్సరమే వారికి పుత్రోదయమయింది. "మీ నాన్నే మళ్లీ పుట్టాడురా! ఆయన పేరు పెడదామంది తల్లి. కోడలికి ఇష్టం లేదు. ఆధునికంగా ఉండే పేరదేయినా సరేనందా అమ్మాయి. మురహరి బాగా ఆలోచించాడు. తండ్రి పేరు మార్కండేయ శర్మ, మార్కండేయుడు శివుడి శరణుజొచ్చి యముడినే ధిక్కరించాడు. ఆయన పేరు స్ఫురించేలా "శర్వశరణ్" అని పెడదామన్నాడు. భార్యకాపేరు తెగ నచ్చేసింది. తర్వాత తల్లికి ఆ పేరులోని అంతరార్థం రహస్యంగా వివరించాడు.

పిల్లవాడు పెరుగుతున్నాడు. మురహరి గ్రేడ్`వన్ తెలుగు పండితుడయినాడు. బళ్లారి చౌరస్తాకు దగ్గరలో, జాతీయ రహదారినానుకుని రెండు వందల గజాల స్థలం కొన్నాడు. తన తండ్రి తన చిన్నవయసులోనే చనిపోతే తానెన్ని కష్టాలు పడాల్సి వచ్చిందో గుర్తు చేసుకుని తన కొడుకు అలా కష్టాలు పడకూడదని నిర్ణయించుకున్నాడు. మూడేండ్లు నిండగానే "శర్వ"ను 'మాంటిస్సోరి' స్కూల్లో చేర్చారు. తన తాహతుకు మించిన పనైనా వాడు నాణ్యమయిన చదువు చదవాలని దంపతులు కలలు గనేవారు.

మురహరి తల్లి కాలధర్మం చెందింది. పిల్లవాడు హైస్కూలుకు వచ్చాడు. మురహరి ఇల్లు కట్టుకున్నాడు. అదేమిటో గాని 'శర్వ' చదువులో పెద్దగా రాణించడంలేదు. అతిగారాబం. వాడేది అడిగినా క్షణాల్లో తెచ్చివ్వాలి. వాడు ఉప్మా తిననంటాడు. ఇడ్లీ వద్దంటాడు.
వాడి హైస్కూలు చదువంతా 'మాంటిస్సోరి' లోనే సాగింది. సి.బి.యస్.ఇ. ఇంగ్లీష్ మీడియం టెంత్‌లో కేవలం 5 పాయింట్స్ తెచ్చుకున్నాడు. ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీ చైతన్యలో చేరాడు. 'శర్వ' వాడు పెట్టే ఒత్తిడిని భరించలేక చెప్పకుండా వచ్చేసేవాడు. మళ్లీ అమ్మా, నాన్నా బుజ్జగించి, హాస్టల్లో విడిచేవారు. మొత్తానికి ఇంటరు గట్టెక్కాడు పుత్రరత్నం.

ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంకు రాలేదు. ఫలితంగా డోనేషన్ కట్టి తమిళనాడులోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో చేరవలసి వచ్చింది. అక్కడ హాస్టలు బాగులేదని, ఫ్రెండ్స్‌తో వేరే అపార్టుమెంటులో ఉంటున్నాడు. వాడు పెట్టే ఖర్చులు చూస్తుంటే భయమేసేది. వాడు వాడే ప్రతి వస్తువూ, దుస్తులతో సహా అన్నీ "పోష్"గా ఉండాలి. వాళ్ల నాన్న మున్సిపల్ హైస్కూల్లో తెలుగు పండితుడని కూడ వాడికి కొంత న్యూనతా భావం ఉండేది.

వాడు ఇంజనీరింగ్ పూర్తి చేయడానికి దాదాపు ఐదు లక్షలయింది. ఏదైనా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వస్తే వాడి బ్రతుకు వాడు బ్రతుకుతాడు అనుకునేవాడు తాతపాదుడు!
ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని వచ్చిన వెంటనే బాంబు పేల్చాడు సుపుత్రుడు! తాను యు.ఎస్ వెళ్లి ఎమ్.ఎస్ చేస్తానని ప్రకటించాడు! మురహరి గుండెల్లో రాయి పడింది! తల్లి కొడుక్కు వంతపాడింది!
"నీకేమీ భారం కాదు డాడ్! మన యిల్లు 'ప్లెడ్జ్' చేస్తే ఎడ్యుకేషన్ లోన్ యిస్తారు. రెండేళ్లలో ఎమ్.ఎస్ ఐపోతుంది. అమెరికాలో మంచి జాబ్ సంపాదిస్తాను. లోన్ ఇట్టే తీర్చేయనూ!"
లోలోపల ఆందోళనగా ఉన్నా, వాడి ఆత్మ విశ్వాసానికి ముచ్చటేసింది తాతపాదులవారికి. పాస్‌పోర్ట్ వచ్చింది. దాదాపు నలభై లక్షలు ఎడ్యుకేషన్‌లోన్ తీసుకున్నారు. న్యూ జెర్సీలోని ఒక యూనివర్సిటీలో సీటు వచ్చింది. వీసా కూడ వచ్చింది. వెళ్లి జాయినయ్యాడు.

మామూలుగా అందరూ చిన్న చిన్న పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటూ వ్యక్తిగత ఖర్చులకు సంపాదించుకుంటారు. అమెరికాలో. మరి మనవాడేమయినా సామాన్యమైనవాడా? అలాంటి చౌకబారు ఉద్యోగాలు చేయనుగాక చేయనన్నాడు. ఎమ్మెస్ అయ్యేంతవరకూ తండ్రినే తన ఖర్చులకు పంపమన్నాడు. అవసరమైతే అది కూడ తనకుద్యోగం వచ్చింతర్వాత తీర్చేస్తానన్నాడు.

ఎం.ఎస్ అయిపోయింది! మంచి కంపెనీలో ఉద్యోగం కూడ వచ్చిందని ఫోన్ చేశాడు కొడుకు. జాయినయ్యే లోపల ఇండియాకు వచ్చి మీ దగ్గర కొన్ని రోజులుండి వెళతానన్నాడు. అమ్మచేసిన వంటలు తినాలనిపిస్తుందన్నాడు.
శంషాబాద్‌లో విమానం దిగి అక్కడ నుండి కారులో కర్నూలుకు వచ్చాడు వస్తూనే .. "వాడికి త్రీ థవుజండ్ ఇచ్చి పంపేయండి" అని ఆర్డరేశాడు.
"హాయిగా సూపర్ లగ్జరీ బస్సులో వస్తే రెండు వందలతో పోయేది" అని గొణుక్కున్నాడు తండ్రి.
హాయిగా అమ్మ చేసిపెట్టినవన్నీ తిన్నాడు. "ఫ్రెండ్స్‌కి పార్టీ యివ్వాలి ఫైవ్ థౌజండ్ కావాలి డాడ్!" అన్నాడు "ఎందుకురా' అంటే 'నాకు ఉద్యోగం వచ్చింది కదా!' అన్నాడు.
రెండ్రోజుల తర్వాత చెప్పాడు "ఈరోజు మనింటికి ఒక గెస్ట్ వస్తూంది. నా జీవితంలోని ఒక ఇంపార్టెంట్ డెసిషన్ తీసేసుకున్నాను. మీరు ఎక్జయిట్ అవకండి" అని చెప్పి రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అరగంటలో ఒక అమ్మాయిని వెంటబెట్టుకొని వచ్చాడు. వస్తూనే,
"డాడ్ అండ్ మామ్! ఇదిగోండి మీ కాబోయే కోడలు ! నీరజా గౌడ్! అమెరికాలో నా క్లాస్‌మేట్. తనకు కూడ జాబ్ వచ్చింది. వుయార్ గోయింగ్ టు మ్యారీ ఇన్ ది నియర్ ఫ్యూచర్. ప్లీజ్ బ్లెస్ అజ్"
ఇద్దరూ వీళ్లకు పాదాభివందనం చేశారు! మురహరి దంపతులిద్దరూ ఖిన్నులయ్యారు ! ఒక్కగానొక్క కొడుకు! ఇలా చేశాడేమిటి! సరే వాడి సంతోషం కంటె తమకు కావలసిందేముందని రాజీ పడ్డారు. ఆ అమ్మాయి వాళ్లది కర్నాటకలోని 'హోసపేట'ట తెలుగు రాదు.

పదిరోజులుండి వెళ్లిపోయాడు 'శర్వ' ఇద్దరూ ఉద్యోగాల్లో చేరామనీ, పెళ్లికూడ చేసుకున్నామనీ ఫోన్ చేశాడు.
"నాన్నా, మరి ఎడ్యుకేషనల్ లోన్ రిపేమెంట్ స్టార్టవుతుంది కదా! నెలనెలా ఎంత పంపిస్తావు?" అనడిగాడు కొడుకును కాసేపు నిశ్శబ్దం!
"సారీ డాడ్! మేము నిలదొక్కుకోడానికి చాలా టైం పడుతూంది. తర్వాత చూద్దాం లెండి!" అని పెట్టేశాడు వాడు.
మురహరి మరో సంవత్సరంలో పదవీ విరమణ చేయబోతున్నాడు. అతనికి ప్రస్తుతం ఎనభై వేలదాకా జీతం వస్తుంది. అందులోంచి నెలనెలా నలభైవేల రూపాయలు లోన్ కట్టుకోసాగాడు.

రిటైరైంతర్వాత దాదాపు నలభై లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తే, వాటితో లోన్ క్లియర్ చేసేశాడు. చేతిలో పైసాలేదు. పెన్షన్ పాతిక వేలు వస్తుంది. కమ్యూటేషన్ పోను. సరే సొంత యిల్లుంది ఎలాగో గడిపేయవచ్చుననుకున్నాడు.

మురహరికి తెనాలివారి పద్యం గుర్తుకువచ్చింది. జీవత్తాతపాదుడు శర్వశరణ్ నిగమశర్మకేం తీసిపోడు! వాడికీ వీడికీ తేడా ఏమిటంటే వాడు దుర్వ్యసనపరుడు, వీడు కాదు అంతే. బ్రతికి ఉన్న తండ్రిని వాడుకోవడంలో వాడిని మించిన వాడే వీడు!

తన తండ్రి తన పదిహేనవ ఏట చనిపోతే, అష్టకష్టాలుపడి ఈ స్థితికొచ్చాడు తను! ఆయన లేకపోవడమే మేలయిందేమో! తనకు బరువు బాధ్యతలు తెలిశాయి. మరి తాను బ్రతికి ఉండడం వల్ల తన కొడుక్కు బాధ్యతలు తెలియలేదే! పచ్చి అవకాశవాదిగా మారాడే!

ఇంతటితో కథ అయిపోలేదు. సంవత్సరం తర్వాత కొడుకు ఫోన్ చేశాడు.


"డాడ్! మీకొక శుభవార్త ! మేం ఇక్కడ యిల్లు కొనుక్కోవాలనుకుంటున్నాం. అక్కడ మీకంతయిల్లెందుకు? కర్నూల్లో ఐదారువేలు పెడితే మంచి ఇల్లు అద్దెకు దొరుకుతుంది. మన యిల్లు అమ్మేస్తే యాభై లక్షలన్నారాదూ! ప్లీజ్ డిస్పోస్ యిట్ ఆఫ్ అండ్ సెండ్ మి మనీ"

తాతపాదుడికి మరొక విద్యుద్ఘాతం!

***0***

# ఏటి పాలైన యవ్వనం

## శీలా వీర్రాజు



వర్షం!!

కుండలతో దిమ్మరించినట్టు ఒకటే వర్షం!!!

ఎక్కడా ఏ వస్తువూ కనబడడం లేదు. ప్రతీ ప్రాణి కంటికీ, ఎదుటి వస్తువుకూ మధ్య వర్షం తెర. ఆ తెరల వెనక, కనిపించీ కనిపించనట్టు దాగుడుమూతలాడే వస్తువులు. ఎన్ని వర్షం తెరలో!! లెక్కలేనన్ని తెరల్ని లెక్కబెట్టాలంటే, ముందుగా అక్కడ ఎన్ని ప్రాణులున్నాయో తెలుసుకోవాలి. అన్ని ప్రాణుల్నీ లెక్కలోకి తీసుకోకూడదు. చూస్తున్నవి మాత్రమే కావాలి. కలుగుల్లో నిద్రిస్తున్నవీ, కళ్ళు మూసుకున్నవీ పనికిరాదు. అలాగే వస్తువులూనూ. ఒకదాన్ని ఒకటి ఆవరించి, పూర్తిగా కప్పెయ్యకుండా కొద్దిగానన్నా కనిపించే వస్తువులే లెక్కబెట్టాలి. అప్పటికి ఇంకా ఒక చిక్కు మిగిలిపోయే ఉంటుంది. పది వస్తువులకీ అడ్డుగా ఒకే తెర ఉండొచ్చు. ఒకే తెర పది చూపులకీ అడ్డుపడొచ్చు. లెక్కించడం కష్టమే. అందుకని ఒకేతెర మడతలు పడి, అన్ని వస్తువులనూ ఆవరించి, చుట్టుకొని, మెలికలు తిరిగి ఉంటుందని చెప్పుకుంటే, అదోరకమైన తృప్తికరమైన సమర్థన.

వర్షం చినుకులు నిప్పురవ్వల్లా తుళ్ళుతున్నాయి. చినుకుల్లో వెలుగు లేదు. నిప్పురవ్వల్లో కాంతిని కొంత తగ్గించి చూస్తే ఎలా ఉంటాయో అలా ఉన్నాయి చినుకులు.

ఆ కాంతిని తగ్గించడం సాధ్యంకాదని చాలామంది అభిప్రాయం. కాంతి ప్రకాశం చూపుని బట్టి ఉంటుంది. చూపు అన్నింటికీ ఒక్కరకంగానే లేదు. ఆకాశంలో ఎగిరే గెద్దకు చూపు తీక్షణమైనది. అంత మీదనుండి అది నేలమీదనున్న చిన్న పిచ్చికనైనా చూడగలదు. చూడడం అంటే ప్రకాశాన్ని గ్రహించడం అన్నమాట. వెలుగు పిచ్చిక మీద పడి, పరావర్తనమై ప్రయాణించి, గద్ద చూపుకు అందుతుంది. ఆ కొద్దిపాటి పరావర్తన వెలుగునూ అది గ్రహించగలదు. కాని మనిషి గ్రహించలేడు. మనిషి చూపు మందమైనది. కొద్దిపాటి పరావర్తన కిరణాలనీ అది గ్రహించలేదు. కనుక చూపును బట్టి ప్రకాశం కనిపిస్తుంది. నిప్పురవ్వల్లో కాంతిని తగ్గించాలంటే, చూపులో బేధం రావాలి. చలవ కళ్ళజోడు పెట్టుకోవడమంటే, కాంతిని తగ్గించి చూడడమన్నమాట.

నిప్పురవ్వలు ఏ నీలంరంగు కళ్ళద్దాలలోంచో, కనబడ్డట్టు చినుకులు కనబడుతున్నాయి. కొండమీది రాతిబండలపై పడి, పక్కలకు చెదిరి పడుతున్నాయి. అక్కడన్నీ కొండలే. కొండలపైన పొడుచుకొచ్చిన బండరాళ్ళు. కొండ దిగువన కనుచూపు మేర అడివి. కొన్నివేల సంవత్సరాలుగా వర్షంలో కరిగి, ఇంకా మరికొన్ని వేల ఆయుష్షుతో ఆకాశంలోకి చూస్తున్నాయి బండరాళ్ళు.

ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకున్నాయి. ఆ అల్లికలో 'యూనిఫార్మిటీ' లేదు. లేతరంగూ ముద్దరంగూ కలవక, ఎక్కడికక్కడ అతుకులువేసి అంటించినట్టుంది.

ఒక కొండమీద నుంచి ఇంకొక కొండమీదకు సూర్యుడు ప్రయాణం చేయడానికి వేసిన వంతెనలా కనిపించాయి మేఘాలు. ఆకాశం పాండురోగి మొహంలా ఉంది. మేఘాల పందిరిలా ఉంది. పేదవాడి చిరుగుల చొక్కాలా ఉంది. ధనవంతుడి భోజనానంతరం పళ్ళెంలో మిగిలిపోయిన వంటకాల్లా ఉంది. తడిసి తడిసి వెలిసిపోయిన నిష్టాత్ముడి మడిబట్టలా ఉంది.

మేఘాలు కరిగిపోతున్నాయి. కరిగినా తరగడంలేదు. ఎక్కడినుంచో కొత్తవి ఎగిరొచ్చి పడుతున్నాయి. బరువు వల్ల కాబోలు, కొండ అంచుల మీదకంటా వంగి, మేత మేస్తున్నట్టున్నాయి. దగ్గరనుంచి చూస్తే మేఘాలు కనిపించడంలేదు. పొగమంచులా ఉంది. దూరంనుంచి చూసినప్పుడు అందమైన వంపులు తిరిగినట్టు మేఘాలు కనిపిస్తున్నాయి. ఎక్కడికక్కడే ఆర్చీల లాంటి ఒంపులు! ఉంగరాల జుట్టులా వంపులు తిరిగిన మేఘాలు.

వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. రాళ్ళమీద పడ్డ చినుకులు మెల్లగా కిందకు జారి, సహజీవనాన్ని అలవాటు చేసుకొని, నేలమీద పాకుతూ వెళ్ళి, వాలులోకి మళ్ళి, కాలం గీసిన గీతల్లోంచి అడుక్కు కొట్టుకుపోతున్నాయి. కిందపడ్డ చినుకు వ్యక్తిత్వాన్నే వదులుకుంటోంది. పదింటితో కలిసి కొత్త చైతన్యంతో పరుగులు తీస్తోంది. ఏ రంగూ లేని శరీరానికి ఎరుపురంగు పులుముకొని, తన అందాన్ని ఎవరికో చూపించాలన్న ఆరాటంతో కదిలి వెళ్ళిపోతోంది. కొద్దిదూరం కదిలి వెళ్ళి, ఏ రాయో తగిలితే ఆగిపోయి, కొత్తమిత్రులు వచ్చేవరకూ ఎదురుచూసి, రాగానే కొత్త ఉత్సాహంతో ముందుకు కదులుతోంది. సహజీవనానికి చక్కటి నిర్వచనం అది.

పిల్లకాలవలు కొండమీది చాళ్ళలో కిందకు దిగి, కాలువలు కట్టి ప్రవహిస్తున్నాయి. ఆ కాలువలు పదిరకాలుగా చీలి, మళ్ళీ కలుసుకొని, ఒకే చాలులో మళ్ళీ వచ్చి చేరాయి.

ఎర్రటి ఏరు, కొండలోయల్లోంచి పరుగెడుతోంది. గర్వంగా తలెత్తి నిలుచున్న బండరాళ్ళను పట్టుకొని, ఒక్క కుదుపు కుదుపి, కదిలించి, పదిగజాల దూరం తీసుకుపోయి, ఏడిపించి మరీ వదిలిపెడుతోంది. మరికొన్ని బండరాళ్ళను వెంట లాక్కుపోయి, కోణాల్నీ ఎగుడు దిగుడుల్నీ అరగొట్టి, నునుపుగా సానబెట్టి, మెరుగులు దిద్దుతోంది. ఊరేగింపు వెనుక చప్పట్లు కొట్టుకుంటూ పరుగెత్తే పిల్లకాయల్లా గులకరాళ్ళు ప్రవాహం వెంట కొట్టుకుపోతూ, గలగలలాడుతున్నాయి. అదోరకమైన అందమైన శబ్దం. మోచేతి నిండా గాజులు

తొడుక్కున్న స్త్రీ చేత భరతనాట్యం చేయించినట్టుంది. ముస్లిం స్త్రీలు డోలక్ వాయిస్తున్నట్టుంది. వాళ్ళ చేతుల నిండుగా గాజులే.

ఒకచోట పదిగజాల ఎత్తునుండి నిటారుగా కింద లోయలోకి దూకి, క్షణంసేపు చుట్టూరా చూసి, మళ్ళీ ముందుకు ఉరకలేసుకుంటూ వెళ్ళిపోయింది ఏరు. ఉత్సాహాన్ని ఆపుకోలేక తుళ్ళుతూ మెలికలు తిరిగిపోయింది. "బర్డ్స్ వ్యూ"లో ఏరు, కొండల నడుమ మెలికలు తిరిగిన మట్టిరోడ్డులా ఉంది. పగబట్టి కదులుతున్న గోధుమతాచులా ఉంది. గుక్క పట్టి ఏడుస్తున్న చంటిపిల్ల కన్నీటి ప్రవాహంలా ఉంది.

గబగబా వెళ్తున్న ఏరు చటుక్కున తలెత్తి చూసింది. ఎదురుగా అడ్డుగోడలా నిల్చుంది ఓ బండరాయి. దాని మొహంనిండా గంట్లే. ఎన్నో ఎదురుదెబ్బల్ని తట్టుకొని, పెచ్చులు ఊడిపోయి, అసహ్యంగా ఉంది. ఏనాటిదో అది. ముసలితనం వచ్చేసినట్టు ముఖంమీద ముడతల్లాంటి పగుళ్ళు. పై రంగు కూడా పాలిపోయింది. రక్తమంతా పోయి, పాలిపోయినట్టు బూడిదరంగులో ఉందది.

ఏరు నిర్లక్ష్యంగా ముందుకు వెళ్ళింది. బండరాయిని పట్టుకొని ఒక్క కుదుపు కుదుపింది. కదలలేదది. కసిగా దాని మీదకంటూ పాకి, పట్టు దొరక్కుండా జారిపడి, తలొంచుకొని దాని పక్కనుండి ముందుకు వెళ్ళిపోయింది.

అలా వెళ్ళి వెళ్ళి మలుపు తిరిగి, వాలులోకి, మళ్ళీ కొండదిగువకు చేరుకుంది. దిగువన అన్నీ చెట్లే. అదంతా దట్టమైన అడివి. ఆ అడివిలోని ఎండుటాకులు ప్రవాహం వెంట పరుగెత్తాయి. దారి పొడుగునా పహరా సైనికుల్లా నిలుచున్నాయి చెట్లు. చెట్ల పాదాల్ని కడిగి, ఆ జలాన్ని మోసుకొని వెళ్ళిపోయింది ఏరు. ఒకచోట ఏమీ తోచక, ఓ చెయ్యి అలా విసిరి, విరిగిపడున్న ఎండుకొమ్మను వెంటేసుకొచ్చింది. వర్షం తగ్గింది కదా అని, కలుగు బయటికొచ్చి చూస్తున్న పాముని తలమీద అణిచి, నీళ్ళలో ముంచి, తిరిగి లేవనీయకుండా తనతోపాటూ తీసుకుపోయింది. వర్షంలో తడిసి, రెక్కలు బరువెక్కి, ఎగరలేని ఒక పక్షిపిల్లను తోకపట్టుకొని, నీళ్ళ అడుగుకు లాగేసింది.

అడివి దాటింది ఏరు. గులకరాళ్ళలో నుంచి ప్రవహిస్తోంది. కాసులపేరు అటూ ఇటూ కదిలినట్టు ఒకటే శబ్దం. కూడా వచ్చిన గులకరాళ్ళు కొద్దిదూరం వచ్చి, ఇక ముందుకు వెళ్ళలేక, ఒక్కొక్కటే ఆగిపోయాయి. ఏరు ఇసక పర్రలోకి మళ్ళింది. ఒడ్లు ఒరుసుకొని, కరిగి నీళ్లలో పడుతున్నాయి. వెళ్ళేకొద్దీ మార్గం విశాలమౌతోంది. గట్లు ఒరుసుకొని పడుతున్నప్పుడల్లా వింత శబ్దం వస్తోంది.

మళ్ళీ ఏదో చిట్టడివి. మైదానం. పొలాలు. అలిసిపోయినప్పుడు అక్కడక్కడా కొద్దిసేపు ఆగి, విశ్రాంతి తీసుకొని, మళ్ళీ ముందుకు వెళ్ళిపోతోంది ఏరు. గోతుల్లో దిగబడిపోయిన నీళ్ళు కదలలేక అక్కడే ఉండిపోయాయి. పక్కలకు చెదిరిపోయినవి మళ్ళీ వెనక్కు రావడం ఇష్టంలేక అక్కడే భూమిలోకి ఇంకిపోయాయి.

వర్షం మెల్లమెల్లగా తగ్గి, సన్నగా తుంపర పడుతోంది. ఆకాశంలో మబ్బులు బీటలువారి, ముక్కలు ఊడి, దూరంగా విసిరివేయబడ్డట్టు చెదిరిపోయాయి. ఒక ముక్క ఏనుగులా బరువుగా కదిలి, కొండ వెనక్కు

వెళ్ళిపోయింది. మరో మేఘం గాలిలో పడవలా ఓమూలకు కొట్టుకుపోయింది. ఇంకొకటి కుక్కపిల్లలా నిలుచొని, చూసిచూసి, చెట్ల గుబురుల్లో చిక్కడిపోయింది.

చూస్తుంటే ఒక్కో మేఘం ఒక్కో ఆకారంలో కదిలిపోతోంది. మనిషి చూపుకూ భావనకూ సన్నిహిత సంబంధం ఉంది. భావన లేకపోతే మనిషి చూపుకు అందంలేదు. మనిషి వట్టి చూపుతోనే తృప్తి పడడు. భావన అనేది మనిషి సంపాదించుకున్న వరం. ఆ శక్తి ఉంది గనుక, మనిషి చూపులోనే గాక, ప్రతీ చిన్న విషయంలోనూ దాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. చిన్న సంఘటనని పదిమంది నోటిద్వారా పంపితే అందమైన కథ తయారౌతుంది. దానికి కారణం మనిషి తన భావనాశక్తిని ఉపయోగించడమే. ఓ సంఘటనను, అది జరుగుతుండగా చూసిన దానికన్నా, దాన్ని చెప్తుంటే వినడంలో చాలా ఆసక్తీ అందమూ ఉంటాయి. చెప్పిన దానిలో భావనతో కూడిన కల్పన ఎక్కువ.

మేఘాలు దూరంగా తప్పుకొని, ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. మేఘాలు మూసుకొని పోయిన చీకటి, చెట్ల గుబురులలోనూ, కొండలవెనకా దిగబడిపోయింది. సూర్యకిరణాలు ఏటవాలుగా జారి, ఏటిని మండిస్తున్నాయి. అసలే ఎర్రటి నీరు. దానికి తోడు కిరణాల మంట. యుద్ధం ముగిసిన సాయంకాలం అక్కడ పెద్ద వర్షం పడి, ఆ స్థలాన్ని కడిగి శుభ్రంచేసి, రక్తపునీటిని ఎక్కడో దూరంగా తీసుకుపోయి, వదిలివద్దామని బయలుదేరినట్టుంది.

మిగిలిపోయిన ఒక్కగానొక్క ఆఖరు మేఘపు తునకా తప్పుకోగా, వాలిన లేతకిరణం ఒకటి ఏటిమీద మండింది. ఆ కిరణం వాలిన చోట, అస్పష్టంగా పసుపురంగులో ఏదో మెరిసింది. దగ్గరనుండి చూసినప్పుడు, నీళ్ళలో అడవి చామంతిపువ్వు తేలి వస్తోంది.

ఏ కొండల్లోంచి ఏరు దాన్ని మోసుకొచ్చిందో మరి, నీళ్ళలో తడిసి తడిసి, చలికి ముడుచుకుపోతున్నట్టు రేకుల కొనలు వంకర్లు తిరిగిపోయాయి. పసుపురంగు నీళ్ళలో కరిగిపోయినట్టు, కొద్దికొద్దిగా తెల్లబడుతోంది. అసలు అడవి చేమంతిలా లేనే లేదు. మరేదో పువ్వులా ఉంది. కొన్నివేల సంవత్సరాల కిందట, అడవి చామంతి ఎలా ఉండేదో, అలా ఉందది.

డార్విన్ పరిణామవాదాన్ని బట్టిచూస్తే, ఈనాటి ప్రాణులన్నింటికీ మూలం అమీబా. ఏకకణజీవి పెరిగి, చీలి, రకరకాల రూపాలై, సృష్టి విశాలమౌతూ వస్తోంది. దేనికీ స్థిరరూపం లేదు. పరిస్థితులకు అనుగుణంగా ప్రాణి పరిణామమందుతూ, సృష్టి రూపాన్ని మారుస్తోంది. అనారిత్వంలోంచి, సృష్టి అందంలోనికి ప్రయాణిస్తుంది. కోతిలోంచి పరిణామమంది మనిషి వచ్చాడు. మనిషిలోంచి పరిణామమంది మరో రూపం వస్తుంది. ఏదీ స్థిరం కాదు. కొన్నివేల సంవత్సరాల కిందట మనిషికీరూపం లేదు. ఈ సిద్ధాంతాన్ని అంగీకరిస్తే, కొన్నివేల సంవత్సరాల కిందట గులాబీ పుష్పానికి ఈనాటి రూపం ఉండేది కాదని ఒప్పుకోవాలి. తామరపూలు ఎర్రగా, మృదువుగా, అందమైన స్త్రీ కళ్ళలాంటి రేకల్తో ఉండేవి కాదు. తాటిచెట్టు పొడవుగా స్థంబంలా ఎదిగి, తలమీద కుచ్చులటోపీ పెట్టుకున్నట్టుగా ఉండేది కాదు. సన్నజాజులు సన్నగా, మత్తెక్కించి, కోర్కెలు

రెచ్చగొట్టే ఈనాటి సువాసనను ఇచ్చేవికాదు. అంతకు మరికొన్ని వేల సంవత్సరాల కిందట అసలు అవి సృష్టిలో ఉండేవి కాదేమో!

చామంతి నీళ్ళలో మునుగుతూ తేలుతూ వస్తోంది. ఓ మధుపాయి ఎక్కడ్నుంచో ఎగిరివచ్చి, గాలిలో దానిచుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వెంబడిస్తోంది. ఆ తుమ్మెద దాన్ని వెంబడించడం దానికి ఇష్టంలేదు కాబోలు, అర్థాంతరంగా యవనం రాలిపోయిన స్త్రీ, వయసులోని పురుషుణ్ణి చూసి బాధపడ్డట్టు దాని కళ్ళు చెమ్మగిల్లాయి.

"మధుపాయీ ఇప్పుడా నువ్వు రావడం? ఉదయమంతా కళ్ళలో వత్తులు వేసుకొని చూసానే! ఆ రాళ్ళకింద చీకట్లో కలిసిపోకుండా, నన్ను నేను కాంతులతో వెలిగించుకొని చూసానే! కాని ఎవరూ నావైపు చూడనే లేదు. అంతా అయిపోయాక ఇప్పుడు నావెంట పడితే మాత్రం ప్రయోజనం ఏమిటి? ఏమివ్వగలను నీకు? నా యవ్వనం నీళ్ళపాలైపోయింది" అన్నట్టు జాలిగా బాధగా చూసి, తన ముఖాన్ని కనబడనీయకుండా నీళ్ళలో దాచుకుంటోంది.

పుష్పానికి దుఃఖం కూడా వస్తోంది. రేకలమీదకు జారిన నీటిబిందువులు మెల్లగా జారి ఏటిలో కొట్టుకుపోతున్నాయి. ఈ మధుపాయి మరో గంట ముందుగా వచ్చుంటే ఎంత బాగుండును. వర్షంలో తడిసి చలికి ముద్దయిపోయిన దాన్ని దగ్గరకు తీసుకొని, వెచ్చగా రేకలతో కప్పి, దాని శరీరానికి అత్తర్లు పులిమి, తాగడానికి మకరందాన్ని ఇచ్చి, దేవుడిలా పూజించేది. ఇప్పుడేముంది తనకు ఇవ్వడానికి? అంతా అయిపోయింది. రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంలో ఒక్కరూ తనవేపు రానేలేదు. ఉదయం కళ్ళు తెరిచిన దగ్గరనుండీ ఎవరైనా వస్తారేమోనని ఎదురుచూస్తూనే ఉంది. అదేం వర్షమో, మిన్నూ మన్నూ ఏకమైనట్టు ఒకటే వర్షం! ఎక్కడో, ఏదో మధుపాయి ఆకలితో అరుస్తున్నట్టు శబ్దంవస్తే, తలవంచి రాతికిందనుంచి చూస్తోంది తను. ఏమీ కనిపించక కళ్ళు పొడుచుకొని అటూ ఇటూ చూస్తుంటే, ఎవరో పక్కవాటుగా వచ్చి మెడమీద ఒక్క గుద్దు గుద్దారు. అంతే, తూలి పడిపోయింది తను. స్పృహ వచ్చేసరికి, రెండుచేతులతో ఎవరో తనను ఎత్తుకొని, ఎక్కడికో లాక్కుపోతున్నారు.

కళ్ళు విప్పి చూసింది తను. ఎర్రటి ఏరు. తన మెడ గుద్ది, పడగొట్టిన ఎండిపోయిన మోడుకూడా పహరా కాస్తున్నట్టు తనవెంటే వస్తోంది. తన యవ్వనమంతా నీళ్ల పాలైపోయింది. ప్రాణాలు గిలగిల లాడుతున్నాయి. చూపుకూడా దిగజారిపోతోంది. ఇంకెంతోసేపు తను బతకలేదు. ఆఖరి క్షణాలు ప్రవేశించాయని అర్థమౌతూనే ఉంది. ఏదో మగత. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఎర్రటి ఏరు చీకటి సముద్రంలా కనిపిస్తోంది.

పుష్పానికి శోష వచ్చేసింది. ఏమీ కనిపించడం లేదు. చుట్టూ చీకటి సముద్రం. అందులో ఎక్కడినుంచో ఓ వెలుగురేఖ పడుతోంది. ఆ వెలుగురేఖ అవతలి చివర ధగధగా మెరుస్తోన్న ఇంద్రధనుస్సులోని రంగులు. ఎవరో పెద్ద చక్రాన్ని తిప్పుతున్నారు. ఆ చక్రానికి సప్తవర్ణాల ఆకులున్నాయి. చక్రం తిరుగుతుంటే రంగులు కనిపించడంలేదు. అంతా ఒకటే రంగు. తెలుపు రంగు.

“ఇదిగో...ఇటే, ఇటే...” అని దానికి చెయ్యందించారు. ఆ చేతిని అందుకొని, గట్టిగా పట్టుకొని, ఒక గెంతు గెంతింది పుష్పం. పుష్పం నీటిలో మునిగిపోయింది. అది మళ్ళీ పైకి వస్తుందేమోనని మధుపాయి ఏటి వెంబడే ఎగురుతూ వెళ్ళింది. ఎవరికీ వినిపించకుండా రహస్యంగా పిలిచింది. చివరికి గొంతెత్తి పాట పాడింది. కాని పుష్పం మళ్ళీ కనిపించలేదు.

ఇందాకట్నుంచీ ఏరు ఆ మధుపాయిని చూస్తూనే ఉంది. దాన్ని చూస్తూ ఉంటే, ఏరుకు నవ్వొస్తోంది. ఆ నవ్వును ఆపుకోలేక పైకే నవ్వేసింది. మధుపాయికి కోపం వచ్చింది. అభిమానం దెబ్బతింది. నోట్లో గొణుక్కుంటూ వెనక్కు వెళ్ళిపోయిందది.

“లేకపోతే దగ్గరకు పిలిచి, రంగులూ, సువాసనలూ వంటికి అద్ది, తాగటానికి తేనె ఇస్తే, ఈ మధుపాయిలు వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ, పాదాలతో ఆ పుష్పాలనే ఒక తన్ను తన్ని మరీ వెళతాయి. వీటికి ఇలానే జరగాలి. కృతఘ్నులు” అనుకుంది ఏరు. అక్కడినుండి కదిలి వెళ్ళిపోయింది.

అటూ ఇటూ గట్లు. వాటిమధ్య ఏరు పరుగెడుతోంది. స్వేచ్ఛగా మెలికలు తిరిగి, ఇష్టంవచ్చినట్టు ప్రయాణం చేస్తూ, ఇంతవరకూ వచ్చింది గాని, ఇప్పుడా స్వేచ్ఛను ఎవరో గట్ల మధ్య బంధించేసారు. ఆ గట్లు తీసుకెళ్ళే మార్గంలోనే వెళ్ళాలి. అటూ ఇటూ ఎత్తైన గట్లు.

ఆ గట్ల వెనక ఏం వింతలున్నాయోనని, ఎగిరెగిరి చూసుకుంటూ వెళుతోంది ఏరు. దూరంగా తాటిచెట్ల తలలు కనిపిస్తున్నాయి. తాటిచెట్ల వెనక ఆకాశం తగలబడిపోతోంది. ఏరుకు ఆదుర్దా ఎక్కువైంది. తగలబడిపోతున్న ఆకాశాన్ని ఆర్పుదామని వేగం హెచ్చించింది. దృష్టంతా అటే పెట్టుకొని, పక్కలకు చూడకుండా పడమటికి వెళ్ళిపోతోంది.

ఎంతదూరం ప్రయాణం చేసినా తగలబడుతున్న ఆకాశం దగ్గర కావడంలేదు. ఎవరో వెళ్ళి మంటల్ని ఆర్పేసినట్టున్నారు. ఆకాశంలో ఎరుపురంగు క్రమక్రమంగా మాయమైపోయింది. ఆ మండిపోయిన ఆకాశంలోనుంచి నల్లని నుసి రాలినట్టుగా మెల్లమెల్లగా చీకట్లు రాలుతున్నాయి.

వెనక వైపునుంచి ఎవరో తొంగిచూసినట్టనిపించి, మలుపు తిరుగుతూ ఒకసారి వెనక్కు తిరిగి చూసింది ఏరు.

చంద్రుడు ఏటిమీదకు వంగి, ఆ నీళ్ళలో తన మొహం చూసుకుంటున్నాడు. తుమ్మచెట్టు వెనక చిక్కడిపోయిన చంద్రుడు మెల్లమెల్లగా చిక్కుల్ని విడిపించుకొని, పైకి వచ్చేసాడు.

ఏదో వింతలోకంలోకి వెళ్ళినట్టుంది ఏరుకు. కలలో కనిపించే అందమైన ప్రకాశంలాంటి కాంతి అది. కిరణాలు మంచుగడ్డ లోనుంచి దూరి వచ్చినట్టు చల్లగా ఉన్నాయి. అదో కొత్తలోకం. అక్కడ అప్పుడే పాలవర్షం కురిసి వెలిసిపోయింది. ఆ లోకంలో గాలిలో “ఈథేన్” ఎక్కువ. అందువల్ల అక్కడ అన్నీ శీతలకిరణాలే! గాలికి కూడా వింత పరిమళం ఉంది.

ముందుకి వెళ్ళిపోతే ఈ ప్రకాశం, ఈ అందం లభించవేమోనని భయంతో ఏరు మందంగా కదులుతోంది. అటూ, ఇటూ చూసుకుంటూ, మెలికలు తిరుగుతూ, ఒక్కొక్క వింతనే పరిశీలిస్తూ వెళ్తోంది.

దూరంగా ఒకచోట భూమ్మీద కూడా నక్షత్రాలు వెలుగుతున్నట్టు కనిపించాయి. ఏరుకు ఆశ్చర్యం వేసింది. మెల్లగా కదిలి అటే వెళ్ళింది.

గట్టు దిగువన, దూరంగా వెన్నెల్లో మెరుస్తోన్న పల్లె. తడిసిపోయిన తాటాకు పాకల మీద వెన్నెల పడి, నిలవలేక జారిపోతోంది. పాకల్లో దీపాలు నక్షత్రాల్లా మినుకుమినుకు మంటున్నాయి. కొబ్బరిచెట్లు పాకలమీదకు వంగి, వెలుతుర్ని కత్తుల్లాంటి ఆకుల్తో చీలుస్తున్నాయి. చంద్రుడి అందం కొబ్బరిచెట్ల మధ్యనే. కొబ్బరిచెట్టే గాని సృష్టిలో లేకపోతే చంద్రుడికి ఇంత అందం వచ్చేది కాదు.

ఊరు ఇంకా నిద్రపోలేదు కాబోలు ఊళ్ళోనుండి పాటలూ, తిట్లూ, కుక్కల అరుపులూ గజిబిజిగా వినిపిస్తున్నాయి. ఎక్కడో ఏదో పెళ్ళి జరుగుతున్నట్టుంది. సన్నాయి మేళం, మద్దెల చప్పుడూ గాలిలో ఎగిరి వస్తున్నాయి.

ఊరికి రెండువేపులా ఏటిగట్టుంది. గట్టు వెంబడే వెళ్ళి, సగం ఊరిని అక్కడ్నుండే చూసి, ముందుకి వెళ్ళబోయింది.

సరిగ్గా అప్పుడే ఎవరో తెల్లని బట్టల్లో వెన్నెలని మోసుకొని, పాకల్లోంచి ఏటి వడ్డుకు సన్నటి కాలిబాటలో పరుగెత్తుకు వస్తున్నారు. పొలాలకు అడ్డంపడి వచ్చి, గట్టెక్కి, వగరుస్తూ నిల్చున్నారు. చనిపోయేముందు ప్రాణం గింజుకున్నట్టు గాలికి చీర పవిట గింజుకుంటోంది. చీర కుచ్చిళ్ళు, అసమర్థుడి ఆశలా, ఉండిఉండి గాలిలో ఎగిరి చప్పబడిపోతున్నాయి. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఆమె. గట్టున నిల్చొని ఏరువంక నిశ్చలంగా చూస్తోంది. ఆమె చెంపలమీద వెన్నెల వాలి, చెక్కిళ్ళు పాలరాతిలా మెరుస్తున్నాయి. కుడివేపు బుగ్గమీద కాటుకమచ్చ తెల్లటి చెక్కిలిమీద మరీ నల్లగా కనిపిస్తోంది. పాలరాతి గచ్చుమీద నల్లటి సిరాచుక్క వలికినట్టుందది. కలువపూవు మీద కందిరీగ వాలినట్టుంది. కళ్ళు నీళ్ళలో తడిసి తడిసి ఉబ్బిపోయినట్టున్నాయి. కళ్ళకింద రెప్పల నీడలు పడి, గుంటలు మరీ లోతుగా కనిపిస్తున్నాయి. ఆ గుంటల్లోంచి కన్నీటి ప్రవాహాలు మైదానాల్లాంటి చెంపలమీదుగా ప్రవహించి, కంఠంకింద చీకటి సముద్రంలో కలిసిపోతున్నాయి.

ఏరుకు ఏదో జ్ఞాపకం వచ్చి, చటుక్కున నీళ్ళ అడుగున కొట్టుకొస్తున్న చామంతిపువ్వును ఒడ్డుకు నెట్టింది. నీళ్ళలో మునుగుతూ తేలుతూ వెన్నెల్లో మెరిసిపోతోంది పువ్వు. ఏ స్త్రీ నుదిటి తిలకమో గంగపాలై ఎర్రబడ్డట్టున్న ఏటిలో మాంగల్యపు పసుపుకొమ్ములా ఉందది.

గట్టుమీద నిలుచున్న అమ్మాయి పువ్వునే చూస్తూ వుండిపోయింది.

అకస్మాత్తుగా ఆమె వెనుక, పాకల్లో పెద్ద పెట్టున సంచలనం బయలుదేరింది. అరడజనుమంది జనం ఇటే పరుగెత్తుకొస్తున్నారు. “అమ్మాయ్, అమ్మాయి, ఏమిటిది…ఒద్దు…ఆగు…ఏమిటిది…ఒద్దు…ఆగు…” అని అరుస్తూ పొలాలకడ్డంబడి పరుగెత్తుకొస్తున్నారు.

ఆ అమ్మాయి ఒకసారి వెనక్కు తిరిగి చూసింది. కంఠం కొసవరకూ ఊపిరి పీల్చి, కళ్ళు మూసుకొని, నీళ్ళలోకి ఒక్క దూకు దూకింది.

"అయ్యో...అయ్యో" అనుకుంది ఏరు. పిరికిదానిలా ఒక్కసారి అదిరిపడింది. ఆ అమ్మాయిని తనే చంపెయ్యబోతున్నట్టూ, తను హంతకురాలు అయిపోతున్నట్టూ భయపడిపోయింది. భయంతో అక్కడ్నుంచి పారిపోదామని పరుగుతీసింది.

వెనుక పరుగెత్తుకొస్తున్న వారు గట్టును చేరుకున్నారు. గుండెలు బాదుకుంటూ గట్టు వెంబడే పరుగెత్తారు. వాళ్ళలో ఇద్దరు ఉన్నపాళంగా నీళ్ళలోకి దూకి ఈదుతున్నారు.

కొద్దిదూరం ఏటితో పాటూ వెళ్ళి, ఆ అమ్మాయిని పట్టుకొని ఒడ్డుకొచ్చాడు ఒకడు. మిగిలినవారు పరుగెత్తుకెళ్ళి పైకి తీసారు. అప్పటికే ఆ అమ్మాయి కడుపునిండా నీళ్ళు తాగేసింది. వెల్లకిలా పడుకోబెట్టి, పొట్టమీద నొక్కి నీళ్ళు కక్కిస్తున్నారు.

ఎందుకు ఆ అమ్మాయి నీళ్ళలో దూకేసిందో ఏరుకు అర్ధం కాలేదు.

గట్టు కింద పొలాల్లో మడులు కట్టడానికని, ఎవరో ఏటిలో మట్టి తోలించుకొని వెళ్ళినట్టున్నారు. అక్కడ గుంట ఒకటి ఉంది. ఆ గుంటలోకి మళ్ళీ ఏం జరుగుతుందోనని చూస్తుంది ఏరు.

గట్టుకింద జొన్నచేలో పెళపెళా విరిగిపోయాయి మొక్కలు. ఏమిటోనని గట్టుమీదకంటా పాకి తొంగిచూసింది ఏరు.

ఓ యువకుడు జొన్నకర్రల్ని తొక్కుకుంటూ పరుగెత్తుకొచ్చాడు. గుండె తెగిపడిపోయేటంత గట్టిగా వగరుస్తున్నాడు. స్పృహలేకుండా పడిఉన్న అమ్మాయికేసి పిచ్చిగా చూసి, అమాంతం మెడకింద చెయ్యివేసి, పైకి లేవదీసి, "కాంతం, కాంతం...నేనూ నీ భద్రాన్ని. నీ కోసం మూడువందల మైళ్ళ దూరంనుంచి కళ్ళల్లో జ్యోతులెట్టుకొని వచ్చాను. ఇలా చూడవూ ఒక్కసారి" మాటలు బొంగురుపోయి, పలకలేక ఏడుస్తున్నాడు యువకుడు.

యువతి మెల్లగా కదిలింది. బిగుసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా పైకెత్తి పట్టుకొని, మరో లోకంలోకి చూస్తున్నట్టు చూసింది.

తడిసిపోయిన ఆ కళ్ళలో ఒక మూల కొద్దిపాటి వెలుగు వెలిగి క్షణంపాటూ మెరిసింది. "వచ్చావా భద్రం? కాని...ఇప్పుడా...రావడం...సమయం..."

ఏరుకు అంతా అర్ధమైంది. ఏం జరిగిందో దానికి తెలిసిపోయింది. కూడా తీసుకొచ్చిన చామంతిపువ్వును అక్కడే, గట్టుదగ్గరే వదిలేసి, అక్కడ్నుంచి కదిలి వెళ్ళిపోయింది ఏరు.

***0***

# ఆఖరు పేజీ విన్నపాలు

- మీకు తెలిసిన, ఆసక్తి ఉన్న పాఠకులకు కథామంజరి పరిచయం చేయండి. subscribe@kathamanjari.in కి వారు వారి మెయిల్ పంపిస్తే చాలు.

- కథకులు మంచి కథలను ఎంచి, పోటీని పండగ చేయండి.

- కరోనా అదుపు కోసం ప్రభుత్వం సూచిస్తున్న జాగ్రత్తలను తప్పక పాటించండి.

- సంచిక మీద అభిప్రాయాన్ని తెలియచేయండి.

## వినాయక చవితి శుభాకాంక్షలతో ..

